మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



జాతీయ రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం 3లో

సంపుటి 07, సంచిక: 219 | బుధవారం | 10-07-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 8+8 | వెల రూ. 5.00



## సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం

ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆల్‌రౌండ్ క్రికెటర్

హైదరాబాద్ పరిసరాల్లో ఇంటి స్థలం గుర్తించాలని అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చిన అల్ రౌండ్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందించారు. టి20 వరల్డ్ కప్‌ను గెలుచుకున్న అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్ మంగళవారం ఉదయం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా తరువాయి 2లో

## టీమ్ ఇండియా ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్



**ముంబయి:** టీమ్ ఇండియా ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియమితులయ్యారు. ఈ మేరకు బిసిసిఐ ప్రధాన కార్యదర్శి జైషా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. క్రికెట్ కెరీర్‌లో జట్టు కోసం ఎన్నో పాత్రలు పోషించిన గంభీర్.. ఇండియన్ క్రికెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్తారన్న నమ్మకం తరువాయి 2లో

# పరీక్షల వాయిదాకు గూడుపుఠాణి...

## పరీక్షలు రద్దు చేయాలని ప్రతిపక్షం కుట్ర



దీక్షల్లో కెటిఆర్, హరీశ్‌రావు కూర్చుంటే రక్షణ కల్పిస్తాం

నాడు మా ఎంఎల్‌ఎలను చేర్చుకున్నప్పుడు లేని బాధ నేడెందుకు?

అప్పుడే అయిపోలేదు... ముందుంది మొసళ్ల పండుగ....

మహబూబ్‌నగర్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్



ప్రజాప్రతినిధులు పార్టీల ఫిరాయింపులకు సంబంధించి బిఆర్‌ఎస్ నేతల వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. మాజీ సిఎం కెసిఆర్‌కు ప్రజాస్వామ్యం ఇప్పుడు గుర్తుకువచ్చిందా అని మండిపడ్డారు. గ్రూప్స్, డిఎస్‌సి పరీక్షలు వాయిదా వేయాలని దొంగలు గూడుపుఠాని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు చేశారు. ఆ తరువాత జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి, పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సూచనలను ఈ ప్రభుత్వం తప్పక పాటిస్తుందన్నారు. 'ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ మారుతున్నారని కెసిఆర్ మాట్లాడుతున్నారు. గత పదేళ్లలో ఎంతో మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకోలేదా?. ఈ ప్రభుత్వం నెల రోజులలోనే కూలిపోతుందని కెసిఆర్ అనలేదా? మేం మీలా దొంగ దెబ్బ తీయడంలేదు.. మీలా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేదు. మా ఎమ్మెల్యేలను నువ్వు గుంజుకున్నప్పుడు నీకు ప్రజాస్వామ్యం గుర్తు రాలేదా?, బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటై ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూశారు.. కాంగ్రెస్ పార్టీతో పెట్టుకుంటే నీకు పుట్టగతులు ఉండవని ఆనాడే చెప్పా.. కెసిఆర్ ఇక నీకు రాజకీయ మనుగడ లేదు.. చేతనైతే అభివృద్ధికి సహకరించు.. లేకపోతే ఫామ్ హౌస్ లోనే కూర్చో.. గత నాలుగు రోజులుగా హరీష్, కెటిఆర్ ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు... తన దాకా వస్తే గాని వాళ్లకు నొప్పి తెలియలేదు' అని సిఎం దుయ్యబట్టారు. ఇంకా అయిపోలేదు.. ముందుంది, ముస్సళ్ళ పండగ అని హెచ్చరించారు. 11 వేలకు పైగా పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చామని, ఎన్నో ఏళ్లుగా జరగని డిఎస్‌ని అడ్డుకోవాలని కొందరు దొంగలు గూడుపుఠాని చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ హయాంలో ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్ముకున్నారని విమర్శించారు. 'గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ వెనుక ప్రతిపక్షాల కుట్ర ఉంది. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలిస్తే మళ్లీ కోర్టుకు వెళ్తారు. నోటిఫికేషన్‌లో లేకుండా 1:100 నిష్పత్తిలో ఎలా పిలుస్తారని కోర్టు మళ్లీ రద్దు చేస్తుంది. పదే పదే పరీక్షలు రద్దు చేయాలని ప్రతిపక్షం కుట్ర చేస్తోంది. పరీక్షలు వాయిదా వేయాలనే డిమాండ్ వెనుక కోచింగ్ సెంటర్ల కుట్ర కూడా ఉంది. నిరాహార దీక్షల్లో పేద విద్యార్థులు, పేద నేతలు మాత్రమే ఎందుకు కూర్చుంటున్నారు. దీక్షల్లో కెటిఆర్, హరీశ్ రావు ఎందుకు కూర్చోవడం లేదు. వారిద్దరూ ఆర్ట్స్ కాలేజీ ముందు దీక్షకు కూర్చుంటే.. రక్షణ కల్పిస్తాం. పరీక్షలు తరువాయి 2లో

### త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల నేతలు ప్రధాన భూమిక ఉంటుందని, అందుకే ఈ ఎన్నికలను జాప్యం లేకుండా కొద్ది నెలల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని సిఎం ప్రకటించారు. కాంగ్రెస్ కార్యకర్తల సమన్వయంతో పార్టీ అధికారంలోకి వచ్చిందని, పార్టీకి కార్యకర్తలు ఎంతో ముఖ్యమని సిఎం పేర్కొన్నారు.



## ఫీజు డబ్బులతో బెట్టింగ్

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాపక్షం/ఘట్‌కేసర్

ఫీజు చెల్లించాలని డబ్బులు పంపిస్తే బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఓ బీటెక్ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధితో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన కొండూరు శ్రీనివాస్ కుమారుడు నితిన్ (21) పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ శ్రీనిధి ఇంజనీరింగు కళాశాలలో బిటెక్ మూడవ సంత్సరం చదువుతున్నాడు. ఇటీవల కళాశాల ఫీజు చెల్లించమని తల్లిదండ్రులు లక్షా ముప్పై వేల రూపాయాలను నితిన్‌కు పంపించారు. కళాశాల ఫీజు చెల్లించకుండ పోగొట్టుకున్న డబ్బులు గురించి తల్లిదండ్రులకు చెప్పకుండా తీవ్ర మనస్థాపానికి గురైన నితిన్ తరువాయి 2లో

## ఉగ్రదాడిలో డ్రైవరే తొలి టార్గెట్

తప్పక ప్రతీకారం తీర్చుకుంటామన్న కేంద్ర సర్కార్

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లో కథువా జిల్లాలోని మాచేడి ప్రాంతంలో ఇండియన్ ఆర్మీ కాన్వాయ్‌పై సోమవారం రాత్రి ఉగ్రవాదులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే జవాన్ల ప్రాణాలు తీసిన ఉగ్రవాదుల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగుతోంది. కథువాలోని మాచేడీ ప్రాంతంలో ముష్కరుల కోసం అణువణువూ జల్లెడపడుతున్నారు. గాలింపు చర్యల్లో హెలికాప్టర్లను సైతం వినియోగిస్తున్నారు. ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోకుండా ఉండబోమని రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమణి స్పష్టం చేశారు. మృతి చెందిన సైనికుల కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆ ఐదుగురు జవాన్లు ఉత్తరాఖండ్‌కు చెందిన వారే. ముందుగా రెక్కీ నిర్వహించి స్థానికుల సాయంతో అత్యాధునిక ఆయుధాలు ఉపయోగించి ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కథువా జిల్లాలో సోమవారం జరిగిన దాడికి గతంలో తరువాయి 8లో

## జెఎన్‌టియులో చట్నీలో ఎలుక...

అధికారులపై మంత్రి ఆగ్రహం

తక్షణ విచారణకు ఆదేశించిన దామోదర రాజనర్సింహ్మా



ప్రజాపక్షం/ సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలోని చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లోని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో చట్నీలో ఎలుక కనిపించిన ఘటన కలకలం రేపింది. దీనిపై తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మా స్పందించారు. ఘటనకు సంబంధించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్, ఆర్‌డిఒ, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న హాస్టళ్లు, క్యాంటీన్లను తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలను తయారు చేసే నిర్వాహకులు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ లైసెన్స్ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం హోటళ్లు, రెస్టారంట్లతో పాటు బేకరీలు, హాస్టళ్లు, క్యాంటీన్లు, ఆహార పదార్థాలు తయారు చేసే నిర్వాహకులపై నిఘా ఉంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు తరువాయి 2లో



## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం

ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై మంత్రి పొన్నం ఆగ్రహం

ఆయనకు స్వాగతం పలికే సమయంలో స్వల్ప తోపులాట

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. సోమవారం ఉదయం గణపతి పూజతో కల్యాణోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖమంత్రి కొండా సురేఖ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి కల్యాణోత్సవానికి పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయితే, ఈ కార్యక్రమం కోసం తరువాయి 2లో

### 13 అసెంబ్లీ స్థానాల్లో

## నేడు ఉప ఎన్నికలు

ఇండియా కూటమి, ఎన్‌డిఎ మధ్య మరో ఎన్నికల యుద్ధం



**న్యూఢిల్లీ :** దేశంలో ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఈ నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ, ప్రతిపక్ష ఇండియా కూటమి మరోసారి యుద్ధరంగంలో తలపడేందుకు సిద్ధమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు స్థానాలు (రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ (ఎస్‌సి), బగ్దా (ఎస్‌సి), మాణిక్‌తాల), బీహార్‌లోని రూపౌలి, పంజాబ్‌లోని పశ్చిమ జలంధర్, హిమాచల్‌లోని డెహ్రా, హమీర్‌పూర్, నాలాగఢ్, ఉత్తరాఖండ్‌లోని బద్రినాథ్, మంగ్లూర్, మధ్యప్రదేశ్‌లోని అమర్వారా, తమిళనాడులోని విక్రవండి నియోజకవర్గల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో అభ్యర్థులు మృతి చెందడం లేదా రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ కీలక ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఒకటైన పశ్చిమ బెంగాల్‌లో నాలుగు సీట్లకుగానూ మూడింటిని 2021లో జరిగిన ఎన్నికల్లో బిజెపి గెల్చుకుంది. అయితే ఆ స్థానాల్లోని అభ్యర్థులు తరువాయి 2లో

## శాంతి పునరుద్ధరణకు భారత్ సిద్ధం

బాంబులు, తుపాకులు, బుల్లెట్ల మోత మధ్య శాంతి చర్చలు విజయవంతం కాబోవు

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశంలో మోదీ



**మాస్కో:** శాంతి పునరుద్ధరణకు భారతదేశం అన్ని రకాల మార్గాలలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉక్రెయిన్‌తో సంఘర్షణకు పరిష్కారం యుద్ధరంగంలో దొరకదని, బాంబులు, తుపాకులు, బుల్లెట్ల మోత నడుమ శాంతి చర్చలు విజయవంతం కాబోవని ఆయన చెప్పారు. రెండు రోజుల మాస్కో పర్యటనలో భాగంగా మంగళవారం భారత–రష్యాల నడుమ 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. చర్చల ప్రారంభాన్ని టెలివిజన్‌లో ప్రసారం చేశారు. ఈ సందర్భంగా భారత ప్రధాని మోదీ మాట్లాడుతూ అమాయక చిన్నారుల మరణాలు హృదయాన్ని ద్రవింపజేస్తున్నాయని, అవి అత్యంత బాధాకరమని అన్నారు. భారతదేశం శాంతి వైపు నిలబడుతుందని, చర్చల ద్వారానే యుద్ధాలను పరిష్కరించుకోవాలని అంతర్జాతీయ సమూహానికి స్పష్టం చేశారు. కొత్త తరం ఉజ్వల భవిష్యత్తు కోసం శాంతి తప్పనిసరి అని, యుద్ధక్షేత్రంలో పరిష్కారం లభించదన్నారు. ప్రధాని తన ప్రసంగంలో భాగంగా సోమవారం తరువాయి 8లో

## నిర్వాహకులదే బాధ్యత...

కుట్ర కోణాన్నీ త్రోసిపుచ్చలేం

యుపి ప్రభుత్వానికి సిట్ తొక్కిసలాట ఘటన నివేదిక



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విస్తృతంగా విచారణ చేసింది. ఆ నివేదికను మంగళవారం ప్రభుత్వానికి అందించింది. ఘటన వెనుక భారీ కుట్ర దాగి ఉందన్న విషయాన్ని త్రోసిపుచ్చలేమని తెలిపింది. నివేదిక ఆధారంగా యుపి ప్రభుత్వం స్థానిక ఎస్‌డిఎం, ఒక సర్కిల్ అధికారి, మరో నలుగురిని సస్పెండ్ చేసింది. కాగా, స్థానిక యంత్రాంగంలో లోపాలు కూడా తొక్కిసలాట జగరగడానికి కారణమయ్యాని, ఫలితంగా 121 మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింనట్లు సిట్ తన నివేదికలో వెల్లడించింది. అదే విధంగా ఘటనకు నిర్వాహకులదే బాధ్యత అని, రద్దీని నియంత్రించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ఎత్తిచూపింది. అధికార వర్గాల సమాచారం ఆధారంగా పాలనా యంత్రాంగాని కూడా బాధ్యత అని సిట్ తేల్చింది. స్థానిక పోలీసులు, అధికారులు కార్యక్రమంగా సీరియస్‌గా తీసుకోలేదని, సీనియర్ అధికారులకు తగిన సమాచారం ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రత్యక్ష సాక్షులు, ఇతర సాక్ష్యాల ఆధారంగా ప్రమాణానికి ఈవెంట్ ఆర్గనైజర్ల నిర్వహణ వైఫల్యమే కారణమి ప్రాథమికంగా తేలినట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో వెల్లటైనట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. అయితే కుట్ర వెనుక భారీ కుట్ర దాగి ఉండడాన్ని త్రోసిపుచ్చలేమని, ఘటనపై ఇంకా క్షుణ్ణంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని తరువాయి 8లో

# బైడెన్ అహంభావి.. అందుకే పోటీ నుండి తప్పుకోడు:ట్రంప్



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసే అవకాశాన్ని జోబైడెన్ వదలుకుంటారని తాను భావించడం లేదని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఆయన తన అహంభావం కారణంగానే పోటీలో కొనసాగుతున్నారని చెప్పారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ బైడెన్ శారీరక, మానసిక దృఢత్వంపై ఆందోళనతో పోటీ నుండి తప్పుకోవాలని డెమొక్రాట్‌ల నుండి ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ బైడెన్ పోటీలో కొనసాగుతారని అన్నారు. ఆయనకు అహంభావం ఉందని, అందుకే పోటీ నుండి తప్పుకోరని చెప్పారు. బైడెన్‌కు అధికారం ఉన్నందున ఆయన పోటీ నుండి విరమించుకునే అవకాశమే లేదన్నారు. ఒకవేళ బైడెన్ తప్పుకుంటే ఉపాధ్యక్షురాలు కమలా హ్యారీస్ డెమోక్రటిక్ అధ్యక్ష అభ్యర్థిగా ఉండొచ్చని ట్రంప్ అన్నారు.

**బైడెన్ పార్కిన్‌సన్ చికిత్స తీసుకోవడం లేదు: వైట్ హౌజ్**



ఇటీవల తరచుగా పార్కిన్‌సన్స్ వ్యాధి వైద్య నిపుణుడు వైట్ హౌజ్‌కు రావడంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పార్కిన్‌సన్ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నారా? అనే అనుమానాలు ప్రచారంలోకి వచ్చాయి. దీనిని వైట్ హౌజ్ తీవ్రంగా ఖండించింది. సాధారణ వైద్య పరీక్షలలో భాగంగానే నరాల వైద్య నిపుణుడు వైట్ హౌజ్‌కు వచ్చారని వెల్లడించారు. ఇదిలాఉండగా తాను అధ్యక్ష రేసు నుండి తప్పుకోవాలనే వార్తలకు అమెరికా అధ్యక్షుడు , డెమోక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్ ఫుల్ స్టాప్ పెట్టారు. ట్రంప్‌ను ఓడించేందుకు తాను పోటీలో చివరి వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. ఈ మేరకు డెమోక్రాట్‌లకు ఆయన సోమవారం నాడు లేఖ రాశారు.

## అమెరికాలో నలుగురు తెలుగువారి అరెస్టు

అమెరికాలో మనుషుల అక్రమరవాణా కేసులో నలుగురు తెలుగువారిని పోలీసులు అరెస్టయ్యారు. ప్రిన్స్‌టన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసిన వారిలో చందన్ దాసిరెడ్డి (24), సంతోష్ కట్కూరి(31), ద్వారకా గుండా (31), అనిల్ మాలె (37)లు ఉన్నారు.

ప్రిన్స్‌టన్‌లోని కొలిన్ కౌంటీలో బలవంతంగా పని చేస్తున్నారనే ఆరోపణలపై వీరిని అరెస్టు చేసినట్లు స్థానిక పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఒకే నివాసంలో 15 మంది మహిళలు నేలపై పడుకోవడాన్ని చూసిన అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేశారు. అక్రమ మానవ రవాణ ర్యాకెట్‌కు ఆస్కారముందనే ఫిర్యాదుల ఆధారంగా అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# గాజాపై దాడులు ఉధృతం :50 మంది దుర్మరణం

## శరణార్థుల శిబిరాలపై బాంబులు
## వీధుల్లో ఆడుకుంటున్న ఐదుగురు చిన్నారులు మృతి

గాజాపై ఇజ్రాయిల్ బలగాలు దాడులను ఉధృతం చేశాయి. ఒకవైపు కాల్పుల విరమణ గురించి చర్చలు జరుగుతున్నా కూడా పట్టించుకోకుండా దాడులు చేస్తున్నాయి. గడచిన 24 గంటల్లో తమ ఆధీనంలో తీసుకున్న తీర ప్రాంతం వెంబడి ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో కనీసం 50 మంది పాలస్తీనీయులు మరణించగా, అనేక మంది గాయపడినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇజ్రాయిల్ ట్యాంకులు గాజా నగరంలో అంతర్గత ప్రాంతాలను ఆక్రమి స్తూ షుజాయియా, సబ్రా, తల్ అల్ హవా జిల్లాలను మీదుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతాలలో తీవ్రమైన యుద్ధం సాగుతోంది. హమాస్ సాయుధ బలగాలు, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ సంస్థలు తాము తల్ అల్ హవలో ఇజ్రాయిల్ సైనికులకు వ్యతిరకంగా యాంటీ ట్యాంక్ రాకెట్‌లను, మోర్టార్‌లను ప్రయోగిస్తున్నట్లు వెల్లడించాయి. రాత్రంతా తమ ప్రాంతంలో అనేక మార్లు పేలుళ్ళు, కాల్పుల, హెలికాప్టర్ ద్వారా దాడులు కొనసాగుతున్నాయని గాజా పౌరులు చెబుతున్నారు.తమ నిఘా వర్గాల సమాచారం ప్రకారం హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ సైన్యం గాజాలో ఉన్నట్లు సమాచారం ఇచ్చినందున తాము గాజా నగరంపై దృష్టి సారించినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. గాజా నగర వాసులను మధ్యలో ఉండే జిల్లా దెయిర్ ఎల్ బలాకు తరలి వెళ్ళాల్సిందిగా గాజా నగర వాసులకు చెప్పార ని, అయితే ఇప్పటికే ఆ ప్రాంతమంతా ఇతర చోట్ల నిరాశ్రయులైన పాలస్తీనా పౌరులతో కిటకిటలాడుతున్నట్లు ఐక్య రాజ్య సమితి వెల్లడించింది. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్ళ లో పౌరులను ఉత్తర దిశ నుండి దక్షిణం దిశగా తరలిపోవాలని ఇజ్రాయిల్ ఆదేశించింది. ఆతరువాత తన దాడులను విస్తరిస్తూ పోతుంది. గాజా నగరంలోని జైతైన్ ప్రాంతం నుండి ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో తరలి పోతూ 'తమ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని చెప్పనప్పటికీ, తామంతా బాంబులు, తుపాకీ పేలుళ్ళ శబ్దాలతో భీతిల్లిపోతున్నాయని, అందుకే తమ ఇళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నామ'ని పేర్కొంది.





సెంట్రల్ గాజాలోని నుసెయిరత్ శరణార్థుల క్యాంపులోని ఒక ఇంటిపై బాంబు పేలి ఏడుగురు మరణించారు. అలాగే ఉత్తర గాజా నగరంలో ఒక ఇంటిపై జరిగిన దాడిలో ఆరుగురు మరణించారు. ఇక గాజాలోని బురీజ్ శరణార్థి క్యాంపుపై జరిగిన ఇజ్రాయిల్ దాడిలో తొమ్మిది మంది చనిపోగా, అందులో వీధుల్లో ఆడుకుంటున్న ఐదుగురు చిన్నారులు ఉన్నట్లు అల్ జజీరా తెలిపింది.



**అమెరికా అధికారితో ఖతార్ ప్రధాని చర్చలు**

గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని ఆపడంలో భాగంగా జరుగుతున్న సంయుక్త ప్రయత్నాలలో ఖతార్, అమెరికా అధికారులు దోహాలో సమావేశమైనట్లు ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఖతార్ ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహమాన్ అల్ థానీ, అమెరికా విదేశాంగ సహాయ మంత్రి బార్బారా లీఫ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**యుద్ధాన్ని ఆపాలి: ఇజ్రాయిలీల మనోగతం**

యుద్ధానికి ముగింపు పలికి, గాజా నుండి ఇజ్రాయిలీ బలగాలను వెనక్కి రప్పించడం ద్వారా బందీలుగా ఉన్న వారిని విడిపించే దిశగా సమగ్ర ప్రణాళికకు మెజారిటీ ఇజ్రాయిలీలు మద్దతు పలికారు. ఇజ్రాయిల్ డెమోక్రసీ సంస్థ నిర్వహించిన సర్వేలో 56 మంది ఈ అభిప్రాయాన్ని ఏకీభవించారు. 29.5 శాతం మంది గాజాలో తాత్కాలిక కాల్పుల విరమణ ద్వారా కొంత మంది ఖైదీలను విడుదల చేసే ఒప్పందానికి అనూకలమని తలెఇపారు. హెజ్బుల్లా, లెబనాన్ సరిహద్దుల్లో రాజకీయ పరిష్కారం చేసుకోవాలని 42 శాతం ఇజ్రాయిలీలు కోరుకోగా, 38 శాతం మంది మిలిటరీ పరిష్కారమే సరైన చర్య అని పేర్కొన్నారు.

# సుఖదుఃఖాలలో భారత మిత్రుడు రష్యా

## ప్రవాస భారతీయుల సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**మాస్కో:**భారత దేశ చిరకాల భాగస్వామి రష్యా సుఖ దుఖాలలో మిత్రుడిగా నిలిచిందని, గడిచిన రెండు దశాబ్దాలలో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసినందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. రష్యాలో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ పరస్పర విశ్వాసం, గౌరవం అనే బలమైన పునాధులపై భారత – రష్యాల సంబంధాలు ఏర్పడ్డాయని అన్నారు. తమ బంధం కాలపరీక్షలో అనేక మార్లు పరీక్ష ఎదుర్కొన్న ప్రతీసారి మరింత దృఢంగా ఆవిర్భవించిందని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాను ఒంటరి చేసేందుకు పశ్చిమ దేశాల ప్రయత్నాలలో భాగంగా పుతిన్ నాయకత్వంపై మోదీ ప్రశంసలు కురిపించారు. ప్రభావితం చేసే ప్రపంచ విధానం దశాబ్దాలుగా కొనసాగుతుందని, కానీ ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది సంగమం తప్ప ప్రభావం కాదని, ఈ సందేశాన్ని బలమైన సంప్రదాయ ఆరాధనల సమ్మేళనం కలిగిన భారతదేశం తప్ప ఎవ్వరూ ఇవ్వలేరని పేర్కొన్నారు. బహుళ ప్రపంచ విధానం ఆవిర్భవించేందుకు బలమైన స్థంభంగా భారతదేశాన్ని చూస్తున్నారని తెలిపారు. భారత దేశం శాంతి, చర్చలు, దౌత్యనీతి గురించి మాట్లాడినప్పుడు ప్రపంచమంతా వింటుందని మోదీ అన్నారు. రష్యా, ఉక్రెయిన్‌ల యుద్ధం ఆపేందుకు చర్చలు, దౌత్యనీతి అవసరమని నొక్కి చెప్పారు. రష్యా–భారతదేశాల మధ్య ప్రత్యేక భాగస్వామ్యం పట్ల తాను దశాబ్దాలుగా మెచ్చుకునేవాడినని మోదీ తెలిపారు. రష్యా అనే పదం విన్నప్పుడు ప్రతి భారతీయుని మదిలో 'సుఖ్ దుఖ్ కా సాథీ' (కష్ట సుఖాల మిత్రుడు) అనే భావన వస్తుందని, అది విశ్వసనీయమైన భాగస్వామి అని అన్నారు. చలికాలంలో రష్యా వాతావరణం సున్నా డిగ్రీల కంటే మైనస్‌లో ఉన్నప్పటికీ భారత– రష్యా స్నేహం మాత్రం ప్లస్‌లో, పూర్తి వెచ్చగా ఉంటుందని అన్నా రు. గత రెండు దశాబ్దాలలో ఇరు దేశాల మధ్య స్నేహాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళిన తన మిత్రుడు పుతిన్‌కు ప్రత్యేక ప్రశంసలు అందజేస్తున్నానని మోదీ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి గా తనకు ఇది ఆరవ రష్యా పర్యటన అని, ఇరుదేశాల నాయకులు ఈ కాలంలో 17సార్లు కలిసారని తెలిపారు. ఈ సమావేశాలన్నీ ఇరు దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని, గౌరవాన్ని పెంపొందేలా చేశాయన్నారు. యుద్ధ సమయంలో భారతీయ విద్యార్థులను అక్కడి నుండి తరలించేందుకు పుతిన్ చేసిన సహాయాన్ని మోదీ ప్రశంసించారు. ఇందుకు రష్యన్ నేతకు, రష్యన్ పౌరులకు ధన్యవాదాలు తెలియజేశారు.

**రెండు కొత్త కాన్సులేట్‌లు :** రష్యాలో భారతదేశం రెండు కొత్త కాన్సులేట్‌లను ప్రారంభించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య వ్యాపారం, ప్రయాణాలను పెంచేందుకు ఇది ప్రేరకంగా ఉంటుందన్నారు. 'సర్ పే లాల్ టోపీ రూసీ(తలపై ఎర్రటి టోపీ రష్యాది)' అనే రాజ్‌కపూర్ పాటను గుర్తు చేసుకుంటూ అది పాత పాట అయినప్పటికీ భావోద్వేగాలు మాత్రం నిత్యనూతనమేనని మోదీ చెప్పారు. మరో భారతీయ నటుడు మిథున్ చక్రవర్తికి రష్యాలో అభిమానులు ఉన్నారని, ఇదంతా ఇరుదేశాల మధ్య లోతైన సాంస్కృతిక సంబంధాలను వెల్లడిస్తున్నాయని తెలిపారు.

## ప్రధాని మోదీకి రష్యా పౌర పురస్కారం



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీకి రష్యన్ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్'ను ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచడంలో చేసిన సేవలకు గానూ మోదీని ఈ మేరకు సత్కరించారు. ఈ పురస్కారాన్ని స్వీకరించడం తనకు గౌరవంగా ఉందని, దానిని భారత ప్రజలకు అంకితమిస్తున్నట్లు మోదీ ఎక్స్‌లో తెలిపారు. అయితే, ఈ అవార్డును 2019లోనే ప్రధాని మోదీకి ప్రకటించగా మంగళవారంనాడు మాస్కో లో ఆయనకు పుతిన్ ప్రదానం చేశారు.

## 'ఫీ' డబ్బులతో బెట్టింగ్
(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ యంనంపేట్ సమీపంలో ఖాజీపేట్ నుంచి సనత్‌నగర్ వైపు వస్తున్న గూడ్స్‌రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వేపోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని గాంధీఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని మృతిదేహాన్ని నితిన్ కుటుంబసభ్యులకు అందజేశారు.

## చట్నీలో ఎలుక... (మొదటి పేజీ తరువాయి)

సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి జెఎన్‌టియు క్యాంపస్‌లోని వంటగదిని పరిశీలించారు. వంటగతి అపరిశుభ్రంగా ఉండటంతో ప్రిన్సిపాల్, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఇలాగే ఉంటుందా? అని సిబ్బందిని నిలదీశారు. వెంటనే మెస్ కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు. వందలాదిమంది విద్యార్థులు తినే ఆహారం ఇలా అపరిశుభ్రంగా ఉండటం ఏంటని ప్రశ్నించారు. అంతకు ముందు విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోజూ తినే ఆహారంలో బొద్దింకలు, బల్లులు, ఎలుకలు కనిపిస్తూనే ఉన్నాయని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని వడ్డించాలని సిబ్బందికి సూచించారు.

## నేడు ఉప ఎన్నికలు
(మొదటి పేజీ తరువాయి)

తృణమూల్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడంతో ఖాళీ అయ్యాయి. రాయ్ గంజ్, రాణాఘాట్ దక్షిణలో కృష్ణ కల్యాణ్, ముకుత్ మాని అధికారి గతంలో బిజెపి నుంచి పోటీ చేయగా, ఇప్పుడు టిఎంసి టికెట్‌పై బరిలోకి దిగారు. బద్రినాథ్‌లో కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌ఎ రాజేంద్ర బండారి బిజెపిలో చేరారు. దీంతో ఆ స్థానం ఖాళీ కాగా, ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి లఖ్‌పట్ బుటోలాపై పోటీకి దిగుతున్నారు. ముస్లింలు అధికంగా ఉన్న మంగ్లూర్ నియోజకవర్గం లో సీనియర్ నేత ఖ్వాజీ నిజాముద్దీన్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. గతంలో ఆయన మూడుసార్లు విజయం సాధించారు. ఉత్తరాఖండ్ ఏర్పడినప్ప టి నుంచి ఈ నియోజకవర్గంలో బిజెపి ఒక్కసారిగా విజయం సాధించలేదు. కాంగ్రెస్ అభ్యర్థిపై బిజెపి కర్తార్‌సింగ్ భదానాను పోటీకి నిలిపింది. ఇక తమిళనాడులో విక్రవండిలో జరిగే ఉప ఎన్నికలను ఎఐఎడిఎంకె బాయ్‌కాట్ చేయాలని నిర్ణయం తీసుకుంది. హిమాచల్‌లో సిఎం సుఖ్విందర్ సింగ్ సుఖు సతీమణి కమలేష్ థూకూర్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. పంజాబ్‌లోని జలంధర్ పశ్చిమలో ముఖ్యమంత్రి భవత్ మాన్ ఆప్ అభ్యర్థి మహిందర్ భగవత్ తరుపున వ్యక్తిగతంగా ప్రచారం నిర్వహించారు. బీహార్‌లో ఆర్‌జెడి, జెడియు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. గంగోటాలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో రెండు పార్టీలు తమ అభ్యర్థులను నిలిపాయి. మధ్యప్రదేశ్‌లో మాజీ సిఎం కమల్‌నాథ్ కంచుకోట అయిన నియోజకవర్గంలో బిజెపి కమలేష్‌ను షాను పోటీలో నిలిపింది. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి ధీరన్ షా పోటీ చేస్తున్నారు.

## ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం
(మొదటి పేజీ తరువాయి)

కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. మహ్మద్ సిరాజ్ అం తర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే నేడు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడుగా పేరు సంపాదించుకున్నారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. సిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో లేదా చుట్టుపక్కల ప్రాంతాల్లో అందుకు అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

వాయిదా వేస్తే ప్రభుత్వానికి లాభమే తప్ప నష్టం ఉండదు. కేవలం నిరుద్యోగులకు న్యాయం చేసేందుకే పరీక్షలు వాయిదా వేయడం లేదు. విద్యార్థుల చావులతో భారాస రాజకీయం చేస్తుంది'' అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.

**పాలమూరు సీఎం వివరాలు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి వరాలు కురిపించారు. జిల్లా ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక రూపోందించి అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు నిధుల వరద పారించారు. మంగళవారం పాలమూరు జిల్లా కేంద్రానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో చేపట్టి అభివృద్ధి పనులకు అక్కడి నుంచే పర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.396.09 కోట్లు కేటాయించారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.353.66 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ.42.40 కోట్లు, ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రూ.10 కోట్ల వ్యయంతో బాలికల హాస్టల్ నిర్మాణానికి, దేవరకద్రలో రూ.6.10 కోట్ల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి, మహబూబ్‌నగర్ రూరల్‌లో రూ.3.25 కోట్ల వ్యయంతో కేజీవీబీ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. గండీడ్ మండల కేంద్రంలో రూ.6.20 కోట్లతో కేజీవీబీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే పాల మూరు యూనివర్సిటీలో రూ.13.44 కోట్ల ఖర్చుతో ఎస్టీపీ, అకాడమిక్ బ్లాక్, గ్యాలరీ పనులకు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో రూ. 37.87 కోట్లతో సీసీ రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ పనులకు, మహబూబ్‌నగర్ మున్సి పాలిటీలో రూ.276.80 కోట్లతో ఎస్టీపీ నిర్మాణం పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణ లో వానమహో త్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఇక్కడే 3680 స్వయం సంఘాలకు రూ.334 కోట్ల రుణాలు అందజేశారు. ఈ కార్యక్రమాల తరువాత అధికారులు, ప్రజాప్రతి నిధులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తానని, జిల్లా కు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులు కూడా అభివృద్ధిపనుల విషయంలో చురుకుగా వ్యవహ రించాలని స్కమ్ సూచిం చారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని, అభివృద్ధి పనులపై అలసత్వం ప్రద ర్శించ వద్దన్నా రు. అందరం కష్టపడి తేనే జిల్లా అభివృద్ధి పథం లో నడుస్తుందని రేవంత్‌రెడ్డి పేర్కొ న్నారు. ఈ కార్యక్రమం లో సీఎం వెంట మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజ నర్సింహ, సీఎం సలహదారు నరేందర్ రెడ్డి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పర్ణిక , శ్రీహరి, కలెక్టర్ విజయేంద్ర బోయి తదితరులు పాల్గొన్నారు.

## గూడుపురాణి... (మొదటి పేజీ తరువాయి)






**ప్రాజెక్టులపై నెలకోసారి సమీక్ష**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల కింద భూసేకరణ ఆర్అండ్ఆర్ చెల్లింపులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగు బిల్లుల చెల్లింపునకు వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాలమూరు రంగారెడ్డి మినహా అన్ని ప్రాజెక్టు పనులను 18 నెలల్లో పూర్తి చేయాలని సీఎం సూచించారు. ప్రతి ప్రాజెక్టు వారిగా సూక్ష్మ స్థాయిలో స్టేటస్ రిపోర్టు తయారు చేయాలని, మండలం, గ్రామల వారీగా ఆయకట్టు వివరాలను రూపోందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు స్టేటస్ రిపోర్టు ఉండాలని ఆయా ప్రాజెక్టు కింద కొత్త ప్రతిపాదనలను న్యాయపరమైన వివాదాలకు అవకాశం లేకుండా రూపోందించాలన్నారు. నెలకోసారి ప్రాజెక్టుల విషయంలో సమీక్షలో నిర్వహించడం జరుగుతుందని సీఎం పేర్కొన్నారు. అధికారులు అన్ని ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పూర్తి నివేదికలు ప్రభుత్వానికి అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా నీటి పారుదల అధికారులను ఆదేశించారు.

ఆర్‌డిఎస్ రాజోలి బండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి కర్నాటక, ఏపీ రాష్ట్రాలతో చర్చించాల్సిన అంశాలను రూపోంది ంచాలని, తమ్మిళ్ల లిఫ్ట ఇరిగేషన్ పై ప్రణాళిక రూపోందించాలని, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పై ప్రతిపాదన తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, మేఘారెడ్డి, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం (మొదటి పేజీ తరువాయి)

చేసిన ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నంకు స్వాగతం పలికే సమయంలో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. దాంతో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ మంత్రి ఆలయం బయటే కూర్చుండిపోయా రు.

ఈ సందర్భంగా కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేసిన హైదరాబాద్ కలెక్టర్ అనుదీ దురిశెట్టిపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. విఐపిలు వస్తున్న సమయంలో ఆలయం ఎదుట సరైన సెక్యూరిటీ లేదని మండిపడ్డారు. కలెక్టర్, పోలీస్ అధికారులకు మంత్రికి వివరణ ఇవ్వడంతో తిరిగి ఆయన కల్యాణోత్సవంతో పాల్గొన్నారు. అమ్మవారికల్యాణోత్సవంలో డిప్యూ టి మేయర్ శ్రీలత రెడ్డి, ఎంఎల్‌ఎ దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

**అలగలేదు, ఆ వార్తల్లో నిజం లేదు : మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ వేడుకలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి కార్యక్రమం కోసం చేసిన ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించడం లేదని, అలిగి మంత్రి ఆలయం బయటే కూర్చుండిపోయినట్లు వార్తలొచ్చాయి. ఈ విషయమై మంత్రి స్పందించారు. తాను అలిగినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. మహిళలు వెళ్లే సమయంలో తోపులాట జరిగిందని తెలిపారు. దాంతో మేయర్ కూడా తోపులాటలో ఇబ్బంది పడ్డారని అన్నారు.

తోపులాటను నిలువరించేందుకు కొద్దిసేపు ఆగినట్లు మంత్రి పొన్నం వివరించారు. తోపులాటపై అధికారులను ప్రశ్నించినట్లు చెప్పారు. మహిళా రిపోర్టర్‌కు ఎదురైన చేదు అనుభవానికి క్షమాపణలు చెప్పారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయితే జరిగిన సంఘటనపై నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## వెన్నెలను, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ విజ్ఞప్తి**

**విదేశాల్లో ఇబ్బందులకు గురయ్యే భారతీయ విద్యార్థులకు ఒక సెల్‌ను ఏర్పాటు చేయాలి**

**ప్రజాపక్షం / హైదరాబాద్:** వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్‌కు చెందిన వెన్నెల అనే విద్యార్థిని అమెరికాలో ప్రమాదానికి గురై గత రెండు నెలలుగా కోమాలో ఉన్నదని, ఆమెది చాలా పేద కుటుంబమని, వెన్నెలను, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. భారతదేశ నుంచి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి ఉన్నత చదువులు చదువుకోవడానికి విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారని, ఎక్కువ మంది అమెరికాకు, తర్వాత కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్తున్నారని, చదువుకోవడానికి వెళ్లినా లేదా ఉద్యోగం చేయడానికి వెళ్ళినా అక్కడ వారికి ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ అవుతుందని, కానీ చదువు పూర్తయిన తర్వాత పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ, మరొక ఉద్యోగం కోసం వెతుక్కునేవారు ఎక్కువమంది అక్కడ యాక్సిడెంట్లకు గురవుతున్నారని, ఇన్సూరెన్స్ లేకుండా యాక్సడెంట్‌కు గురైన వారు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని, కోట్ల రూపాయల్లో ఆసుపత్రి ఖర్చులు చెల్లించాల్సి వస్తుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఈ విషయాలపై ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖలు రాశామని, తానా వారు ప్రమాదానికి గురైన వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశామని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి చొరవ తీసుకుని విదేశాల్లో ఉండి ఇబ్బందులకు గురయ్యే భారతీయ విద్యార్థులను రక్షించడానికి భారత ప్రభుత్వం అధికారులతో ఒక సెల్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు గల్ఫ్ దేశాల్లో ఇలాంటి సమస్య వచ్చిందని, తాను ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా, అప్పటి విద్యాశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో ఒక కమిటీ ఏర్పాటు చేసి, వారిని విదేశాలకు పంపి బాధితులను ఆదుకున్నారని నారాయణ గుర్తు చేశారు.

విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తాత్కాలిక ఉద్యోగాలు చేసి ఎంతో కొంత సంపాదించి భారతదేశంలో ఉన్న వారి తల్లిదండ్రులకు పంపుతున్నారని, ఇక్కడ ఆ డబ్బులు ఖర్చు పెడుతున్నారని, దీంతో ప్రభుత్వాలకు ప్రత్యక్షంగా పరోక్షంగా పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుందన్నారు.

## ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్
(మొదటి పేజీ తరువాయి)

తనకుందన్నారు. ఆయన అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని జై షా పేర్కొన్నారు. బిసిసిఐ ఆయన అన్నివిధాలా సహకరిస్తుందని చెప్పారు. టీ20 ప్రపంచకప్‌తో ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగిసింది. దీంతో కొత్త కోచ్‌గా గంభీర్‌ను బిసిసిఐ ఎంపిక చేసింది. గంభీర్ సారథ్యంలోనే భారత్ .. శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. సహాయక కోచ్‌ల ఎంపిక విషయంలో కూడా బిసిసిఐ గంభీర్‌కు పూర్తిస్వేచ్ఛ ఇచ్చినట్లు తెలుస్తోంది. మంగళవారం మధ్యా హ్నం వరకు జీతభత్యాల విషయంలో బిసిసిఐ, గంభీర్‌ల మధ్య ఇంకా చర్చలు కొనసాగినట్లు సమాచారం. ఉదయమే అధికారిక ప్రకట న రావాల్సి ఉన్నప్పటికీ.. ఈ కారణంతోనే ఆలస్యమైనట్లు తెలుస్తోంది.

**అదే నా ముందున్న లక్ష్యం: గంభీర్**

టీమ్ ఇండియా ప్రధాన కోచ్‌గా తనను నియమించడంపై గంభీర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'భారతదేశమే నా గుర్తింపు. నా దేశానికి సేవ చేయడం గొప్ప అవకాశంగా భావిస్తు న్నా. వేరే క్యాప్ పెట్టు కున్నా (రాజకీయాల్లోకి వెళ్లినా).. మళ్లీ సొంత గూటికి రావడం గర్వంగా ఉంది. ప్రతి భారతీయుడినీ గౌరవంగా తలెత్తు కునేలా చేయడమే ప్రస్తుతం నాముందున్న లక్ష్యం. 1.4 కోట్ల మంది భారతీయుల కలల్ని నీలం రంగు జెర్సీలు ధరించిన ఆటగాళ్లు మోస్తున్నారు. అందరి కలల్ని నిజం చేయడానికి శక్తి మేరకు కృషి చేస్తా'' అంటూ రాసుకొచ్చారు.

# జర్నలిస్టులకు ఇచ్చిన మాట తప్పబోం

● మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం / హైదరాబాద్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన మాటను తప్పేదిలేదని రాష్ట్ర రవాణ, బిసిసంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక పురస్కారాన్ని సీనియర్ జర్నలిస్ట్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) కార్యదర్శి వై.నరేందర్ రెడ్డికి ప్రదానం చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో మంగళవారం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్నొం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అయిన కాంగ్రెస్ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధి, అంకితభావంతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి, వాటిని పరిష్కరించడంలో మీడియాది ప్రముఖ పాత్ర ఉంటుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో హెచ్‌యుజెతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే న్యాయం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్, హెల్త్ కార్డ్స్, ఇండ్ల స్థలాల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని, టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన కె.విరాహత్ అలీ, కార్యదర్శులు వి.యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి వెంకట్ రెడ్డి, జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్‌కుమార్, టియుడబ్ల్యూజె కార్యవర్గ సభ్యులు ఎ.రాజేష్, అనిల్, గౌస్ మోహినుద్దీన్ తదితరులను మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించి అభినందనలు తెలిపారు. హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఐజెయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ.మాజీద్, కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, హెచ్‌యుజె కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.నరహరి, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర రైతు సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

● అధ్యక్షులుగా చంద్ర నరేంద్ర, కార్యదర్శిగా విశ్వనాదం
● 21 మందితో కార్యవర్గ, 38 మందితో కౌన్సిల్




ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: ఎఐకెఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో జరిగిన సంఘం ద్వితీయ సభలో ఎన్నికైన 59 మందితో ఏర్పాటైన నూతన కౌన్సిల్ సభ్యులు మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఆమోదించారు. గౌరవ అధ్యక్షులుగా ఏపూరి బ్రహ్మం, సరెడ్డి పుల్లారెడ్డి, అధ్యక్షులుగా చంద్ర నరేంద్ర, కార్యదర్శిగా ముత్యాల విశ్వనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సలిగంటి శ్రీనివాస్, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తాళ్లూరి పాపారావు, మంగి వీరయ్య, ఆంద్రు వామనరావు, పరమ ఇమ్మానియేలు, వాడే లక్ష్మీ, సాల్వ రవికుమార్, సపావట్ రవి, సహాయ కార్యదర్శులుగా చంద్రగిరి శ్రీనివాసరావు, కొమారి హనుమంతరావు, గుగులోత్ రామచందర్, బొల్లోజు వేణు, పాండవుల బిక్షం, నరాటి రమేష్, యాసా రోశయ్య, కోశాధికారిగా పద్దం విజయలక్ష్మీ లతో పాటు మరో 59 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నరేంద్ర, ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేసి ప్రభుత్వాలను నిలదీసే సంఘం ఎఐకెఎస్, తెలంగాణ రైతు సంఘం మాత్రమే అన్నారు. పంటలకు గిట్టుబాట ధర, రైతుభరోసా పథకం, డా.స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు అమలు, పోడుభూములకు పట్టాలు, సబ్సిడిపై ఎరువులు, విత్తనాలు, రుణాలు, రుణమాఫీ కోసం దశలవారీ ఉద్యమాలు నిర్వహిస్తామని తద్వారా జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చి జిల్లాలోని రైతులకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు.

## దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్

ప్రజాపక్షం/హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా ఎ. శ్రీధర్ మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టిఎస్) 2011 బ్యాచ్కి చెందిన శ్రీధర్ గతంలో దక్షిణ మధ్య రైల్వేలో డిప్యూటీ జనరల్ మేనేజర్ (జనరల్)గా పనిచేసారు. ప్రస్తుతం ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా పనిచేస్తున్న సి.హెచ్. రాకేష్ దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (ట్రాఫిక్, ఆర్పిఎఫ్)గా బదిలీ అయినారు.

## తెలంగాణకు సరిపడ ఎరువులను అందిస్తాం : కేంద్ర మంత్రి జె.పి.నడ్డా

ప్రజాపక్షం/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవసరాలకు సరిపోను ఎరువులను పంపిణీ చేస్తామని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి జె.పి.నడ్డా హామీ ఇచ్చారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఎరువులను కేటాయించాలని కోరుతూ ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్ర మంత్రికి లేఖ రాశారు. ఏప్రిల్, మే రెండు నెలలకు సంబంధించి డిఏపి 1.12 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఉండగా, కేవలం0.43 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని, అందుకనే జులై మాసంలో 0.80 లక్షల మెట్రిక్ టన్నుల డిఏపిని సరఫరా చేయాల్సిందిగా తుమ్మల నాగేశ్వరరావు లేఖ ద్వారా కోరారు. దీంతో కేంద్ర మంత్రి జె.పి.నడ్డా స్పందిస్తూ తెలంగాణ రాష్ట్ర అవసరం మేరకు ఎరువులను,ముఖ్యంగా డిఏపిని ను కేటాయిస్తామని, ఎప్పటికప్పుడు రాష్ట్ర నిల్వలను తెప్పించుకుంటున్నామని, అవసరమైనప్పుడు తప్పకుండా ఎరువులను పంపిణీ చేస్తామంటూ మంగళవారం రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మలకు లేఖ రాశారు. ఎరువుల పంపిణీని శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ సరఫరాలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

## విప్లవోద్యమకారులను తయారుచేసిన తమ్మారెడ్డి



ప్రజాపక్షం / హైదరాబాద్: సిపిఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మారెడ్డి సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సిపిఐ హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో ఆయన చిత్రపటానికి తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ తమ్మారెడ్డి సత్యనారాయణ ఆనాడు సాయుధ దళాలకు తుపాకి పట్టడంలో శిక్షణ ఇచ్చి ఎంతోమందిని విప్లవ ఉద్యమకారులను తయారు చేశారని గుర్తు చేశారు. పార్టీ ఇచ్చిన పిలుపునకు క్రమశిక్షణతో పనిచేసేవారని, జైలులో కూడా ఉద్యమాలను నడిపారని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, సిపిఐ నాయకులు రాజు ఆఫీస్ ఇబ్బంది పాల్గొన్నారు.

## టిజిటిడిసి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పటేల్ రమేష్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (టిజిటిడిసి) ఛైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి హిమాయత్‌నగర్‌లోని పర్యటక శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టిజిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాష్‌రెడ్డి ఛైర్మన్‌ను సన్మానించి అభినందనలు తెలియజేశారు. మంగళవారం తన కార్యాలయంలో రమేష్‌రెడ్డిని కాంగ్రెస్ నేతలు, పర్యటక శాఖ అధికారులు, సిబ్బంది పూలగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి: టిజిజిఆర్ఇఎ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం (టిజిజిఆర్ఇఎ) ఆధ్వర్యంలో పెన్షనర్ల ముఖ్య సమస్యలపై జూలై 11వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా సిఎంకు వినతి పత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరి జనరల్ సి.చంద్రశేఖర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఎంప్లాయీస్ హెల్త్ స్కీము (ఇహెచ్‌ఎస్) ద్వారా పెన్షనర్లకు ఒపి, ఐపి వైద్య సేవలు అన్ని కార్పొరేటు ఆసుపత్రులలో నగదు రహితంగా అదవలసి నప్పటికి అమలులో లేనందున తరచుగా దీర్ఘవ్యాధులతో బాధపడే పెన్షనర్లు వైద్య చికిత్స నిమత్తం లక్షలాది రూపాయల బిల్లులు చెల్లించవలసి వస్తున్నదని వారు పేర్కొన్నారు. దీని వలన పెన్షనర్లు వైద్య చికిత్స కొరకు ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఆర్‌లు కమ్యూటేషన్ రికవరి కాలాన్ని 12 సంవత్సరాలకు తగ్గించుట వంటి సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

## డిఎస్‌సి పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థుల ఆందోళన



ప్రజాపక్షం/హైదరాబాద్: మేమేమైనా రోబోలమా..వెంటవెంటనే పరీక్షలు రాయడం తమకు ఎలా సాధ్యమవుతుందంటూ ప్రశ్నిస్తూ డిఎస్‌సి పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తమ డిమాండ్లు తీర్చాలంటూ సోమవారం నుంచి చేస్తున్న డిఎస్‌సి అభ్యర్థుల ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. ఈ మేరకు పోలీసులు వారిని ఎక్కడికక్కడ నిలువరిస్తున్నారు. సోమవారం ఆందోళన చేసిన అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని అర్ధరాత్రి వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు. దీంతో విడుదలైన అభ్యర్థులందరు అర్ధరాత్రి సమయంలో తిరిగి ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకుని తమ ఆందోళనను కొనసాగిస్తునే ఉన్నారు. బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరుద్యోగులు సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ..సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో డిఎస్‌సి వాయిదా వేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అభ్యర్థులను వెంటాడి మరీ పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఒయులో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

## సోషల్ మీడియాలో పిల్లల ఫొటోలు పోస్ట్ చేస్తున్నారా? జాగ్రత్త..!




ప్రజాపక్షం/హైదరాబాద్: తండ్రీకూతుళ్ల అనుబంధంపై కొందరు యూట్యూబర్లు చేసిన అసభ్య కామెంట్స్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ తెలంగాణ పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు. 'మీ పిల్లలు, కుటుంబసభ్యుల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయటం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుంది. ఫొటోలకు ప్రైవసీ ఏర్పాటు చేసుకోవాలి. కొన్నిసార్లు మీ సన్నిహితులే వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. అప్రమత్తత మన బాధ్యత' అని Xలో పోస్ట్ చేశారు.

## వలసలు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : యాంటీ డిఫెక్షన్ లా తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని, ఇప్పుడు వలసలను ప్రోత్సహించేది కూడా కాంగ్రెస్ పార్టీనే బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు విమర్శించారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో కెటిఆర్ మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇ ప్పుడు ఆ హామీలనే మర్చిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వాటినీ విస్మరించారన్నారు. డిసెంబర్ 9వ తేదీనే రుణ మాఫీ చేస్తామని ప్రకటించారని, ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం తాను ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మర్చిపోయి, ఆరుగురు ఎంఎల్‌ఎలు, ఆరుగురు ఎంఎల్‌సిలను చేర్చుకుందన్నారు. చేరికలను ప్రోత్సహి స్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని కెటిఆర్ మండిపడ్డారు. గోవా, కర్నాటకలో బిజెపి ప్ర భుత్వం కాంగ్రెస్ ఎంఎల్‌ఎలను కొనుగోలు చేస్తుందని చెప్పుకుంటున్న రాహుల్ గాంధీ, ఇప్పుడు తెలంగాణలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలను తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారని విమర్శించారు. మణిపూర్‌లో ఎంఎల్‌ఎలు పార్టీ ఫిరాయిస్తే, ఆ ఎంఎల్‌ఎలను సుప్రీం కోర్టు డిస్ క్వా లిఫై చేసిందన్నారు. ఎవరైనా ఎంఎల్‌ఎ, ఎంపి పార్టీ ఫిరాయిస్తే వారిని డిస్‌క్వాలిఫై అయ్యేలా చట్టం తీసుకురావాలని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. అసెంబ్లీ స్పీకర్ పార్టీ మారిన ఎంఎల్‌సిల పై చర్యలు తీసుకోకపోతే తాము సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కాంగ్రెస్‌లో చేరి కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా నిలబడ్డాడని అన్నారు. ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిల ఫిరాయింపులపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని, రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేస్తామని కెటిఆర్ తెలిపారు.

## ఫిరాయింపులపై కెటిఆర్‌కు మాట్లాడే అర్హత లేదు

తెలంగాణ పదం తొలగించినప్పుడే బిఆర్‌ఎస్ పతనం ప్రారంభమైంది
టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కిగౌడ్



ప్రజాపక్షం / హైదరాబాద్: ఫిరాయింపులను ప్రోత్సహించి, రాజకీయ వ్యవస్థని భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు నీతులు మాట్లాడడం సిగ్గుచేటని టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యా ష్కి గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల చేరికలపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు కాంగ్రెస్‌పై చేసిన విమర్శలపై మధుయాష్కి గౌడ్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో ప్రతిపక్ష పార్టీలను చీల్చి, రాజకీయా ల్లో విలువలను దిగజార్చిన ఘన చరిత్ర మాజీ సిఎం కెసిఆర్ కుటుంబానిదన్నారు. అలాంటి వారు నేడు ఫిరాయింపులపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కొక్కరిగా ఎంఎల్‌ఎలను చేర్చుకున్నప్పుడు కెటిఆర్‌కు ఫిరాయింపులు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. 2018లో బిఆర్‌ఎస్ పార్టీకి 88 మంది ఎంఎల్‌ఎలు, దాని మిత్రపక్షం ఎంఐఎంకు 7 మంది ఎంఎల్‌ఎలు ఉండగా ఎందుకు కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఎలను చేర్చుకున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి 19 మంది కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు గెలవగా ఒక్కొక్కరిగా 12 మందిని టిఆర్‌ఎస్‌లో చేర్చుకుని కండువాలు కప్పిన విషయాన్ని ఎవరు మర్చిపోరు అన్నారు. 2019లో ఉత్తంకుమార్ రెడ్డి ఎంపిగా గెలుపొంది ఎమ్మెల్యేగా రాజీనామా చేసిన తరువాత కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 18కి పడిపోగా మూడింట రెండు వంతుల మెజారిటీ వచ్చిందని భావించి, అప్పుడు 12 మంది ఎంఎల్‌ఎలతో విలీన ప్రక్రియ కోసం లెటర్ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు బిఆర్‌ఎస్ నుంచి ఒక్కొక్కరుగా తమ పార్టీలోకి వస్తున్నారని, త్వరలో మూడింట రెండో వంతు మార్క్ దాటడం ఖాయమని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలను నీచంగా దిగదార్చిన వ్యక్తి కెసిఆర్ అని మధుయాష్కి మండిపడ్డారు.

## బిఆర్‌ఎస్‌లో మిగిలేది ఆ నలుగురే!

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ నుంచి 25 మంది ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లోకి వస్తారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్‌ఎస్ పార్టీలో మిగిలేది నలుగురేనని, మిగిలిన నలుగురు బిఆర్‌ఎస్ పాదే మోస్తారని బీర్ల ఐలయ్య సెటైర్లు గుప్పించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే బిఆర్‌ఎస్ ఎల్‌పి కాంగ్రెస్‌లో విలీనం అవుతుందని చెప్పారు. బిఆర్‌ఎస్ చేస్తే సంసారం, తాము చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. తాము చేసేది ఫిరాయింపులు కాదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పాలన నచ్చి బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. తాము ప్రలోభాలు పెట్టి ఎంఎల్‌ఎలను తీసుకోవడం లేదన్నారు. గల్లీలో మొహం చెల్లక ఢిల్లీకి వెళ్లి బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, కెటిఆర్‌లకు ఢిల్లీలో ఏం పని అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పార్టీకి ఢిల్లీలో ఏం పని ఉందని కేటీఆర్, హరీశ్ రావు వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్‌కే మాట్లాడే నైతిక విలువలు బిఆర్‌ఎస్ పార్టీకి లేవన్నారు. గడీల పాలన చేసినందుకే గడీలు బద్దలుగొట్టి ప్రజాపాలన తెచ్చామన్నారు. కెటిఆర్, హరీశ్, సురేష్ రెడ్డిలకు బుద్ధి లేదని విమర్శించారు. మాజీ సిఎం కెసిఆర్ బస్సు యాత్ర పెట్టి కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను ఊరూరా చెప్పాలన్నారు. బిఆర్‌ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేసేందుకే కెటిఆర్, హరీశ్ ఢిల్లీకి వెళ్లారని ఎద్దేవా చేశారు.

## ఎసిబికి చిక్కిన అవినీతి పంచాయతీ కార్యదర్శి



ప్రజాపక్షం/రఘునాథపల్లి: గ్రామ పంచాయితి అభివృద్ధి పనుల బిల్లులు క్లియరెన్స్ విషయంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్త వద్ద మండల కేంద్రంలోని ఎంపి డి ఓ కార్యాలయం వెనుకాల లంచం తీసుకుంటుండ గా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఎసిబి డిఎస్పి సాంబయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం మండలంలోని కంచనపల్లి తాజా మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వరరావు గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేయడం జరిగింది. జిపి ఫండ్ ద్వారా రావాల్సిన రూ.1లక్ష 53వేలు బిల్లులు పదవి కాలం పూర్తయినా కూడా రాకపోవడంతో గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధు లు నిర్వహిస్తున్న పగిడి శివాజీ వద్దకు వెళ్లి బిల్లులు చేయాలని నాగేశ్వరరావు కోరడం జరిగింది. గత కొద్దినెలలుగా పంచాయతీ సెక్రటరీ బిల్లుల విషయంలో తన చుట్టూ తిప్పుకుం టూ ఇబ్బందులకు గురిచేశాడన్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో సదరు పంచాయతీ కార్యదర్శి తనకు రూ.20వేలు లంచం ఇస్తే బిల్లులు వచ్చే విధంగా పని చేస్తానని నాగేశ్వరరావుకు చెప్పడంతో విసిగి వేసారిన నాగేశ్వర రావు ఎసిబి అధికారులను ఆశ్రయించడం జరిగింది. అనుకున్న ప్రకారం నాగేశ్వరరావు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లి అడిగిన రూ.20వేలు ఇస్తుండగా అప్పటికే మాటు వేసిన ఎసిబి అధికారులు శివాజీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం మండలంలో సంచలనంగా మారింది.

## జాతీయ రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం

❖ ఆర్ఆర్ఆర్‌కు సహకరించండి
❖ హైదరాబాద్-మన్నెగూడరహదారి పనులను వెంటనే ప్రారంభించాలి
❖ ఎన్‌హెచ్‌ఎఐ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
❖ వివిధ సమస్యల పరిష్కారానికి బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి అధికారులతో సమావేశం



ప్రజాపక్షం / హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. రహదారుల నిర్మాణానికి ఏవైనా ఆటంకాలు ఉంటే వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎన్ హెచ్‌ఎఐ ప్రాజెక్ట్స్ మెంబర్ అనిల్ చౌదరి, రోడ్లు,భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, సిఎం కార్యదర్శి షానవాజ్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎఐ చేపడుతున్న రహదారుల నిర్మాణంలో భూ సేకరణతో పాటు తలెత్తున్న పలు ఇబ్బందులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి వివిధ సమస్యల పరిష్కారానికి బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రహదారులు నిర్మాణం జరిగే జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు భేటీలో పాల్గొంటారని, వివిధ సమస్యలపై చర్చించి అక్కడే సమస్యలను పరిష్కరించుకుందామని ఎన్‌హెచ్‌ఎఐ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**ఆ పనులు మొదలుపెట్టండి**

హైదరాబాద్–మన్నెగూడరహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎఐ అధికారులకు సూచించారు. కాంట్రాక్టు సంస్థతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. హైదరాబాద్ –విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే మొదలు పెట్టాలని వారికి సూచించారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. హైదరాబాద్ – విజయవాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు కోసం ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను ము ఖ్యమంత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎన్‌హెచ్‌ఎఐ అధికారులను కోరా రు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'భారత్ మాల' పథకంలో ఆర్ఆర్ఆర్‌ను చేపట్టాలని ప్రధాని మోదీకి ఇటీవల విజ్ఞప్తి చేసిన విషయాన్ని వారికి సిఎం గుర్తు చేశారు. ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యలో12 రేడియల్ రోడ్లు వస్తాయని సిఎం తెలిపారు. వాటి మధ్య పలు క్లస్టర్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణకు తీరప్రాంతం లేనందున డ్రై పోర్ట్ ఏర్పాటు చేయనున్నామని, ఇందుకోసం బందర్ పోర్టును అనుసంధానించేలా హై స్పీడ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ – కల్వకుర్తి జాతీ య రహదారి పనులు మొదలు పెట్టాలన్నారు. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ రహదారితో తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సిఎం వివరించారు. మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణంపై ప్రతి వారం తనకు నివేదిక ఇవ్వాలని సిఎంఒను కార్యదర్శి షానవాజ్ ఖాసీంను ముఖ్యమంత్రి ఆదేశించారు. మంచిర్యాల–వరంగల్, ఖమ్మం–విజయవాడ (ఎన్‌హెచ్ 163జి) కారిడార్ నిర్మాణానికి భూముల అప్పగింత, ఆర్మూర్ – జగిత్యాల మంచిర్యాల (ఎన్‌హెచ్–63) భూ సేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం, వరంగల్– కరీంనగర్ (ఎన్‌హెచ్ 563) రహదారి నిర్మాణానికి చెరువు మట్టి, ఫ్లై యాష్ సేకరణ, ఎన్‌హెచ్44తో కాళ్లకల్–గుండ్లపోచంపల్లి రహదారి ఆరు వరుసల విస్తరణకు భూ సేకరణ, జాతీయ రహదారుల నిర్మాణంలో విద్యుత్ సంస్థలతో తలెత్తున్న సమస్యల పరిష్కా రం, ఖమ్మం– దేవరపల్లి, ఖమ్మం కోదాడ రహదారుల నిర్మాణంలో పోలీస్ భద్రత ఏర్పాటు తదితర అంశాలను ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు సిఎంకి వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
NIT No. DB/PA/EE/SBD/2024-25/07/434, (ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు) తేది: 06.07.2024
పని పేరు: 1. హైదరాబాద్‌లోని హైకోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రధాన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కోర్ట్ హాల్ నెం.12లో ఫాల్స్ సీలింగ్ & ఇతర సివిల్ మరమ్మతు పనులను అందించడం. ఇసివి: రూ.4,88,308/-. 2. హైకోర్టు ప్రాంగణంలోని బి-బ్లాక్ భవనంలోని 2వ అంతస్తులో గౌరవనీయులైన శ్రీమతి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ఆక్రమించిన అటాచ్ ఛాంబర్‌తో కూడిన కోర్ట్ హాల్ నెం. 22 పునరుద్ధరణ. ఇసివి: రూ.7,63,418/-. 3. హైదరాబాద్‌లోని హైకోర్టు ఆవరణలో గేట్ నెం.5కి ఎదురుగా రోడ్డుపై ఉన్న వంతెన దిగువన దెబ్బతిన్న భూగర్భ జలాల పైప్‌లైన్‌ను మార్చడం. ఇసివి: రూ.71,973/-. బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 15.07.2024న మ.2.00గం.ల వరకు, బిడ్ ప్రారంభ తేదీ మరియు సమయం: 15.07.2024న మ.02.15 గం.ల నుండి. మరిన్ని వివరాలకు https://tender.eprocurement.gov.in తెలంగాణలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), హైకోర్ట్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 275-DP/CL/ADVT/1/2024-25 Date: 09-07-2024

# డ్రగ్స్ రహితంగా కరీంనగర్

- అన్ని విద్యాసంస్థల్లో కాన్సియస్ క్లబ్బుల ఏర్పాటు
- పెడదారి పట్టకుండా అవగాహన కల్పించండి : కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : అధికారులు, ప్రజలు అందరం కలిసి డ్రగ్స్ అనే మహమ్మారిని జిల్లా నుంచి తరిమికొడదామని, కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తయారు చేద్దామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో డ్రగ్స్ నియంత్రణపై ఎక్సైజ్‌శాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, ఆల్కహాల్ ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాల బారిన పడి యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. సమస్య మన దాకా వస్తే గానీ తెలియదని, సమస్యను మొగ్గలోనే తుంచేస్తే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. యువత వాటి బారిన పడకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీవితాలను నాశనం చేసుకున్న తర్వాత అప్పుడు ఏం చర్యలు తీసుకున్నా లాభం ఉండదని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణకు అసలు మూలాల నుంచి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డ్రగ్స్, గంజాయి బారిన విద్యార్థులు పడకుండా అవగాహన కల్పించేందుకు జిల్లాలో అన్ని విద్యాసంస్థల్లో కాన్సియస్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రతి క్లబ్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు, వాలంటీర్లు, విద్యార్థులుంటారని పేర్కొన్నారు. వీరంతా చెడు వ్యసనాల బారిన పడకుండా విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. జులై నెల ఆఖరి వరకు అన్ని విద్యాసంస్థలు, హాస్టళ్లలో కాన్సియస్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్ మాఫియా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. డ్రగ్స్, గంజాయి కొనుగోలు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నాన్ బెయిలబుల్ కేసులతో పాటు జైలు శిక్షపడే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వారికి మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి ఎవరైనా విక్రయించినా కొనుగోలు చేసినా వారు ఎక్సైజ్‌తో పాటు అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఏమైనా వివరాలు తెలిస్తే కరీంనగర్‌లోని కంట్రోల్ రూం 8019263862, టిజిఎన్ ఏబి నంబర్ 8712671111కు సమాచారం ఇవ్వాలని కోరారు. లక్ష్య సాధనకు విద్యార్థులు కఠోరంగా శ్రమించాలని సూచించారు. అనంతరం విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయనున్న కాన్షియస్ క్లబ్బులకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి సుజాత, సంక్షేమ అధికారి సరస్వతి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**'ఇంటింటా ఇన్నోవేటర్'లో కరీంనగర్‌కు మంచి గుర్తింపు తేవాలి**

ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ప్రజలు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆవిష్కరణలు పంపించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. తద్వారా చక్కని ఆవిష్కరణలతో కరీంనగర్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఏడాది కరీంనగర్ జిల్లా నుంచి 100 ఆవిష్కరణలు వచ్చాయని తెలిపారు. ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువగా ఆవిష్కరణలు చేయాలని సూచించారు. అందుకు వయస్సుతో నిమిత్తం లేదని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, వృద్ధులు ఎవరైనా ఏ సమస్య పైన అయినా ఆవిష్కరణ చేయవచ్చని పేర్కొన్నారు. ఆవిష్కరణలు వచ్చే నెల మూడో తేదీలోగా పంపించాలని సూచించారు. ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫోటోలు, 100 పదాలు, రెండు నిమిషాలు నిడివి గల వీడియో, ఆవిష్కరణ పేరు, సెల్ నెంబర్, వృత్తి, పూర్తి వివరాలు 9100678543 వాట్సాప్ నెంబర్‌కు పంపించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఈడియం శ్రీరామ్ శ్రీనివాస్ రెడ్డి, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా కో ఆర్డినేటర్ మణిదీప్, అధికారులు పాల్గొన్నారు.

## మా భూములు మాకు ఇవ్వాలని బాధితుల ఆందోళన



ప్రజాపక్షం/మర్రిగూడ : మర్రిగూడ మండలంలోని ఖుదాబాక్షి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాయి బండ తండ గిరిజన రైతుల భూములను దళారుల మోసపూరిత మాయ మాటలు నమ్మి రిజిస్ట్రేషన్ చేసినా డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని వెంటనే మా భూములు మాకు ఇప్పించాలని బాధితులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గత 2005–06 సంవత్సరంలో సర్వే నెంబర్లు 34 నుంచి 44లలో సుమారు750 ఎకరాల భూమిని తమకు డబ్బులు ఇవ్వకుండానే ఏజిపిఏ చేసుకున్నారని పేర్కొన్నారు. దీనిపై పలుమార్లు ఆర్‌డిఓ, జిల్లా కలెక్టర్‌లను కలిసినా ప్రయోజనం లేకపోవడంతో కోర్టుకెళ్లడం జరిగిందన్నారు. కోర్టులో కేసు ఉన్నప్పటికీ మోసం చేసి భూమి కొనుగోలు చేసిన ఆకుల రాజయ్య ప్రోసిడింగ్ వచ్చినప్పుడు తమకు డబ్బులు ఇస్తానని మభ్యపెట్టి 2018లో శివరాత్రి చంద్రయ్య ఇండస్ట్రీస్ పేరుమీద అమ్ముకున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మంగమ్మ, సోనీ, కె కమలమ్మ, ఏ సుగుణమ్మ, బుజ్జి,లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలి

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన అల్పాహారాన్ని అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు అందించే అల్పాహారాన్ని పరిశీలించి పోషకాలు లేకపోవడంతో సిబ్బందిపై, ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున వెంటనే శుభ్రం చేయించాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులు గర్వపడే విధంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

**మార్కెట్‌యార్డులో సమీక్ష సమావేశం**

మండలంలోని అవంతీపురం మార్కెట్‌యార్డులో మార్కెట్ కార్యదర్శి, ఉద్యోగులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌కు వచ్చే రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాని, ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ నందు నిర్మాణం చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ఈ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకరానున్నట్లు, త్వరలోనే వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో నిర్మాణం చేసిన దుకాణాలలో గాలి వెలుతూరు, సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ ఇఇ జికెడి ప్రసాద్, డిఇ సత్యారావు, కౌన్సిలర్లు తహెర్‌పాషా, ఆకుల లవకుశ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే చర్యలు తప్పవు

జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హెచ్చరిక



ప్రజాపక్షం /నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని మహిళలకు ఎలాంటి ఆపద వచ్చిన వెంటనే స్పందిస్తూ పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుందని, ఎవరైనా ఆకతాయిలు మహిళలను వేధిస్తే చర్యలు తప్పవు అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్, షి టీం పోలీస్ స్టేషన్, భరోసా సెంటర్‌లను పరిశీలించి, షి టీమ్ బృందాల పనితీరు,పోలీస్ స్టేషన్ పరిసరాలు,లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కేంద్రంలో కల్పించే న్యాయ సలహాలు,సైకలాజికల్ కౌన్సెలింగ్, వైద్య పరంగా తీసుకుంటున్న భద్రతా చర్యలు,మహిళల వేధింపులపై నమోదు అవుతున్న కేసుల వివరాలు తదితర విషయాలు అడిగి తెలుసుకుని,అనంతరం మాట్లాడుతూ షి టీమ్ బృందాలు జిల్లా వ్యాప్తంగా జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ ఇలా ప్రతి చోటా డేగ కళ్లతో పర్యవేక్షణ చేస్తూ లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ మొదలు ప్రతి అంశంలో మహిళలకు ధైర్యాన్ని కల్పిస్తూ నిరంతరం ముందుకు సాగుతూన్నాయని అన్నారు. నల్లగొండ షీ టీమ్స్ బృందాలు రక్షణ కల్పించే విషయంలోనే కాదు మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్లకు రావాల్సిన అవసరం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ డయల్ 100 ద్వారా, పోలీస్ శాఖ విడుదల చేసిన క్యూ.ఆర్ కోడ్ స్కానింగ్ పద్ధతిలో, వాట్స్ అప్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా పిర్యాదు చేసే అవకాశాన్ని మహిళలకు కల్పించి నిరంతరం షీ టీమ్స్ వారి వెన్నంటి నిలిచేలా ముందుకు సాగుతున్నాయి అన్నారు.ఈ కార్యక్రమంలో ఉమెన్ పిఎస్ సిఐ కరుణాకర్, ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

## నవాబు పేట రిజర్వాయర్ నుండి 'గుండాల'కు సాగునీరు అందించాలి



ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి నవాబు పేట రిజర్వాయర్ నుండి సాగునీరు అందించాలని రైతు సంఘం అధ్యక్షులు కొమురయ్య మంగళవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవాబు పేట నుండి నీరు వచ్చే కాలువలు పూర్తికాకపోవడం వలన సాగుకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత ప్రభుత్వం కాలంలో కాలువలను పట్టించుకోలేదని నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని కాలువలకు మరమ్మత్తులు చేసి సాగు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, కాలువల ను పూర్తి చేసి మండలంలోని చెరువులు, కుంటలను నింపాలని కోరారు. ఇట్టి విషయంపై ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య స్పందిస్తూ కాలువ మరమత్తు లు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుండె పోటుతో స్టాఫ్‌నర్స్ మృతి



ప్రజాపక్షం/భద్రాచలం : ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న ఐన కళ్యాణి(40) సోమవారం అర్ధరాత్రి గుండె పోటుతో మరణించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గత కొంత కాలంగా విధులు నిర్వహిస్తున్న కళ్యాణికి ఇంటి వద్ద ఒక్క సారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. అందరితో కలివిడిగా ఉంటే కళ్యాణి మృతి చెందటంతో ఆస్ప త్రి వర్గాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబానికి సానుభూతి, సంతాపాన్ని ప్రకటించారు.

## మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని25వేల గ్రామ సమాఖ్య సంఘాల రానున్న 5ఏళ్లలో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించి స్వయం సహాయక సంఘాలమహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వనమహోత్సవం, మహిళాశక్తి, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, వ్యవసాయ సంబంధిత అంశాలు, ధరణి, ఉద్యోగుల బదిలీలు, గృహనిర్మాణం తదితర అంశాలపై మంగళవారం జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్ లో 20.02 కోట్ల మొక్కలు నాటేందుకు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు రాష్ట్రంలో సరిపడ మొక్కలు అందుబాటులోఉన్నాయన్నారు.జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాల మేరకు నాణ్యమైన మొక్కలను నాటి వాటిని జియోటాగింగ్ చేయడంతో పాటు వాటిని పరరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్న నేపథ్యంలో స్వయం సహాయక బృందాలలో ఇప్పటికీ చేరని మహిళలందందరినీ చేర్పించాలన్నారు.అన్ని జిల్లాల్లో ఇందిరా క్యాంటీన్‌ల ఏర్పాటును త్వరితగతిన ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని, ఇంకా అసంపూర్తిగా ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఏడాది ఇదే సమయానికి 44 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా ప్రస్తుత వానా కాలం సీజన్‌లో ఇప్పటికే 50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారన్నారు. అన్ని మండలాల్లో సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీని జిల్లా కలెక్టర్లు ప్రతీ రోజూ పర్యవేక్షించాలని సిఎస్ స్పష్టం చేశారు . వర్షాకాలంలో సీజన్‌లో అతిసార, డెంగ్యూ, మలేరియా, చికన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో భూ సంబంధిత వివాదాలకు సంబంధించి అందిన ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ శాంతి కుమారి ఆదేశించారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఈనెల 20 వ తేదీ లోగా ఎట్టిపరిస్థితిలోనూ పూర్తి చేయాలని సిఎస్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## పనులు పారదర్శకంగా ఉండాలి

- పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించాలి
- కేసారంలో రెండు పడకల ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నందలాల్



ప్రజాపక్షం/సూర్యాపేట : కేసారం ఫేస్ 2 రెండు పడకల గదుల ఇండ్లలో సిసిరోడ్లు, సంప్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కేసారం మొదటి,రెండవ ఫేస్ రెండు పడకల గదుల ఇండ్లను,ప్రాథమిక పాఠశాల, సూర్యాపేటలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా కలెక్టర్ కేసారం ఫేస్ 1 రెండు పడకల గదుల ఇండ్లతో పాటు ఫేస్ 2లోని సంప్,సిసిరోడ్ల పనులను పరిశీలించి నాణ్యతతో ఉండాలని పనులు వేగవంతం చేయాలని సూచించారు.రెండు పడకల ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లను త్వరలో చేపట్టాలని, వాటర్‌లైన్, శానిటరీ పనులు సక్రమంగా మొదలుపెట్టనందున ఆగ్రహం వ్యక్తం చేశారు.కేసారంలోని ప్రైమరీ, సూర్యాపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. అదే విధంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల ప్రవేశాలు, హాజరుశాతం ఎక్కువగా ఉండాలని,పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ వివరాలు తెలుసుకున్నారు.అమ్మ ఆదర్శ పాఠశాలకు మైనర్ పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని పనులను వేగవంతం చేయాలని సూచించారు.అనంతరం ఫేస్ 2 రెండు పడకల గదుల ఇండ్ల పనులపై ఆర్‌డివో, ఆర్అండ్‌బి ఇంజనీరింగ్ అధికారులతో పనులపై సమీక్షించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

## నా గెలుపు ఎవ్వరూ ఆపలేక పోయారు



ప్రజాపక్షం / గద్వాల : నా గెలుపును ఎవ్వరు ఆపలేక పోయారని మహబూబ్‌నగర్ ఎంపి డి.కె.అరుణ పేర్కొన్నారు. మంగళవారం ఆమె ఎంపి అయిన తర్వాత మొదటి సారిగా సొంత గడ్డ జోగులాంబ జిల్లాలో ప్రవేశించారు. ముందుగా జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకొని, పురవీధుల గూండా భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం ఆమె ఎస్.వి. ఈవెంట్ హాల్లో విజయోత్సవ సందర్భగా మాట్లాడుతూ దొంగలు దొంగలు ఒకటయ్యి నడిగడ్డ ప్రాంతాన్ని దోచుకోవాలని చూస్తున్నారు. కొందరు కుర్చీల కోసమే రాజకీయాల్లోకి వచ్చారు. బిఆర్‌ఎస్ పార్టీ వారంతా కాంగ్రెస్‌లో చేరారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ 10 సంవత్సరాల్లో ఏమి అభివృద్ధి జరిగిందని ఇప్పుడు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏం ఉద్ధరించడనికి కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఎస్.రామచంద్రా రెడ్డి ,పెద్ద ఎత్తున బిజెపి శ్రేనులు పాల్గొన్నారు.

## పిల్లలు స్వేచ్ఛా వాతావరణంలో పెరగాలి

ప్రజాపక్షం / అయిజ : పిల్లలు స్వేచ్ఛా వాతావరణంలో పెరగాలని ఎంపిడిఓ వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎక్లాస్ పురం గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల పరిరక్షణ కమిటి ఆధ్వర్యంలో పిల్లల సంరక్షణ గూర్చి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడి ఓ వెంకటయ్య హాజరైయ్యారు.ఈ సందర్భంగా పిల్లను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్యం పిల్లల హక్కు వారు మంచి వాతావరణంలో పెరగాలని వారి సంక్షేమం గూర్చి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎల్లమ్మ, ప్రధానోపాధ్యాయులు పి.బాబు, పంచాయతి సెక్రెటరి కె.ప్రదీప్, ఏడబ్ల్యూ టీచర్స్ ప్రియాంక, పద్మావతి,ఆశా విజయశాంతి, తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు

రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కూనంనేని

పనుల్లో నాణ్యత లోపిస్తే ఊరుకునేది లేదు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం(పాల్వంచ) : పాల్వంచ పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులకల్పనకు కృషి చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కెసిఆర్ నగర్, అయ్యప్ప నగర్, రాజీవ్ గాంధీ మార్కెట్, కళాభవన్, రాహుల్ గాంధీ నగర్, వెంగళరావు కాలనీ ప్రాంతాల్లో రూ.4 కోట్ల డిఎంఎఫ్‌టి నిధులతో అభివృద్ధి పనులకు కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని, ప్రజలు కూడా పనులపై దృష్టి సారించాలని చెప్పారు. అధికారులు, ప్రజలు,ప్రజాప్రతినిధులు సమిష్టి కృషి, నిర్ణయాలతో నియోజకవర్గంలోని సమస్యలన్నింటిని పరిష్కరించుకుని ఆదర్శవంతంగా నిలుద్దామని చెప్పారు. అనంతరం మొ క్కను నాటారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ వివేక్, ఆర్ అండ్‌బి ఇఇ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ స్వామి, ఆర్అండ్‌బి డిఇ నాగేశ్వరరావు, పట్టణ ఎస్సై రాము, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయి బాబా,తదితరులు పాల్గొన్నారు.

**నియోజకవర్గంలో ఉన్నత విద్యాభివృద్ధికి కృషి**

నియోజకవర్గంలో ఉన్నత విద్యాభివృద్ధికి, ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి రూ.3.99 కోట్ల నిధులకు సంబంధించి నివేదికలను ప్రిన్సిపల్ సెక్రెటరి వెంకటేశంకు అందించినట్లు ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం ప్రభుత్వ జూ.కళాశాలకు రూ.2.25 కోట్లు, పాల్వంచ ప్రభుత్వ జూ.కళాశాలకు రూ.84 లక్షలు, లక్ష్మీ దేవిపల్లి ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలకు రూ.90 లక్షల ప్రతిపాదనలు అందించినట్లు చెప్పారు. ఈ నిధులతో అదనపు గదులు, నూతన భవనాల నిర్మాణం, మౌళిక వసతుల కల్పనకు వెచ్చించనున్నట్లు తెలిపారు. త్వరలో నిధుల మంజూరీకి ప్రిన్సిపల్ సెక్రెటరీ హామీ ఇచ్చారని కూనంనేని తెలిపారు. అనంతరం ఐటి మం త్రి శీధర్ బాబుతో భేటి అయినట్లు చెప్పారు. ని యోజకవర్గంలో ఐటి హబ్, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరామని, దీనిపై త్వరలో ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. కాగా వీటి ఏర్పాటుకు సుమారు 60 ఎకరాల స్థలం అవసరం ఉన్నందున స్థలానికి సంబంధించిన వివరాలు అందించాలని మంత్రి కోరారని చెప్పారు. పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుండి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి లేఖ అందించి అందుకు సంబంధించిన వివరాలు స్వయంగా వివరించినట్లు తెలిపారు. తన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రిన్సిపల్, హెల్త్ సెక్రెటరీలకు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి



ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మండల కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా కమిటీలా పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా రైతులకు అందజేయలేదని, రెండు లక్షల రూపాయల రుణమాఫీ కాలేదు అన్నారు. రైతుల కు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఆంబోజు ఆంజనేయులు ఆధ్వర్యంలో డిప్యూటీ తసిల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాశీనాథ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి బండా సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి మహేష్, సోషల్ మీడియా కన్వీనర్ సాయి, బూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, అశోక్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి



ప్రజాపక్షం/యాదాద్రి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీలలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, వన మహోత్సవ కార్యక్రమాలలో వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై మాట్లాడుతూ మున్సిపల్ వార్డులలో నీరు నిల్వఉండకుండా చూడాలని, గతంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను, లోతట్టు ప్రాంతాలను గుర్తించి తిరిగి నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, లార్వాను ప్రారంభ దశలోనే నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని, ఆయిల్ బాల్స్, ఫాగ్గింగ్, ఆంటీ లార్వా స్ప్రేయింగ్ పనులు నిర్వహించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, దోమల బాధ కలుగకుండా డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకు కృషి చేయాలని, మురికి కాలువలలో పూడికతీత పనులు పెద్ద ఎత్తున చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆదేశించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలలో, రోడ్లకిరువైపులా పెద్ద మొక్కలు నాటాలని, అర్బన్ ప్లాంటింగ్ సంబంధించి మున్సిపల్ వార్డులకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.బెన్ షాలోమ్, కే.గంగాధర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, శేఖర్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి పద్మజా రాణి, జిల్లా పరిషత్ సిఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి ఎం.ఏ. కృష్ణన్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పంచాయత్ అధికారి సునంద, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, తదిరులు పాల్గొన్నారు.

# గుణపాఠం చెప్పినా మోదీ మారలేదు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి** : ప్రజలు గుణపాఠం చెప్పినా మోడీ వైఖరి మారలేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని కొత్తవాడలో సీపీఐ వరంగల్ మండల స్థాయి శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. తొలుత పార్టీ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఎగురవేయగా అనంతరం ప్రారంభమైన శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమానికి మండల కార్యదర్శి బుస్సా రవిందర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా దేశంలో మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, అందుకే ప్రజలు గుణపాఠం చెప్పారని, అయినా మోదీ వైఖరి మారలేదని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, యువతకు ఉపాధికి భారీ పరిశ్రమలు లాంటి హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులను ప్రైవేటు పరం చేయబోమని ఎన్నికల ముందు చెప్పి నేడు టెండర్లు పిలుస్తున్నారని అన్నారు. తెలంగాణలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే టెండర్లు పిలుస్తున్నారని విమర్శించారు. నేడు కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి ముకుతాడు వేసేలా గట్టి ప్రతిపక్షం ఏర్పడిందని, ఇక గతంలో మాదిరిగా మోదీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలను సమన్వయం చేసుకుని దేశంలోని ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న బిజెపి, ఎన్‌డిఎ ఆగడాలను అరికట్టేందుకు వామపక్ష లౌకిక శక్తులను కాంగ్రెస్ కలుపుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, కూడు, గూడు, గుడ్డ అందేటా కృషిచేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలు కావస్తున్నదని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెంచిన పింఛన్లు, పెండింగులో ఉన్న రేషన్ కార్డులను అందించాలన్నారు. రైతు భరోసాపై ముఖ్యమంత్రి అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని, కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని సూచించారు. రైతు రుణమాఫీ, విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు కావస్తున్న సందర్భంగా గ్రామ గ్రామాన పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలపై గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ శిక్షణా తరగతులలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శులు మేకల రవి, కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్,ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్‌మియా, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, గుండె బద్రి,దామెర క్రిష్ణ, జన్ను రవి, తాళ్లపల్లి రహేలా, వేల్పుల సరంగపాణి, ఎండి అమ్జద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా తొలి రోజు భారత రాజ్యాంగం లౌకిక వాదం ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అన్న అంశంపై డాక్టర్ మార్క శంకర్ నారాయణ, మార్క్సిజం అంటే ఏమిటి అన్న అంశంపై నేదునూరి రాజమౌళి బోధించారు.

## విద్యార్థులకు అస్వస్థత



**ప్రజాపక్షం/రామాయంపేట:** తెలంగాణ మాడల్ పాఠశాల విద్యార్థులు అల్పాహారం తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉదయం పూట అల్పాహారం చేసిన వెంటనే సుమారు 17 మంది విద్యార్థినిలు వాంతులు, విరేచనాలతో ఇబ్బందులకు గురయ్యారు. దీంతో వారిని హుటాహుటిన రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా విద్యాధికారి రాదాకిషన్, తహశీల్దార్ రజిని కుమారి, డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌వోతో పాటు బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ పంజా విజయ్‌కుమార్‌లు ఆసుపత్రిలో విద్యార్థులను ఓదార్చి జరిగిన ఘటనపై ఆరాతీశారు. ఫుడ్ పాయిజన్ కారణంగానే విద్యార్థులు అస్వస్థతలకు గురయ్యారని అధికారులు తెలిపారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతనం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బోజనాన్ని జిల్లా విద్యాధికారి, ఆర్డీవోలు పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు,

## వనమహోత్సవ లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా సాధిస్తాం

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** నిర్దేశించుకున్న వనమహోత్సవ లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా తప్పనిసరిగా సాధిస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుండి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి జిల్లా ఉన్నతాధికారులతో వన మహోత్సవం, మహిళ శక్తి, స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, ప్రజా పాలన కార్యక్రమంలో చేపట్టిన పథకాల అమలు, ఫెర్టిలైజర్స్, ధరణి, బదిలీలు వంటి 17 అంశాలపై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి పథకం పటిష్టంగా అమలుపరిచేందుకు ముందస్తుగా సెర్ప్ మహిళలతో, బ్యాంకర్లతో అవగాహన సమావేశం ఏర్పాటుచేశామని తెలిపారు. మీసేవ కేంద్రాలు, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, క్యాంటీన్‌ల ఏర్పాటు, సోలార్ ప్లాంట్స్ నెలకొల్పేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఆర్డీవో మొగులప్ప, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** హన్మకొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని డిఇఒ సూపరిండెంట్ శారదకు ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ పాల్గొన్నారు.

## గంజాయిని దగ్ధం చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్మగ్లర్ల వద్ద పట్టుబడిన గంజాయిని పోలీసు అధికారులు దగ్ధం చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగం ఆదేశాల మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ. 1.30 కోట్ల విలువైన 20 కిలోల గంజాయిని డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అమ్మవారిపేట ప్రాంతంలో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి, హన్మకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డితోపాటు ఏనుమాముల ఎస్సై నర్సింగరావు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ

ఉత్తర్వులు జారీ చేసిన డిఇఒ రాజేందర్



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** భూపాలపల్లి జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీని కల్పిస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌కు చెందిన వర్కింగ్ జర్నలిస్టులు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి రాయితీ కాపిని జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు జిల్లాలోని జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎడ్ల సంతోష్, పావుశెట్టి శ్రీనివాస్, బెల్లం తిరుపతి, తడుక సుధాకర్‌లు ఉన్నారు.

## నిబంధనలు పాటించకపోతే పాఠశాలలు సీజ్

**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** ప్రభుత్వానిబంధన ప్రకారం ప్రైవేటు పాఠశాలలు నడపడం లేదని, సోషల్ మీడియాలో జరిగిన ప్రచారానికి జిల్లా ఉన్నతాధికారి స్పందించారు.మంగళవారం మండలంలోని ఎంఈఓను స్కూల్ తనిఖీ చేయమని ఆదేశించారు. రెండు పేర్లతో కలిసి ఉన్న పాఠశాల బోర్డును తొలగించారు. ఈ సందర్భంగా ఎం ఓ రంగయ్య మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ పేరును తొలగించి, అరబిందో స్కూల్ అని రాసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పలుమార్లు షోకాజ్ నోటీసులు స్కూల్ యాజమాన్యానికి అందించినా తీరు మారడం లేదన్నారు. అధిక ఫీజులు, స్కూలుకు సంబంధించిన యాప్స్, పుస్తకాల అమ్మకాలు, బ్రోచర్లపై టెక్నో, ఐఐటి విద్య అందిస్తున్నామని ప్రచారం చేయడం చట్ట విరుద్ధమన్నారు. అలాంటి వాటికి ప్రత్యేకంగా పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలో నడుపుతున్న బస్సులను అరబిందో పాఠశాల పేరుతో బోర్డు రాయించుకోవాలన్నారు. ఇలాంటి కార్యకలాపాలు చేయకుంటే ప్రభుత్వ ఆదేశానుసారం స్కూలు సీజ్ చేయడం జరుగుతుందని ఆదేశాలు జారీ చేశారు.

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జయ శంకర్ ఎకో పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్పి కిరణ్ ఖరే తో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్పీ కిరణ్ ఖరే ఏకో పార్కులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా విస్తీర్ణంలో అడవి ప్రాంతం ఎక్కువగా ఉన్న జిల్లా అని ప్రభుత్వం సూచించిన విధంగా వనమహోత్సవం ద్వార జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కల నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో కనీసం మూడు నుండి ఐదు మొక్కలు తప్పకుండా నాటాలని ఎమ్మెల్యే అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సింగరేణి, అటవి శాఖ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ నర్సరీల ద్వారా గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, అటవీ శాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ వసంత, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, అటవి శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత ప్రమాణాలతో విద్య అందించాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఉపాధ్యాయులు విద్యార్థుల చదువుల పట్ల ఉన్నత ప్రమాణాలు పాటించాలని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఖిలాషాపురం గ్రామంలో గల కస్తూర్బా పాఠశాలను, వెల్ది మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. అందులో భాగంగా ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కడియం సిబ్బంది పనితీరు, అటెండెన్స్ రిజిస్టర్‌ను, ఆసుపత్రిలో మౌళిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌తోపాటు వెల్దిలోని మోడల్‌స్కూల్, ఖిలాషాపురంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల పనితీరు, హాస్టల్‌లో మౌళిక వసతులు, భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించి రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. డిఇఒ రాము, తహశీల్దార్ పురం యుగంధర్, మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి, పంచాయితి రాజ్ డిఇ శ్రీనివాస్, మాజీ జెడ్‌పిటిసి మారుజోడు రాంబాబు, తాజా మాజీ జెడ్‌పిటిసి బొల్లం అజయ్, పిఎసిఎస్ చైర్మన్‌లు గంగిడి నరసింహారెడ్డి, చీమలపాటి రవీందర్, నాయకులు గాదె మహేందర్‌రెడ్డి, మేక ల నరేందర్, లోనె శ్రవణ్ కుమార్, తాటికొండ వెంకటేష్ యాదవ్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు బలరాంనాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌లతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో కలెక్టరేట్, ఏరియా ఆసుపత్రి, ఐటిడిఏ, రామప్ప దేవాలయం ఆవరణంలలో మొత్తం నాలుగు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నామని అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటుచేసిన జిల్లాలో మొదటి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో ఈ సంవత్సరం 20వేల కోట్ల రూపాయలు రుణాలు బ్యాంక్ లీకేజి ద్వారా అందించడం జరుగుతుందని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే మహిళలు ఈ సేవా కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ డైరీ ఫాంలు, సోలార్ లైట్లు, అదేవిధంగా రూ.60లక్షల పాఠశాల ఏక రూప దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి శ్రీజ, మహేందర్ జి, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, జిల్లా అధికారులు ప్రియదర్శిని, మహిళా పొదుపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని మంత్రి సీతక్కకు వినతి

65 సంవత్సరాల పైబడిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్‌కు లక్ష రూపాయలు, జీతంలో సగం పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నాలుగవ రోజుకు చేరాయి. ములుగు కలెక్టర్ ఆఫీస్‌కు వచ్చిన మంత్రి సీతక్కను అంగన్‌వాడీలు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మీకు రెండు లక్షలు పెంచడానికి ఆర్థికశాఖ వద్ద ఫైల్ అప్రూవల్ అవుతుందని ఆమె తెలిఅపరు. కానీ కొత్త జీవో వచ్చే వారకు పాత జీవో ప్రకారం చేస్తున్న రిటైర్‌మెంట్ ప్రక్రియను ఆపాలని తాజాగా జూన్ 29న విడుల చేసిన మెమో నెంబర్ 1334ను ఉపసంహరించుకొని 65 సంవత్సరాలు దాటిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని మంత్రి సీతక్కను అంగన్‌వాడీలు కోరారు. అనంతరం దీక్ష శిభిరం వద్దకు డిడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, సిడిపిఓలు హేమలత, ముత్తమ్మ, శిరీషలు వచ్చి దీక్ష విరమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్‌వాడీ టీచర్లు సరోజన, సమ్మక్క, ప్రేమకుమారి, వెంకటరమణ, రామకృష్ణ, రత్నకుమారి, విజయలక్ష్మి, సుశాంతల, రమాదేవి, రాజమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## నాణ్యమైన గుణాత్మక విద్యనందించాలి

కలెక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. మధ్యాహ్న భోజన మెనూ వివరాలను తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా గుర్తించి మౌళిక సదుపాయాల కల్పన పూర్తయిందని, ఇంకను మిగిలి ఉన్న టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తరగతి గదులను, పాఠశాల ఆవరణ పరిశీలించి సమర్థ నిర్వహణకు ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి, ప్రధానోపాధ్యాయులు మాధవి, జయ ప్రకాష్, ఆదర్శ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## 14వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతనిధి :** జిల్లాలో నేషనల్ హైవే నిర్మాణ ప్రాంతమైన మిట్టపల్లి నుండి జిల్లా పరివాహక ప్రాంతం వరకు రోడ్డు వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో హైవే ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అటవిశాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. మిట్టపల్లి నుం డి జిల్లా పరివాహక గ్రామాల వరకు నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పూర్తయిన రోడ్డు వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ పెట్టెందు కు 14 వేల మొక్కలు నాటేందుకు అస్కారం ఉందన్నారు. కొత్త రోడ్డు ల్యాండ్ లెవేలింగ్ చేసి ఫారెస్టు నుండి మొక్కలు పెట్టే ప్రాంతాలకు మొక్కలను రవాణా చేయాలని నేషనల్ హైవే అధికారులకు తెలిపారు. ఆటవి శాఖ అధికారులు చేసిన మార్కింగ్ చేసిన ప్రాంతాల్లో ఫిట్టింగ్ , మొక్కలు పెట్టడం, ట్రీ గార్డులు అమర్చటం, మెయింటెయిన్స్ బాధ్యత పూర్తిగా గ్రామపంచాయతీ అధికారులదే అన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన ప్రాంతాన్ని పర్యావేక్షణ చేయాలని డిఆర్‌డిఎ, ఫారెస్టు అధికారులను సూచించారు. అయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు మీ పరిధిలోని రోడ్డు వెంబడి మొక్కలు అత్యంత శ్రద్ధ తీసుకోని ఏపుగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులు,జిల్లా ఆటవి శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్, జిల్లా గ్రామపంచాయితీ అధికారి దేవకి దేవి తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే లక్ష జరిమాన, ఐదు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ క్రాంతి వల్లూరు అధ్యక్షతన లింగ నిర్ధారణ చట్టంపైన జిల్లా స్థాయి మల్టి మెంబర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జిల్లాలో పిసిపిన్ అండడ్ డిటీ చట్టం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు 125 స్కానింగ్‌సెంటర్స్ అనుమతిలో ఉన్నాయి కొత్తవి 11 సెంటర్లు ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు రెన్యూవల్ కోసం 13 సెంటర్లు దరఖాస్తు చేసినట్లు డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గాయిత్రి దేవి తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీతాయ నేరమని ఎవరైనా లింగ నిర్ధారణ తెలియజేసినట్లైతే అందుకు 3 నుండి 5 వరు జైలు శిక్ష ,లక్ష రూపాయల వరకు జరిమాన వేయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీని పర్యవేక్షనకై జిల్లా కమిటీ సభ్యులతో టాస్కోర్సు కమిటీ ఏర్పాటు చేసి వివిధ స్కానింగ్‌సెంటర్లను తనిఖీ చేయాలని అలాగే డెకాయి ఆపరేషన్స్ చేయాలని కలెక్టర్ డిఎంహెచ్వోను ఆదేశించారు. ఈ సమావేశంలో పిసిపిన్ డిటీ స్టీకర్స్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఎస్పీ రూపేష్ రెడ్ క్రాస్ చైర్మేన్ వనజ రెడ్డి డిప్యూటీ డియం హెచ్ ఓ డా నాగ నిర్మిల పిఓయం సిహెచ్ మనోహర్ రెడ్డి, డెమో ప్రసాద్ వీర కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## సమాజసేవే లయన్స్ క్లబ్ లక్ష్యం



**ప్రజాపక్షం/తొర్రూరు :** సమాజ సేవే తొర్రూరు లయన్స్ క్లబ్ లక్ష్యం అని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో లయన్నిస్టిక్ ఇయర్ 37వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అథిధిగా పాల్గొన్న వెంకటరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు జిల్లాలోనే ఎక్కువ మంది సభ్యులున్న ద్వితీయ స్థానంలో ఉందని, సమాజంలో పేద ప్రజల కోసం అనేక సమాజహిత కార్యక్రమాలను చేయడంలో అసలైన సంతృప్తి కలుగుతుందన్నారు. తొర్రూరు లయన్స్ క్లబ్‌లో అత్యధిక మంది సభ్యులు అనుభవజ్ఞులైన వారు ఉన్నారని, తొర్రూరు పరిసరాల ప్రాంతాలలోని ప్రజలకు అవసరమయ్యే సమాజ సేవ కార్యక్రమాలను కొనసాగించి ఇతరులకు ఆదర్శంగా నిలువాలన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చిదిరాల నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా తమ్మి రమేష్, కోశాధికారిగా భవనగిరి శంకర్, ఇతర కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో లయన్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఉప గవర్నర్ ఎన్. సుధాకర్ రెడ్డి, పిడిజిలు డాక్టర్ రాజేందర్ రెడ్డి, రాజిరెడ్డి, లయన్ టి. లక్ష్మి నర్సింహారావు, పి. శ్రీనివాసరావు, డాక్టర్ లవ కుమార్ రెడ్డి, డిసిఎస్ రీజియన్ చైర్మన్ ఆర్. వెంకటరెడ్డి, జోన్ చైర్మన్ రేగూరి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఫిరాయింపులు ప్రోత్సహించింది కెసిఆర్

ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** ఫిరాయింపు లు ప్రోత్సహించి రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన కెసిఆర్ రాష్ట్రాన్ని భ్ర ష్టు పట్టించినట్లు మెదక్ ఎంపి రఘునందన్ రావు విమర్శించారు. మంగళవారం సా యంత్రం గజ్వేల్‌లో నిర్వహించిన బిజె పి కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. గత కెసిఆర్ ప్రభుత్వ హాయాం లో ఫిరాయింపులు ప్రోత్సహించి కాంగ్రెస్ శాసనసభ ప క్షాన్ని టిఆర్‌ఎస్‌లో విలీనం చేసుకోగా, దా న్ని మ రచిన కెటిఆర్, హరీష్‌రావులు ఢిలీలో సన్నా యి నొక్కులు నొక్కుతూ ఫిరాయింపులపై మాట్లాడడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పదమే గిట్టని అప్పటి స్పీకర్, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు కెఆర్ సురేష్ రెడ్డి వారి పక్కన ఉండడం దరిద్రాన్ని పక్కన పెట్టుకున్నట్లే అని ఎద్దేవా చేశా రు. సైకిల్ గుర్తుపై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్ లాంటి వారిని పార్టీలో చేర్చుకొని మంత్రి పదవులు కట్టబెట్టిన కేసీఆర్ నేర్పిన విద్యనే ప్రస్తుత కాంగ్రెస్ అమలు చేస్తున్నట్లు విమర్శించారు. మళ్లీ రాజకీయ విలువలు, భారత రాజ్యాంగం గురించి మాట్లాడితే వారిని ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి అధ్యక్షత వహించగా, నేతలు గురవారెడ్డి, నందన్ గౌడ్, టేడ్ రాంరెడ్డి, సింగం సత్తయ్య, సురేష్ గౌడ్, ఉప్పల మధుసూదన్, మనోహర్ యాదవ్, ఎల్కంటి సురేష్, ధరేష్ బాల్రెడ్డి, లక్ష్మి నరసింహారెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, నాగు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్

## సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లా: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పోరేషన్ ఏర్పాటుచేసి వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రంలోని కార్మికభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటివేణు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమయంలో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కెసిఆర్ తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ రద్దు చేసి ఉద్యోగులందరిని రెగ్యూలైజర్ చేసి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని మభ్యపెట్టారని,అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలోకి తొక్కరాన్నారు.తెలంగాణయావత్‌ప్రజలను మోసం చేసారన్నారు. ఈ పద్ధతి ఇంజనీరింగ్,ప్రైవేటు ఏజన్సీలకు అప్పచెప్పి ఉద్యోగులను ఎంపిక చేసే భాద్యత పనులు వారికి ఇచ్చారని మండిపడ్డారు. ఏజన్సీలకు అప్పచెప్పితే లక్షల్లో వసూళ్ళు చేస్తూ నియామక పత్రాలు ఇష్టానుసారం వహించారని, పని భారం పెంచారు. సరిగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తూ ఉద్యోగులను ఇబ్బందులకు ఎజన్సీలు గురిచేశాయని గుర్తు చేశారు. వేధింపు భరించలేక ఉద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు.రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తూ సమానపనికి వేతనం ఇవ్వకుండా మహిళలకు వేతనం ఇవ్వకుండా మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వలేదని రకరకములగా నిలువుదోపిడి చేస్తున్న ఏజన్సీలపై ప్రభుత్వం దృష్టి సా రించి రద్దుచేసి ప్రభుత్వమే కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగుల ఎంపిక ప్రారంభించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, కల్పించకపోవడం, హెల్త్‌కార్డులు ఇవ్వకపోవడం చాలభాదకరమన్నారు. ప్రభుత్వం స్పం దించి డిమాం డ్లను నెరవేర్చకపోతే కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని సీపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సీపిఐ నాయకులు పంతంరవి,అంగూరి రంజిత్, సోమనాగరాజు కార్మికులు, తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి : ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జగిత్యాల బల్దియా చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో బల్దియా కార్యాలయంలో మంగళవారం బల్దియా చైర్ పర్సన్ అధ్యక్షతన'' ప్రజా దర్బార్ '' కార్యక్రమం నిర్వహించారు. కరెంటు స్తంభాలు, వీధిలైట్లు, డ్రైనేజీల, రోడ్డు, ఖాళీ స్థలంలో చెత్త చెదారం పలు వివిధ సమస్యలున్నాయని తెలుపగా బల్దియా చైర్ పర్సన్ కు ఫిర్యాదులు, వినతుల ద్వారా తెలుపగా బల్దియా అధికారులతో ప్రజల సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చైర్పర్సన్ ఆదేశించారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభు త్వం పనిచేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. బల్దియా కార్యాలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలు వార్డుల్లో నెలకొన్న సమస్యలు చేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ సమ్మయ్య, బల్దియా అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం / బాన్సువాడ : వర్ని మండల కేంద్రంలోని సిసిడిలో మంగళవారం రుద్రూర్, వర్ని, చందూరు, మోస్ర మండలాలకు చెందిన 106 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డివో, వర్ని, మోస్ర పార్టీ మండలాల అధ్యక్షులు సురేష్ బాబా, కొత్తిమీర్‌కర్ లక్ష్మ ణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన తప్పనిసరి




ప్రజాపక్షం/కాగజ్ నగర్ రూరల్ : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షి టీమ్ సభ్యురాలు రమాదేవి అన్నారు. మంగళవారం జిల్లా ఎస్ పి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్‌పి ప్రభాకర్ రావు పర్యవేక్షణలో కాగజ్ నగర్ డివిజన్ పరిధిలో జడ్‌పిఎస్‌ఎస్ పాఠశాల రాస్పల్లిలో విద్యార్థిని విద్యార్థులకు కాగాజ్ నగర్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.రమాదేవి మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవిటీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైనట్లయితే వెంటనే షీ టీం ను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, అలాగే ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీ టీం కాగాజ్ నగర్ ఫోన్ నంబర్ 8712670565 కు సంప్రదించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది షీ టీం సభ్యులు రమాదేవి సునీత పాల్గొన్నారు.

## కనీస వేతనం పెంపునకు వినతి



ప్రజాపక్షం/దిల్వార్పూర్ : మండలంలోనీ ఆశా కార్యకర్తలు తమకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరుతూ మంగళవారం రోజున మండల ఆరోగ్యశాఖఅధికారికివినతిపత్రం అందజేశారు.కేంద్ర ప్రభుత్వ ఎన్.హెచ్.ఎం స్కీంను రక్షించాలని, ఆశాలను కార్యకర్తలుగా గుర్తించాలని కోరారు. ఈ నెల 10న దేశవ్యాప్తంగా జరిగే కోరికల దినం నిరసన కార్యక్రమంలో ఆశాలు పాల్గొంటారని వారికి విన్నవించారు.ఈ కార్యక్రమంలో మండలంలో నా ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## చెస్‌లో మానేరు విద్యార్థులు ప్రతిభ




ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్: కరీంనగర్‌లో ఆదివారం జీనియర్ చెస్‌అకాడమీ ఆద్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో స్థానిక మానేరు విద్యాసంస్థలకు చెందిన విధ్యార్థులు సత్తా చాటినట్లు విద్యాసంస్థల పిఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. అండర్ 11 విభాగంలో లిఖిత్ చైతన్య విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఓపెన్ విభాగంలో శివచైతన్య ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సంధర్భంగా పాఠశాల చైర్మన్ కడారి అనంతరెడ్డి విధ్యార్థులను అభినందించారు. డైరెక్టర్ సునీతా రెడ్డి, ప్రిన్సిపల్ సరితారెడ్డి, పీఈటీలు మహేందర్, తిరుపతి, స్వామి, జహేదలు విధ్యార్థులను అభినందించారు.

## వాహనదారులకు కౌన్సిలింగ్

ప్రజాపక్షం/జమ్మికుంట: జమ్మికుంటలో ఉదయం పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టి నెంబర్ ప్లేట్ లేని వాహనాలను , మైనర్లు నడిపిన వాహనాలతో పాటు, త్రిబుల రైడ్ చేసిన వాహనదారులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 53 ద్విచక్ర వాహనాలను పోలీసులు తనిఖీల్లో పట్టుకుని స్టేషన్‌కు తరలించగా హుజురాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ జి వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతి వాహనానికి తప్పకుండా నెంబర్ ప్లేట్ కనబడే విధంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై కేసులు నమోదు చేయబడతాయని, అంతేగాకుండా భారీగా జరిమానా విధించాల్సి వస్తుందని తెలిపారు. ఒక్కొక్క ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణం చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. పట్టణ సిఐ వరగంటి రవి, ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో మేథోసంపత్తిని పెంచే చెస్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి చెస్ పోటీలలో అత్యుత్తమస్థానంసాధించారు. ఈసంధర్బంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. చెస్ విశ్వ క్రీడ అని, మేథోసంపత్తిని పెంచేటువంటి క్రీడ అని పేర్కొన్నారు. తద్వారా వివిధ పోటీలలో విజయాలను చాలా సులువుగా సాధించవచ్చన్నారు. ప్రాథమిక దశలో విద్యార్థులకు వివిధ రకాల క్రీడలపై అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చెస్ క్రీడకు ప్రత్యేకత ఉందని, విద్యార్థులకు పోటీతత్వాన్ని ఎదుర్కొనేందుకు తగిన ఆలోచనలు అందజేస్తాయన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన పెంచాలని, వారికి కావాల్సిన వనరులను కల్పించాలని, తద్వారా ఘన విజయాలు సాధింపజేయవచ్చని చెప్పారు. ఇటీవల కాలంలో కరీంనగర్ చెస్ అసోసియేషన్ వారి సౌజన్యంతో జీనియస్ చెస్ అకాడమీ వారు నిర్వహించినటువంటి జిల్లా స్థాయి పోటీలలో అగ్రగామిగా నిలిచి రాష్ట్రస్థాయి గుర్తింపును కైవసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఆర్.సుచరిత అండర్ 11 బాలికల విభాగంలో తృతీయస్థానం, జి.ఆయాన్ (4వ) అండర్ 9 బాలుర విభాగంలో 3వ స్థానం, యం.లికిత్ (6వ) అండర్ 11 బాలుర విభాగంలో మొదటిస్థానం, యస్.సరాహర్షిని (7వ) అండర్ 11 బాలికల విభాగంలో 2వ స్థానం, సాయి ప్రణవి (6వ) 6వ స్థానం, అద్వేతయ (8వ) అండర్ 12 బాలికల విభాగంలో 2వ స్థానం కైవసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ విజేతలందరికీ పుష్పగుచ్చాలను అందజేసి భవిష్యత్తులో నిర్వహించబడే పోటీలలో మరిన్ని విజయాలను నమోదు చేయాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

### కెయు రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి



ప్రజాపక్షం/హన్మకొండటౌన్ : విద్యార్థులందరూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని లక్ష్య సాధన కోసం కృషి చేస్తే విజయం సాధిస్తారని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అన్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన అభ్యర్థనలు, సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో నేటి నుంచి 40 రోజుల పాటు కాకతీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్‌లో ప్రారంభం కావల్సిన స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణను ఆగస్టు 1కి మారుస్తున్నట్లు విశ్వ విద్యాలయ సెల్ట్ సంచాలకుడు డాక్టర్ మేఘనరావుతెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు రూ. 1000, బయటికి వారు రూ. 1500 క్యాంపస్ ప్రిన్సిపాల్ నాన్ యూనివర్సిటీ ఫండ్ అకౌంట్‌లో జులై 31 లోపు ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా విద్యార్థి లక్ష్య సాధన కోసం కృషి చేస్తే తప్పక విజయం చేకూరుతుందని కాకతీయ యూనివర్సిటీరిజిస్ట్రార్ఆచార్యమల్లారెడ్డి అన్నారు. కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాలులో క్యాంపస్‌ఫార్మసీ విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీలో ముఖ్య అతిథిగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. హెల్త్ కేర్ రంగంలో విస్తృత అవకాశాలున్నాయన్నారు.21వ శతాబ్దం విద్యార్థి మార్కెట్, ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. పరిశోధన రంగంలో విస్తృత అవకాశాలున్నాయన్నారు.ముఖ్యంగా డాడ్ ఫెలోషిప్, వాన్ హంబోల్డ్ ఫెలోషిప్ లాంటివి సాధించాలని, మంచి ప్రొఫెషనల్స్‌గా ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ కోర్సుల్లో విద్యా ర్థి డొమైన్ విజ్ఞానంతోపాటు నవీన విధానాలు, నైపుణ్యాలు, పని పద్ధతులపై పట్టు సారించాలన్నారు. ఇటీవల నిర్వహించిన గాల్లోన్స్ 2024 ట్రోఫి ఫార్మసీ అంతర కళాశాల మీట్‌లో సాధించిన ట్రోఫీని విద్యార్థులు రిజిస్ట్రార్‌కు తెలియచేశారు.కళాశాల అధ్యాపకులు ఆచార్య నర్సింహారెడ్డి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ నాగరాజు, సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ పాల్గొన్నారు.

## విఆర్‌ఓ వ్యవస్థను పునరుద్ధరించాలి

### సిఎం రేవంత్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి : ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో కీలకపాత్ర పోషించే వీఆర్వో వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కోరారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికిలేఖనుపంపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన వారికి అందించడంతో పాటుభూసమస్యలుపరిష్కారంలో గ్రామ రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీతో పాటు పదోన్నతుల్లో వివక్ష చూపుతున్నారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తోనే తమ ఉద్యోగాలకు భద్రత లభిస్తుందని, తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే విశ్వాసంతో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సైతం గ్రామ గ్రామాన ప్రజల్లో తెలంగాణ భావజాల వ్యాప్తి పెంపొందించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించి, భాగస్వాములు అయిన వీఆర్వో వ్యవస్థనే రద్దు చేయడం దురదృష్టకమన్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్వో వ్యవస్థకు ఎటువంటి ప్రత్యామ్నయం ఏర్పాటు చేయకుండ రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లోని వీఆర్వో వ్యవస్థను ఏకపక్షంగా రద్దు చేస్తున్నామంటూ రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న సుమారు ఐదు వేల వీఆర్వో పోస్టులను ఒక్క కలం పోటుతో రద్దు చేసి, రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఐదు వేల ఖాళీ పోస్టుల్లో వీఆర్వోలను సర్దుబాటు చేయడంతో సుమారు 10 వేలకు పైగా ప్రభుత్వ విభాగాల్లో భర్తీ చేసే పోస్టులను రద్దు చేసి, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయటంలో కీలక పాత్ర పోషించిన వీఆర్వోల సేవలను మరోమారు వినియోగించుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

## భూములు కోల్పోతున్న రైతులను ఆదుకుంటాం

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ప్రజాపక్షం/సంగెం: మామునూరు ఎయిర్ పోర్టు భూ సేకరణలో భూములు కోల్పోతున్న రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు.నియోజకవర్గ పరిధిలోని ఖిలా వరంగల్ మండలం గుంటూరుపల్లి, గాడిపల్లి పరిధిలో మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో గుంటూరుపల్లి, గాడపల్లి, ఎయిర్‌పోర్టు నిర్మాణ ఆవరణలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొలి దశలో విమానాల రాకపోకలకు వీలుగా సుమారు 253ఎకరాలభూమినిసేకరించాలనిఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు, ఆయా గ్రామాల రైతులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్న మధ్య తరగతి కుటుంబాలు మావని రైతులు ఎమ్మెల్యే రేవూరి దృష్టికి తీసుకొచ్చారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం ప్రకటించిన భూముల విలువ తక్కువగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. భూమికి బదులు భూములు ఇవ్వాలని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గాడెపల్లిలో సుమారు 12 మంది ఇళ్లు కోల్పోతుండటంతో వారి ఇళ్లను సందర్శించి ఇంటి యజమానులకు తగు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. భూములు కోల్పోతున్న అన్నదాతలు వరంగల్ పట్టణానికి చేరువలోనే ఉన్న గుంటూరుపల్లికి అతి సమీపంలోనే రహదారి పోయే విధంగా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఖిలా వరంగల్ తహసీల్దారు నాగేశ్వర్‌రావు, 17వ డివిజన్ కార్పోరేటర్ గద్దె బాబు, ఆర్ఐ ఆనంద్, సర్వేయర్ రజిత, నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి జనగాం రమేశ్, మండలాధ్యక్షుడు సొల్లేటి మాధవరెడ్డి, గుమ్మడి హరిబాబు, మెట్టిపల్లి రమేశ్, శ్రీకాంత్, నరేశ్, రామారావు, వినయ్‌తోపాటు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పనులు వేగవంతం



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధిః అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న పనులను వేగవంతంగా చేపట్టి సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. మాక్లూర్, నందిపేట్ మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ మంగళవారం సందర్శించి మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనులను పరిశీలించారు. ముల్లంగి,బోంకన్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను,అంగన్‌వాడీకేంద్రాన్నినందిపేట్ మండలం డిఎస్.రాజనగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను, నర్సరీని కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల్లో వంటగది, వరండా, అదనపు గదులు, వాటర్‌సంప్, టాయిలెట్స్ తదితర నిర్మాణ నిర్మాణాలు, మరమ్మతు పనులున పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాక్లూర్, నందిపేట్ మండలాల ప్రత్యేకాధికారులు ముత్తెన్న, జగన్నాథచారి, పంచాయతీరాజ్‌ఈఈ బావన్న, ఎంపీడీఓ కిరణ్, ముల్లంగిస్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఉమాఉన్నారు.

## పర్యాటక కేంద్రంగా గౌరీ గుండాల జలపాతం



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : గౌరీ గుండాల వాటర్ ఫాల్ సందర్శించిన ఎమ్మెల్యే. పెద్దపల్లి మండలం సబ్బితం గట్టు సింగారం గౌరీ గుండాల జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. సబ్బితం గౌరీ గుండాల జలపాతాన్ని పెద్దపల్లి తహసీల్దార్ రాజ్ కుమార్, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి మంగళవారం సందర్శించారు. జలపాతాన్ని ప్రజలు సందర్శించేందుకు వెళ్లడానికి రోడ్డు సదుపాయం, వాటర్ ఫాల్స్ వద్ద ఇతర సదుపాయాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్థానని హామీ ఇచ్చారు. జలపాత పరిసర ప్రాంతాల వద్ద చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జలపాత ఆవరణలో ఉన్న ప్రభుత్వ భూమి, పర్యాటక కేంద్రం వరకు రహదారి విస్తరణకు అయ్యే ఖర్చుపై నివేదికలు సమర్పించాలన్నారు.సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో జలపాతం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌నాయకులు బండారి రాంమూర్తి, నూగిల్ల మల్లయ్య, బూతగడ్డ సంపత్, సందనవేన రాజేందర్, మస్రత్, కట్కూరి సుధాకర్ రెడ్డి, ఆరె సంతోష్, కలబోయిన మహేందర్, గంట రమేష్, ప్రదీప్, చంద శంకర్, చుంచు సదయ్య, పెద్దులు, గుమ్మడి ప్రసాద్, కందుల అశోక్, కొయ్యడ సతీష్ ఉన్నారు.

## మౌలిక వసతులెప్పుడు?



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు,అటెండర్ స్కావెంజర్ పోస్టులు భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాసం మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థుల దగ్గర నుండి విద్యాసంస్థల యజమాన్యాలు పుస్తకాల పేరుతో, యూనిఫామ్ పేరుతో ఫిజుల రూపంలో తల్లిదండ్రుల దగ్గర నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వెంటనే పాఠ్య పుస్తకాలు, యూనిఫారం అందించాలని, సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థలో అధిక ఫీజును నియంత్రించాలని కోరారు. నిర్మల్ జిల్లా కన్వినర్ కైలాష్ నాయకులు వినేశ్,ప్రవీణ్,నరేష్ పాల్గొన్నారు.

## పాఠశాల పనుల్లో నాణ్యత పాటించాల్సిందే



ప్రజాపక్షం / వేలేరు : పాఠశాలల పనుల్లో నాణ్యత ప్రమా ణాలు పాటించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు జిల్లా కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. వేలేరు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, కళాశాలను ప్రావీణ్య, రాధికాగుప్తా మంగళవారం ఆకస్మిక తనిఖీచేశారు . 75వ వనమహోత్సవం సంధర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సమస్యలపై ఆరాతీశారు. పాఠశాల,కళాశాలలో విధ్యార్థులకు వండిన వంటకాలను,ఆహారాన్ని పరిశీలించారు.అనంతరం పాఠశాల,కళాశాలలోని రికార్డులను తని ఖీ చేశారు. సమస్యలను పాఠశాల ప్రిన్సిపల్ రౌతు అజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని డ్రైనేజి సమస్యలు, టాయిలెట్లను,పరిశీలించి పునరుద్దరణకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గురకుల పాఠశాల,కళాశాలల అమ్మఆదర్శ పాఠశాల కమిటీ ఆద్వర్యంలో పనులు త్వరగా చేపట్టే పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు. వేలేరు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను కలెక్టర్ తనిఖీచేశారు. ఆరోగ్యకేంద్రానికి సంబందించిన వైద్యు ల సిబ్బంది వివరాలను తెలుసుకోవడమేకాకుండా అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. అడిషనల్ ఆర్‌డిఒ శ్రీనివాసరావు,ఇంచార్జ్ డిఇఒ చలపతిరావు, పిఆర్‌డిఇ శిరీష, పిఆర్‌ఇఇ శంకరయ్య, తహశీల్దార్ హెచ్ కోమి, ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న,పిఆర్‌ఎఇ పవిత్రశ్రీవాణి, ఎంపిఒ విమల, ఎపిఒ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ధర్మసాగర్ మండలంలోని ఎలుకతుర్తి గ్రామంలో మహిళా శక్తి కుట్టు శిక్షణా కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య మంగళవారం సంర్శించి కుట్టుశిక్షణ కేంద్రం గురించిన వివరాలను అడిగితెలుసుకున్నారు ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు.

## ఎంప్లాయ్‌మెంట్ అధికారి రాములుపై వేటు

### ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల అమ్మకాలు అనే ప్రజాపక్షం కథనానికి స్పందన

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవల నియామకం జరిగిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిసిందే. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల అమ్మకాలు అనే ప్రజాపక్షం కథనానికిస్పందించి స్థానిక ఎంప్లాయ్మెంట్ అధికారిపై విచారణ చేపట్టిన జిల్లా కలెక్టర్ జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారిగా పనిచేస్తున్న రాములును సస్పెండ్ చేశారు. గతంలో అనేక అక్రమాలకు పాల్పడుతూమున్సిపల్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులలో కూడా అవినీతికి పాల్పడి,నిబంధనలకు విరుద్ధంగా నియమించారని,వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ పోస్టులలో,ఏజెన్సీ టెండర్ల వ్యవహారం లో ఆయన నిబంధనలు ఉల్లంఘించినట్లు, అర్హత లేని ఓ ఏజెన్సీకి అనుకూలంగా డాక్యుమెంటు ప్రక్రియ టెండర్ ప్రక్రియ స్వయంగా దాఖలు చేయడమే కాకుండా,అక్రమాలకు పాల్పడినట్లు రుజువుకావడంతోఅధికారులుఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

# సింగరేణిని పరిరక్షించుకుంటాం

## కేంద్ర కుట్రలు తిప్పికొట్టాలి.. బొగ్గుబావుల వేలం విరమించుకోవాలి

### సింగరేణి గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రతిఘటన ఉద్యమాలతోనే సంగరేణిని పరిరక్షించుకుని తీరుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బొగ్గుబ్లాకులు వేలం వేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన మూడో రోజు రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని కూనంనేని మంగళవారం సందర్శించి సిపిఐ రాష్ట్ర సమితి పక్షాన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభలో ఉన్న మందబలంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు, చట్టాలు తీసుకువస్తూ ప్రభుత్వరంగ సంస్థను కారుచౌకగా ప్రైవేటుకు దారాదత్తం చేస్తోందని, తెలంగాణలో సింగరేణిని దశలవారీగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని, సింగరేణిని అదాని, అంబానీలకు కట్టబెట్టే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇప్పటికే అనేక ప్రభుత్వరంగ సంస్థలను తాకట్టుపెట్టిన కేంద్రం మరో అడుగు ముందుకేసి తెలంగాణకు మనిహారంగా ఉన్న సింగరేణిని లేకుండా చేసే చర్యలకు పూనుకుందన్నారు. ఇక్కడ బొగ్గుబావులను ప్రైవేటీకరిస్తే కోల్‌బెల్ట్ ప్రాంతాలు ప్రశ్నార్థకంగా మారుతాయని, ఇందుకోసం కార్మిక లోకం కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వేలం ప్రక్రియను కేంద్రం విరమించుకుని తెలంగాణ బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలని కూనంనేని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి కార్మిక నాయకులు దమ్మాలపాటి శేషయ్య, జి.వీరస్వామి, వంగ వెంకట్, క్రిస్టాఫర్, కత్తెర్ల రాములు, సందెబోయిన శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, సురేందర్, చంద్రయ్య, ఆరె రాజు, అంకం రాజయ్య, కె.కుమార్ రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన గనులు రాకుంటే సింగరేణి మనుగడకు ప్రమాదం

**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** బొగ్గు బ్లాకులను వేలం వేయకుండానే నేరుగా సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సింగరేణి జిఎం కార్యాలయం ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో మూడురోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలకు రాజ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ నూతన బొగ్గు గనులు రాకుంటే సింగరేణికి మనుగడకు ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలోవైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, నాయకులు నూకల చంద్రమౌళి, మల్లికార్జున్ రావు, దోర్నాల తిరుపతి, నారాయణమూర్తి, రాజేందర్, నాగేంద్రబాబు, సత్తికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, అఖిల్, తిరుపతిరెడ్డి, రవీందర్, రాయమల్లు, తిరుపతి, రాంచందర్, బి.శ్రీనివాస్, సదయ్య, అరుణ్, శ్యామ్, కూరపాటి శ్రీనివాస్, సుధాకర్, ప్రవీణ్, నరేష్, రఘు, నవీన్, ప్రేమ్, శ్రీధర్, రామకృష్ణ, రఘునాథ్, రమేష్ రెడ్డి, చందు, నర్సయ్య, పి.శ్రీనివాస్, క్రాంతి, రామ్‌కుమార్, సాయి శివరాం పాల్గొన్నారు.

### తెలంగాణ బొగ్గు సింగరేణి హక్కు

**పెద్దపల్లి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి ఇవ్వాలని, తెలంగాణ బొగ్గు సింగరేణి హక్కు అని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా జిఎం కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న జిడికె 2వ ఇంక్లైన్ కార్మిక సోదరులకు, ఏఐటియుసి నాయకులకు దండలు వేసి దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచికార్యదర్శి ఆరెల్లి పోషం, సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ మాట్లాడా రు. రెండో రోజు దీక్షల్లో 81మంది జిడికె 2వ ఇంక్లైన్ కార్మికులు పాల్గొన్నారు. దీక్షల్లో కూర్చున్న వారిలో ఎస్.వెంకట్‌రెడ్డి, మిట్ట శంకర్, పర్లపెల్లి రామస్వామి, పొన్నాల వెంకటయ్య, గుడాల శ్రీదర్, బండారి శ్రీనివాస్, జలపతి, పి.శంకర్, రవికుమార్, సదా మల్లేశ్, పంచిక సదయ్య, బిక్షపతి, సదానందం, సిద్ధ కనకరాజు ఉన్నారు. సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షల శిబిరాన్ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూలై 10న అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయా ల వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని, 17న హైదరాబాద్‌లో వేలంవేసే ఆఫీసు వద్ద ధర్నా విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు ఎంఎగౌస్, మద్దెల దినేష్, తాని రాజబాబు, పొన్నాల లక్ష్మి నారాయణ, దాసరి శ్రీనివాస్, బిట్టు వెంకటేశ్వర్లు, చెప్యాల మహేందర్ రావు, జనగామ జగదీశ్వర్, పడాల కనకరాజు, రేణికుంట్ల ప్రీతం, తొడుపునూరి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

## గనుల వేలం రద్దు చేయాలి : వెంకట్రాములు

**ప్రజాపక్షం /హైదరాబాద్:** రాష్ట్రంలో బొగ్గు గనుల వేలం పాటలు రద్దు చేసి సింగరేణి కాలరీస్‌కు నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుజరాత్‌లోని మినరల్స్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ గుజరాత్ మినరల్ కార్పొరేషన్‌కు కేటాయించినట్లుగా తెలంగాణకు చెందిన బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ప్రధానమంత్రిని ఒప్పించి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని, లేనట్లయితే తెలంగాణ ప్రజలు క్షమించరన్నారు. రాష్ట్రంలో వేలం పాటలు రద్దు చేయాలని బొగ్గు నిక్షేపాలను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిర్వహిస్తున్న పోరాట కార్యక్రమాలకు బికెఎంయు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని తెలిపారు.



జయశంకర్ భూపాలపల్లి..


పెద్దపల్లి..

## ప్రజా కళలను భావితరాలకు అందించటమే నిసార్‌కు నివాళి

### ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్




**ప్రజాపక్షం/జగదిరిగుట్ట :** ప్రజా వాగ్గేయకారుడు నిసార్ 4వ వర్ధంతి ని జగదిరిగుట్ట డివిజన్‌లోని ఆరుట్ల రామచంద్రారెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కురిమిద్ద శ్రీనివాస్, శాంతి సంఘం నాయకులు కిషన్‌రావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు బైరాగి మోహన్, రాష్ట్ర సిపిఐ నాయకులు ఏసురత్నం, మండల కార్యదర్శి ఉమా మహేష్, తెలంగాణ ఉద్యమ కళాకారుడు మాపల్లె శంకర్, స్థానిక నాయకులు రషీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా కళలను భావితరాలకు అందించడమే నిసార్‌కు నిజమైన నివాళి అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిసార్ నేడు మన మధ్యలో లేకపోయినా వారి సాహిత్యం ఉంటుందన్నారు. నిసార్ ప్రజాసమస్యలపై తన కలాన్ని ఎక్కుపెట్టిన కవి అన్నారు. సమాజంలోఉన్న ప్రతీ వృత్తిలో ఉన్న సమస్యలను తన కలం ద్వారా సాధారణమైన భాషలో ప్రతిఒక్కరికీ అర్థమయ్యే విధంగా ఉంటుందన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించటమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదరి ప్రమీల, మండల కార్యదర్శి భాస్కర్, కృష్ణ, క్రాంతి కళాబృందం అధ్యక్షులు వెంకటాచారి, రాములు, బాబు, వంగల సినివాస్, యాకుబ్, నర్సయ్య, సహదేవ్ రెడ్డి, హరినాథ్ రావు, సుధాకర్ గౌడ్, రాంచంద్రారెడ్డి, ఇమామ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, సైదమ్మ, బాపిరాజు, రాములు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించండి : ఎఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం కోరారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల సందర్శించి నిర్వహించిన నివేదికను మంగళవారం విద్యాశాఖ కార్యాలయంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈసందర్భంగా రఘురాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. పలు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాలికలకు టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీటి సౌకర్యంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు నవీన్, వంశీ, సుధాకర్ పాల్గొన్నారు.

## టీచర్ పోస్టులు భర్తీ చేయండి




**ప్రజాపక్షం/నాంపల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళికృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మంచినీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించి, బెంచీలు సరిపడా ఏర్పాటు చేయాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, యూనిఫాం పూర్తిస్థాయిలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయ్, రాజశేఖర్, అభినవ్, శివ, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులు కాపాడేది ఎఐటియుసి మాత్రమే : యూసఫ్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట/దుండిగల్ :** కార్మికుల హక్కులు కాపాడేది ఎఐటియుసి మాత్రమేనని, కార్మిక సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని పొట్లూరి నాగేశ్వరరావు భవన్ ఎఐటియుసి కార్యాలయంలో మంగళవారం జిల్లా సమితి సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్, మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేసురత్నం, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత మనదేనన్నారు. భవన నిర్మాణ రంగంలో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి అండగా ఉంటున్నామన్నారు. పారిశ్రామిక రంగంలోని కార్మికులకు అండగా వుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్మికలోకానికి అండగా నిలుస్తామని తెలిపారు.యేసురత్నం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు నూతన జీవో ప్రకారం రూ.25వేలు జీతం ఇవ్వాలని, నైట్ డ్యూటీలు మహిళా కార్మికులకు వేయొద్దని మొదలగు సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. ఉమామహేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు రూ.15వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. నిరుద్యోగులు అప్పులు, ఫైనాన్స్ తీసుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్న క్యాబ్ డ్రైవర్లకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉన్నట్టే క్యాబ్ డ్రైవర్లకు లేబర్ కమిషన్ నుండి కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశంలో జిల్లా సమితి కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు మున్సిపల్ రంగం జిల్లా అధ్యక్షులు రాములు, గౌరవ అధ్యక్షులు రవి చందర్, హరినాథ్ రావు, మహేందర్, రమేష్, మహేందర్, శ్రీనివాసులు, తులసి, వెంకటరమణ, శంకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### మెరుగైన సమాజ నిర్మాణంలో

## యువత పాత్ర కీలకం

### ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మెరుగైన సమాజనిర్మాణంలో యువత పాత్ర కీలకమని, నేటి తరం రాజకీయలపై దృష్టి సారించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 5వ వార్డు ప్యూన్‌బస్తీకి చెందిన పవన్, రత్నాకర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో 50మంది యువకులు, బాబు క్యాంపునకు చెందిన క్రాంతికుమార్, అరుణ, సత్యం ఇమ్రాన్, నాగిని రమేష్, వికాస్, శేఖర్ నేతృత్వంలో 40 కుటుంబాలు కూనంనేని, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు సమక్ష్యంలో సిపిఐ, అనుబంధ ప్రజాసంఘాల్లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ యువత అసాంఘిక శక్తుల వైపు ఆకర్షితులైతే దేశానికి ప్రమాదమన్నారు. సిపిఐ అనుబంధ, ప్రజా సంఘాలు, యువజన సంఘంలో బాధ్యతలు తీసుకుని ప్రజలకు సేవ చేయడం ద్వారా, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయడం ద్వారా పార్టీని మరింత విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళీ, మాజీ ఉప సర్పంచ్‌లు పొలమూరి శ్రీను, యంద్ర మహేష్, ముల్లోజు వెంకట్, అల్లి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

### ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

### ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

### ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

### ఎఐఎస్‌ఎఫ్ కలెక్టరేట్ ముట్టడి, ఉద్రిక్తత




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఛలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద విద్యార్థుల ఆందోళనతో కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అనంతరం ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అనుమతులు లేకుండానే అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయన్నారు. ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో నర్సరీ, ఎల్‌కెజీ, యుకెజీలకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజుల మోత మోగిస్తున్నా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఫీజుల నియంత్రణ చట్టం అటకెక్కిందన్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వం కానీ, అధికారులు కానీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. అడ్మిషన్లతో పాటు డొనేషన్లు, బుక్స్, యూనిఫాం, ఇతరత్రా ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నాయన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలన్న నిబంధనలు ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్టు పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్య అభ్యసించే వారికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగులమీరా, సహాయ కార్యదర్శి శివానాయక్, కౌశిక్, గౌతమ్, రాకేష్, ప్రతాప్, ప్రభాస్, రోహిత్ రాజ్, సందీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఉగ్రదాడిలో డ్రైవరే తొలి టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

రియాసీలో బస్సుపై జరిగిన ఉగ్ర ఘటనకు పోలికలున్నాయి. మాచేడీ కింఢ్లీ మల్హార్ రోడ్డులో బడ్‌నోటా అనే గ్రామం వద్ద రోడ్డు బాగోలేదు. ఏ వాహనమైనా ఇక్కడ గంటకు 15 కిలోమీటర్ల వేగాన్ని మించకుండా వెళ్లాల్సిందే. ఉగ్రవాదులు ముందుగా రెక్కీ నిర్వహించి దాడికి ఈప్రాంతం అనువుగా ఉంటుందని గుర్తించి మాటువేశారు. ఇద్దరు లేదా ముగ్గురు పాక్ ఉగ్రవాదులకు ఒకరు లేదా ఇద్దరు స్థానిక గైడ్లు సాయం చేసినట్లు భద్రతావర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంపై పక్కాగా గురిపెట్టేలా సమీపంలోని ఓకొండపై ముష్కరులు మాటు వేశారు.

**తొలుత టార్గెట్ డ్రైవరే...** వాహనం తమ టార్గెట్‌లోకి రాగానే తొలుత గ్రనేడ్ విసిరారు. ఆ తర్వాత తక్షణమే డ్రైవర్‌ను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరి పారు. అనంతరం నిలిచిపోయిన వాహనంపై విచక్షణారహితంగా రెండువైపుల నుంచి కాల్పులు జరిపారు. ఆ తర్వాత స్థానిక గైడ్ సాయంతో ఉగ్రవాదులు అటవీప్రాంతం గుండా తమ స్థావరాలకు పారిపోయినట్లు భావిస్తున్నారు. ముష్కరులు రెక్కీ నిర్వహించడానికి, వారికి ఆహారం సమకూర్చడానికి ఆ గైడ్లే సాయం చేశారు. గతంలోనూ ఉగ్రమూకలు ఇలా వాహన చోదకుడినే తొలుత టార్గెట్ చేసుకొన్నాయి. పాకిస్తాన్‌తో సరిహద్దు కలిగిన కథువా ప్రాంతంలోకి రెండు నెలల క్రితమే పెద్దసంఖ్యలో విదేశీ ఉగ్రవాదులు చొరబడినట్లు భద్రతా దళాలకు సమాచారం ఉంది. అమెరికా తయారీ ఎం4 కార్బైన్‌ను ఇటీవల కాలంలో ఉగ్రవాదులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. నాటో దళాలు వాడే ఎం16ఎ2కు ఇది తేలికపాటి రకం. 2021లో అఫ్గానిస్థాన్ నుంచి అమెరికా దళాలు బిలియన్ల డాలర్ల విలువైన ఆయుధాలు వదిలి వెళ్లిపోయాయి. వీటిని పాక్‌లోని ఉగ్రసంస్థలైన లష్కరే, జైషేలు తాలిబన్ల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అవి గత కొంతకాలంగా పాక్ మీదుగా కశ్మీర్‌లోకి మెల్లగా చేరుతున్నాయి. కథువాలో సైనిక గస్తీ వాహనంపై ఉగ్రదాడికి తామే పాల్పడినట్లు ఉగ్ర సంస్థ కశ్మీర్ టైగర్స్ ప్రకటించింది. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థకు దీన్ని షాడో సంస్థగా భావిస్తారు.

## నిర్వాహకులదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

తేల్చి చెప్పింది. ఈవెంట్ నిర్వాహకులు, తహసీల్ స్థాయి పోలీసులు, పరిపాలనాధికారులను కూడా దోషులుగా విచారణ కమిటీ నిర్ధారించింది. స్థానిక ఎస్‌డిఎం, సర్కిల్ అధికారి, తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, అవుట్‌పోస్టు ఇన్‌ఛార్జ్‌లు విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యానికి పాల్పడ్డారని పేర్కొంది. 'సికందరరావు సబ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ వేదికను పరిశీలించకుండానే కార్యక్రమానికి అనుమతి ఇచ్చారు. సీనియర్ అధికారులకు కూడా తెలియజేయలేదు. ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. సిక్‌దానరావులో నియమించబడిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి. అందులో ఎస్‌డిఎం, సర్కిల్ అధికారి, సికంద్రరావు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, తహసీల్దార్, కచోరా, పోరా ఇన్‌చార్జి పోలీస్ ఔట్‌పోస్ట్ ఉన్నారు. వాస్తవాలను దాచిపెట్టి కార్యక్రమాన్ని నిర్వహించడానికి నిర్వాహకులు అనుమతి తీసుకున్నారు. అనుమతికి వర్తించే షరతులు పాటించలేదు. నిర్వాహకులు ఊహించని జనాన్ని ఆహ్వానించి తగిన, సజావుగా ఏర్పాట్లు చేయలేదు. అలాగే స్థానిక పరిపాలన అనుమతి షరతులు ఇవ్వలేదు. ఆర్గనైజింగ్ కమిటీతో సంబంధం ఉన్న వ్యక్తులు గందరగోళం సృష్టించారు. సరైన పోలీసు ధృవీకరణ లేకుండా వారు వలంటీర్లను నిమగ్నం చేశారు. ఆర్గనైజింగ్ కమిటీ పోలీసులతో దురుసుగా ప్రవర్తించింది. కార్యక్రమ వేదికను తనిఖీ చేయకుండా స్థానిక పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండానే ప్రజలను కలిసేందుకు సత్సంగకర్త లేదా బోధకుడు (భోలే బాబా) అనుమతించారు. భారీజనసందోహం కారణంగా, ఎటువంటి బారికేడింగ్ లేదా మార్గం ఏర్పాట్లు చేయలేదు. ప్రమాదం సంభవించినప్పుడు, నిర్వాహక కమిటీ సభ్యులు అక్కడి నుండి పారిపోయారు' అని సిట్ తన నివేదికలో తెలిపింది. ఈ నివేదిక ఆధారంగా యుపి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్థానిక సబ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, సర్కిల్ అధికారితో పాటు మరో నలుగురిని మంగళవారం సస్పెండ్ చేసింది. జులై 2న ఈదుర్ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. హత్రాస్ జిల్లా సికందరరావ్ ప్రాంతం ఫుల్‌రయీ, ముగల్‌గఢీ గ్రామాల మధ్యలోని రహదారిని ఆనుకొని ఉన్న ఓ ఖాళీ ప్రదేశంలో తాత్కాలిక షెడ్లు వేసి సత్సంగ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. 80 వేల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నారు. అయితే 2.5 లక్షలకుపైగా ప్రజలు వచ్చినట్లు తేలింది. భోలే బాబా వెళ్తుండగా ఆయన దర్శనం కోసం ప్రజలు ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట జరిగి 121 మంది మృతిచెందారు. ఈఘటనపై ఇప్పటివరకు 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## భారత్ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

బాంబు దాడుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరు కూడా ప్రాణనష్టం వాటిల్లినప్పుడు బాధపడతారని, అది కూడా అమాయక చిన్నారులు హత్యకు గురైనప్పుడు, అమాయక పిల్లలు మరణించినప్పుడు హృదయం ద్రవిస్తుందని, అత్యంత బాధ కలుగుతుందని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం రాత్రి పుతిన్‌తో జరిగిన సాధారణ చర్చల్లో భాగంగా, ఆయన మాటలు విన్నప్పుడు ఆశాభావం కలిగినట్లు భారత ప్రధాని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ పట్ల ఇరువురం పరస్పర అభిప్రాయాలను విన్నామని, తాను కూడా శాంతి, సుస్థిరతపై దక్షిణ భూగోళం ఆకాంక్షలను వ్యక్తపరిచినట్లు ఆయన తెలిపారు. భారతీయులకు ఆహార, ఇంధన, ఎరువుల కొరతను నివారించేందుకు భారత – రష్యాల సహకారాన్ని మోదీ ప్రశంసించారు. ప్రపంచం ఆహార, ఇంధన, ఎరువుల కొరతను ఎదుర్కొంటున్న సమయంలో మా రైతులు ఎలాంటి ఇబ్బందిని ఎదుర్కొనకుండా చూశామని, రష్యాతో తమ స్నేహం ఇందులో పాత్ర పోషించిందన్నారు. రష్యా సహకారంతోనే తాము భారతపౌరులకు ఇంధన కొరత సమస్యలు రాకుండా పెట్రో లు, డీజిల్‌లను అందుబాటులో ఉంచగలిగామన్నారు. దీనిని మరింత విస్తృతపరిచేందుకు భారతదేశానికి రష్యా సహకారం కావాలని కోరారు. ఉగ్రవాద సవాళ్ళపై మోదీ ఈ చర్చల సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం గత 40 ఏళ్ళుగా ఉగ్రవాద సవాళ్ళను ఎదుర్కొంటున్నదని, తాను అన్ని రకాల ఉగ్రవాదాలను ఖండిస్తున్నానని తెలిపారు. చర్చల అనంతరం మోదీ మాట్లాడుతూ పుతిన్‌తో భేటీ ఫలప్రదంగా జరిగిందన్నారు. 'క్రెమ్లిన్‌లో అధ్యక్షుడు పుతిన్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయి.మా చర్చల్లో వాణిజ్యం, వ్యాపారం, భద్రత, వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్నం వంటి అనేక రంగాలలో భారత – రష్యాల మధ్య సహకారం వంటి అనేక అంశాల ప్రస్తావన వచ్చింద'ని మోదీ అన్నారు. అనుసంధానతను పెంచేందుకు, ప్రజలకు ప్రజలకు మధ్య సంబంధాలకు గొప్ప ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ — రంగారెడ్డి
కరీంనగర్ | బుధవారం | 10 జులై, 2024 | 9

## రాష్ట్రంలో రెండు రోజులు భారీవర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రెండురోజుల పాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. సోమవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని సగటు సముద్రమట్టానికి 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఎత్తులో ఉందన్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలాచోట్ల కురిసే అవకాశం ఉందన్నారు.

## మేయర్‌కు సోషల్ మీడియా వేధింపులు

### సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగర ప్రథమ పౌరురాలు గద్వాల విజయలకి సోషల్ మీడియా వేధింపులు తప్పలేదు.హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులుకు ఫిర్యాదు చేయడంతో వేధింపుల ఘటన వెలుగు చూసింది. తన వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చే విధంగా వీడియోలు పెట్టారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు తనను ట్రోల్స్ చేస్తున్నారని ఫిర్యాదులో మేయర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్కడెక్కడ వీడియోలు పోస్ట్ చేశారో అన్న వివరాలతో ఫిర్యాదు చేసిన మేయర్ అసభ్యకర వీడియోలు పోస్ట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను కోరారు. మేయర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# 'బల్కంపేట' తోపులాటలో కుట్ర కోణం

### మంత్రి కొండా సురేఖ

### 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి కళ్యాణోత్సవం సందర్భంగా జరిగిన తోపులాట వెనుక కుట్ర కోణం దాగుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దేవాలయానికి వచ్చిన సందర్భంలో కొందరు రాజకీయ ప్రేరేపిత అల్లరిమూకలు కావాలని తోపులాటకు దిగి శాంతిభద్రతల సమస్య తలెత్తేలా కుట్రకు పాల్పడ్డారని మంత్రి సురేఖ తెలిపారు. పోలీస్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ మంత్రి సురేఖ మందలించారు. బల్కంపేట అమ్మవారి దేవాలయం కళ్యాణోత్సవంలో అవాంఛనీయ ఘటనలు జరిగిన నేపథ్యంలో మంత్రి సురేఖ, హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, అడిషనల్ సిపి (లా అండ్ ఆర్డర్) విక్రంసింగ్ మాన్, వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్, దేవాదాయ శాఖ డిప్యూటి కమిషనర్ రామకృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, రాష్ట్రస్థాయి బోనాల కమిటీ మెంబర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బల్కంపేట బోనాల ఉత్సవాల్లో పోలీసుల నిర్లక్ష్యం కారణంగా రాజకీయ ప్రేరేపిత అరాచక శక్తులు శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు పన్నాగం పన్నాయని మంత్రి సురేఖ అన్నారు. ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల్లో లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు వరుస సమావేశాలు నిర్వహించామని మంత్రులు తెలిపారు. అయినా ఈ సంఘటన జరగడం వాంఛనీయం కాదని మంత్రి సురేఖ అన్నారు. ఆ సమయంలో ఓ మహిళా జర్నలిస్టును డ్యూటీలో ఉన్న ఎస్‌ఐ దుర్భాషలాడిన విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సురేఖ పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. పోలీసులు సిసి కెమెరాల ఫుటేజ్ పరిశీలనతో పాటు స్థానికంగా వుంటూ ఉత్సవాలకు హాజరైన ప్రజల నుండి వివరాలను రాబట్టి బుధవారం లోగా నివేదిక సమర్పించాలని మంత్రి సురేఖ పోలీస్ శాఖను ఆదేశించారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న పోలీసులకు సంబంధించిన సమాచారాన్ని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. అధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రతిష్టను మసకబారిచేందుకు ఎవరు ప్రయత్నించినా సహించబోమని మంత్రులు స్పష్టం చేశారు.

## నూతన ఆవిష్కరణలకు రంగారెడ్డి జిల్లా వేదిక కావాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** నూతన ఆవిష్కరణలకు రంగారెడ్డి జిల్లా వేదిక కావాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆవిష్కరణ ప్రదర్శించే నూతన ఆవిష్కరణల కోసం ప్రతిఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని చెప్పారు. విద్యా, వివిధ శాఖల అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణులు, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయరంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతోపాటు వివిధ ఆవిష్కరణలను ప్రదర్శిస్తారన్నారు. ఆసక్తి గల వారు తమ ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు,100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543కు పంపాలని సూచించారు. పేరు, వయస్సు ఫొటో, వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరుతో వివరాలతో ఆగస్టు 3వ తేదీ లోపు పంపించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఆర్‌ఓ సంగీత, పిడిడిఆర్‌ఎ శ్రీలత, డిపిఒ సురేష్ మోహన్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డిఇఒ సుందర్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ కొబ్బన్న వాసు, అధికారులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/వనస్థలిపురం :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలిని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ శివారు ప్రాంత కాలనీలు కావడంతో అనేక సమస్యలు ఉన్నాయని, సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విధీ దీపాలు, స్తంబాలు, మౌలిక వసతులు కల్పించడానికి నిధులు కేటాయించాలని కమిషనర్‌కు వివరించారు. దీనిపై ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి నిధులు అందించే విధంగా కృషి చేస్తామని సానుకులంగా స్పదించినట్లు కార్పొరేటర్ లచ్చిరెడి తెలిపారు.

## వరల్డ్ స్కేటింగ్ గేమ్స్‌కు ఎన్నికైన వనస్థలిపురం స్కేటింగ్ విద్యార్థులు




**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వరల్డ్ స్కేటింగ్ గేమ్స్‌కు ఇండియా టీమ్‌కు తెలంగాణ నుంచి వనస్థలిపురం విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ఎంపికైన విద్యార్థులకు ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అభినందించారు. మంగళవారం వనస్థలిపురం స్కేటింగ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఇన్లైన్ హాకీ డెవలప్మెంట్ క్యాంపు ముంగిపు కార్యక్రమంలో సుధీరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇండియా తరుపున ఆటల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. తెలంగాణ హాకీ స్కాటర్స్‌గా టంగాటూరి నందిత, సీనియర్ విమెన్‌గా కావ్య, గోల్ కీపర్ జూనియర్ గర్ల్స్ ఎస్. తేజస్విని, జూనియర్ గర్ల్స్ మోహిత్ ప్రణవ్, జూనియర్ బాయ్స్ సాయి చంద్రగోలి, జూనియర్ బాయ్స్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోలర్ స్కెటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజగోపాల్, సెక్రటరీ రామకృష్ణ, అర్జున అవార్డీ అనూప్, నేషనల్ కోచ్ సత్యం, వనస్థలిపురం రింక్ కోచ్ శ్రీనివాస్, ఇండియన్ కోచ్ నికోల తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**ప్రజాపక్షం/యాచారం :** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర ధారుడ్యానికి దోహదం చేస్తాయని యాచారం ఎస్‌ఐ వెంకట్‌నారాయణ అన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. ఈసంధర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చదువుతో బాటు విద్యార్థులకు క్రీడలు ముఖ్యమైనవన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులను , గురువులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/షాబాద్ :** యువత క్రీడల్లో రాణించాలని షాబాద్ సిఐ కాంతా రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని జై భీం కాలనీ యువజన సంఘం సభ్యులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడాల్లో రాణించినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**ప్రజాపక్షం/కడ్తాల్ :** తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామవాసి మల్లుగని మల్లేష్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. పిల్లల చదువుకు ఇబ్బందిగా ఉందని మల్లేష్‌గౌడ్ భార్య మంజుల స్థానిక బిఆర్ఎస్ నాయకుడు మాడుగుల రామస్వామి ద్వారా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌ని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఉప్పల వెంకటేష్ తన ట్రస్టు ద్వారా పిల్లల చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కటికల శేఖర్‌యాదవ్ మాడుగుల రామస్వామి, ముకురాల అశోక్‌గౌడ్ డి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కల్తీ వైన్ తయారీ

### మహిళా అరెస్టు.. మద్యం సీజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో నకిలీ మద్యం తయారు చేసి ఫంక్షన్‌లకు సరఫరా చేస్తున్న ఓమహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. జెరాల్డిన్(54) అనే మహిళ లాలాగూడలోని తన ఇంట్లో అక్రమంగా నకిలీ మద్యం తయారు చేస్తుంది. తయారు చేసిన మద్యాన్ని ఫంక్షన్‌లకు ఆర్డర్లపై సరఫరా చేస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఆ మహిళా ఇంటిపై దాడి చేశారు. దాడిలో 112 వైన్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విదేశాలలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగిస్తున్న నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సైబర్ క్రైమ్ డిసిపి డి.కవిత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఢిల్లీకి చెందిన నిశాంత్‌కుమార్ రాయ్ (31) ఢిల్లీలో నకిలీ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. షైన్ డాట్ కామ్, టైమ్ జాబ్స్ డాట్ కామ్, నౌక్రి డాట్ కామ్ వెబ్‌సైట్ల నుంచి నిరుద్యోగుల డేటా సేకరిస్తాడు. ఆ తరువాత సదరు నిరుద్యోగులకు తన కాల్‌సెంటర్ ద్వారా ఫోన్లు చేసి అరబ్ దేశాలలో ఉద్యోగాలు ఉన్నాయని నమ్మబలుకుతాడు. రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు, వీసా ఫీజు వసూలు చేసి మోసగిస్తాడు. ఇదే కోవలో హైదరాబాద్‌కు చెందిన ఓయువకుడు నిశాంత్‌కుమార్‌రాయ్‌కు సుమారు రూ.4.71 లక్షలు చెల్లించి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఢిల్లీకి వెళ్లి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు డాక్యుమెంట్లు, ఆరు ల్యాప్‌టాప్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు, ఐదు బీటెల్ వైర్‌లెస్ ఫోన్‌లు, ఆరు డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి



### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళ మంత్రి లేకుండానే ప్రభుత్వాన్ని నడపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ది అయితే, ఇచ్చిన ఏ ఒక్క హామిని నేరవేర్చకుండా దేవుళ్లపై ఒట్లు పెడుతూ కాలయాపన చేస్తున్న ఘనుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ధర్నా చౌక్, ఇందిరాపార్క్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా కనీసం రేషన్ కార్డులను ఇచ్చేకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన సిఎం రేవంత్‌రెడ్డి.. ఆ బస్సుల్లో వారంతా తిరుగుతూ.. నిద్రపోయి ఇచ్చినా హామీలన్నీ అమలైనట్లు కలలు కన్నాలనే రీతిలో వ్యవహరిస్తున్నట్లు ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళల 33శాతం రిజర్వేషన్ ఆమోదింపజేయడం ద్వారా రాబోయే ఎన్నికల్లో పార్లమెంట్‌లో 210 మంది మహిళలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించారన్నారు. అదేవిధంగా తెలంగాణలో 44 మంది మహిళా ఎంఎల్‌ఎలుగా ఉండబోనున్నారని, దేశవ్యాప్తంగా చట్ట సభల్లో మహిళల ప్రతినిధ్యం ఘనణీయంగా పెరగనుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే 6 గ్యారంటీలను అమలు చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శిల్పారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకో చోట అమ్మాయిలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే నేరవేర్చాలని లేకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ్మదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్టు షాపులను రద్దు చేయాలన్నారు. ధర్నాల్లో మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డితో పాటు పెద్ద ఎత్తున మహిళా మోర్చ నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల అభివృద్ధికి సహకారం

### మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే శంకర్ వినతి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని, వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న వాటికి పౌష్టిక ఆహారం సకాలంలో ఇచ్చే విధంగా చూడాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రి సీతక్కను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి సీతక్క నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువా, పూలబోకేతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏళ్ల తరబడి ఉన్న సిబ్బందిని స్థానచలనం కల్పించడంతోపాటు పదోన్నతులు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టిక ఆహారం సకలంలో కేంద్రాలను అందే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తిరుపతిరెడ్డి ఉన్నారు.



### ఎజిపిగా ఎన్నికైన అంజయ్యకు సన్మానం

కోర్టు ఎజిపిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది బి.అంజయ్య యాదవ్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించారు. మంగళవారం పట్టణంలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో అంజయ్య యాదవ్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ న్యాయవాది అంజయ్య యాదవ్‌ను ఎమ్మెల్యే సైతం సత్కరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రాజు, మాజీ అధ్యక్షుడు నడికూడ సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది బెన్యూరి చంద్రప్ప, న్యాయవాదులు గోదా మాదవులు, శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ నేతలు గున్న భీమయ్య, జమృద్‌ఖాన్ ఉన్నారు.

## మొక్కలు నాటి.. వాటిని రక్షించాలి

### ఎమ్మెల్యే గాంధీ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** చందానగర్ డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ లో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మె ల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీమతి మంజుల రఘునాథ్ రెడ్డి. చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ వంశీ కృష్ణ, శేరిలింగంపల్లి జోన్ డైరెక్టర్ అనిల్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం సంతోషకరమైన విషయం మన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కాలనీలలో వనమహోత్సవంతో కాలనీలు పచ్చని మణిహారంగా మారుతాయన్నారు. కాలనీలో ప్రధాన రహదారికిరువైపులా, అంతర్గత రోడ్లలో మొక్కలు నాటడం జరిగినదని, కాలనీలో ప్రతి ఒక్కరూ భాగసామ్యం అయి మొక్కలు నాటి వాటిని పెంచి పెద్ద చేసే బాధ్యత తోసుకోవడం అభినందనియం తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో తెలంగాణ తొలి సిఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమం చేపట్టి, రాష్ట్రాన్ని పచ్చని మణిహారంగా మార్చడం జరిగినది అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటుతామని, ఔషద గుణాలు గల మొక్కలు, పండ్ల జాతుల మొక్కలు నాటి ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటి సంరక్షిస్తామని, హరిత హారంలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెంచే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు సమీరా, విక్రమ్ చంద్ర, మాజీ కౌన్సిలర్ రవీందర్‌రావు, రఘునాథ్‌రెడ్డి జనార్దన్‌రెడ్డి, గోపి, వెంకటేష్, అక్బర్ ఖాన్, గుడ్ల ధనలక్ష్మి, వరలక్ష్మి , నరేందర్ బల్లా, యూసఫ్, హుసేన్, ఎల్లమయ్య, రాహుల్, సందీప్, దీక్షిత్, అవనాష్, ఉదయ్, వెంకటేష్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనులతో ఇబ్బందులు

### పట్టించుకోని అధికారులు




**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిలో పైప్ లైన్ పనుల్లో అధికారుల అలసత్వం...ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపం పాఠశాల విద్యార్థుల పాలిట శాపంగా మారింది. నిత్యం పాఠశాలలకు విద్యార్థులు వెళ్తే మార్గంలో ఈ పైప్‌లైన్ పనుల కారణంగా విద్యార్థులతో పాటు ప్రజలందరికీకనీసం రాకపోకలకు కూడా వీలు కాకుండా తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు 80లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ వరద నీటి పైప్‌లైన్ పనులు నెలల తరబడి కోనసాగుతునన్నా పట్టించుకునే నాధుడే కరురవయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈప్రధాన మార్గం గుండానే వ్యాపారులు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు తమ గమ్య స్థానాలకు అలస్యంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనులు నత్తనడక నడుస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ పైప్‌లైన్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## వైద్యసేవలందక పశువులు మృత్యువాత

### కేశంపేటలో ఆసుపత్రి ముందు రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/కేశంపేట:** పాడి పశువులు రోగాల బారిన పడినప్పుడు రైతులకు వైధ్యాధికారి, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో పలు గ్రామాల పాడి రైతులు మంగళవారం పశు వైద్యశాల ముందు ఆందోళనకు దిగారు. వైధ్యాధికారి, సిబ్బంది అందుబాటులో లేక పాడి పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు వైద్యం చేయించేందుకు డాక్టర్‌కు ఫోన్ చేస్తే కలవకపోవడం, ఫోన్ కలిసినా ఎత్తడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక గోపాల మిత్రాలను ఆశ్రయిస్తే వైద్యం కోసం రైతుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో పశువుల కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన మందులు పుష్కలంగా ఉన్నా, రైతులకు ఆ మందులు ఇవ్వకుండా సిబ్బంది బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆందోళన సమయంలో ఆసుపత్రికి వచ్చిన డాక్టర్ నివేదితతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఆసుపత్రిలో ఉన్న మందుల కాటన్లను బయటకు తీసుకువచ్చారు. రైతులకు అందుబాటులోలేని డాక్టర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ రైతులు ఇంచార్జ్ ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.



## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** రంగారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డిటిడిఓ రామేశ్వరిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులకు వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, మంచి తాగునీరు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారని వారికి నాణ్యమైన ఆహారం లేకపోతే చదువుకు దూరమయ్యా అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. హాస్టల్ వార్డెన్స్‌కి రెండు అంతకన్నా ఎక్కువ హాస్టల్లో ఇన్చార్జి ఇవ్వడం వల్ల విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై శ్రద్ధ వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడ్తల్, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవని, విద్యార్థులు రాత్రి సమయాలలో భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. అన్ని వసతులతో కూడిన పక్కా భవనాలను నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు గండికోట శివ, వివేక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు

# కొద్ది రోజుల్లో రైతు రుణమాఫీ మార్గదర్శకాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించనుంది. రైతు రుణమాఫీకి సంబంధించి విధివిధానాలు ఖరారు కానున్నాయని, రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ రైతుల రుణాలకు సంబంధించి ఏక కాలంలో రూ.2 లక్షల లోపు రుణాలన్నింటిని రానున్న స్వాతంత్ర దినోత్సవం లోపే పూర్తి చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. రుణమాఫీకి సంబంధించి 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు తీసుకున్న రూ.2 లక్షల లోపు రుణాలను పూర్తిగా మాఫీ చేయనున్నామని తెలిపారు. రుణ మాఫీ పథకం అమలుకు సుమారు రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని మంత్రివర్గం ప్రాథమిక అంచనాకు రాగా, ఇందుకు సంబంధించిన నిధుల సమీకరణను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని చెప్పారు. అమలుకు సంబంధించి మార్గదర్శకాలను సైతం మరో రెండు రోజుల్లో ఫైనల్ చేసి ఆ తర్వాత అమలు కార్యాచరణను మొదలు పెట్టనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**రైతు భరోసా అర్హులకే అందాలన్నది ప్రభుత్వ లక్ష్యం**

ప్రభుత్వం తరుపున పంట పెట్టుబడి ఆర్థిక సహాయం కింద అందించనున్న రైతు భరోసా పథకంపై సైతం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు భరోసా కోసం రాష్ట్ర రైతులు ఎంతో అశగా ఎదురు చూస్తున్నారని, అయితే గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఈ పథకాన్ని అర్హులకు మాత్రమే అందించాలన్నదే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి విధి విధానాల ఖరారుకుగాను రాష్ట్రంలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయం సేకరిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రైతు వేదికల ద్వారా కొంత మంది రైతుల నుంచి సైతం అభిప్రాయాలను సేకరించడం జరిగిందని చెప్పారు. మరింత మంది రైతుల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరణను బుధవారం ఖమ్మం నుంచి ప్రారంభించబోతున్నామన్నారు. ఆ తర్వాత అన్ని వర్గాల నుంచి అభిప్రాయాల సేకరణ పూరైన తర్వాత విధి విధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి భటి విక్రమార్క చైర్మన్‌గా ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం అందిన తర్వాత వాటిని పూర్తిగా క్రోడికరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అయితే గత ప్రభుత్వం నుంచి రైతుబంధు కింద తాను పైసా తీసుకోలేదని, వచ్చిన చెక్‌లను తిరిగి ప్రభుత్వానికి అందజేశానని మంత్రి చెప్పారు.



## అర్హులైన ప్రతి రైతుకు 'రైతు భరోసా'

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అర్హులైన ప్రతి రైతుకు 'రైతు భరోసా' అందే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందు కోసం కిసాన్ కాంగ్రెస్ కూడా తమ సహకారాన్ని అందించాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కిసాన్ కాంగ్రెస్ సమావేశం సంఘం రాష్ట్ర చైర్మన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం గాంధీ భవన్‌లో జరిగింది. సమావేశంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.కోదండ రెడ్డి, టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రాంమోహన్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు, అధికార ప్రతినిధులు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. రైతు భరోసా, కౌలు రైతుల సమస్యలు తదితర అంశాలపై చర్చించారు.

## తెలంగాణ రాజకీయాలపై ఆసక్తిని ఎపి సిఎం చంద్రబాబు మానుకోవాలి

టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని తెలుగు ప్రజలు పరస్పర సహకారంతో అభివృద్ధి చెందాలంటే ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలంగాణ రాజకీయాలపై ఆసక్తిని మానుకోవాలని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టిడిపిని రద్దు చేసి ఆంధ్రప్రాంతానికి పరిమితం చేసుకోవాలని ఆయన సూచించారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో చంద్రబాబుకు స్వాగతాలు, సన్మానాలను తెలంగాణ ప్రజలు హర్షించరని, ఎన్‌టిఆర్ భవన్‌లో చంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణలో టిడిపిని పటిష్టం చేస్తామనడం దింపుడు కళ్ళెం ఆశలేనన్నారు. హైదరాబాద్ ను అభివృద్ధిని చేశానని గొప్పలు చెప్పుకుంటే తెలంగాణకు చేసిన నష్టాన్ని కూడా బయట పెట్టాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్ర ప్రాంతానికి 2వ సారి సిఎం అయినందుకు తెలంగాణ ప్రజలు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతారు కానీ తెలంగాణ రాజకీయాలలో జోక్యం చేసుకుంటే ఎన్నటికీ క్షమించరన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు గతంలో సహించారు కానీ భవిష్యత్తులో క్షమించరని, సహించరని, వాటిని తిప్పికొడతారని నిరంజన్ హెచ్చరించారు.

## పోటీ పరీక్షల అభ్యర్థుల సమస్యలపై టిజిపిఎస్‌సి చైర్మన్‌తో చర్చించాం

కోదండరాం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోటీ పరీక్షల అభ్యర్థుల సమస్యల పైన టిజిపిఎస్‌సి ఛైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి తో ప్రొఫెసర్ హరగోపాల్, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం కోదండరాం మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను వారి ఆందోళనలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. పోస్టులు మళ్లీ వస్తాయో రావో అనే ఆందోళన మరోవైపు పరీక్షలు రాసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. గ్రూప్ వన్ పోస్టుల సంఖ్యను పెంచడం అలాగే నిష్పత్తిని వందకు పెంచే అంశాన్ని పరిశీలించాలని కూడా చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాం అన్నారు. డిఎస్‌సి గ్రూప్ పరీక్షలకు మధ్యన గ్యాప్ ఉండాలని అప్పుడే అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని తెలియజేశా మన్నారు. వీటన్ని అంశాల పైన కులం కుశంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ మహేందర్ రెడ్డి స్పష్టం చేసినట్టు కోదండరాం వివరించారు. సమస్యల పైన తాము క్రియాశీలకంగా, సమస్యల తీవ్రత దాని స్వభావానికి బట్టి తమ స్పందిస్తున్నామని అన్నారు. నిరుద్యోగుల సమస్యలపై తమకు తోచిన మేరకు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం నిరుద్యోగుల సమస్యల పట్ల తమకు ఇదివరకు ఉన్న నిబద్ధత అలాగే ఉన్నదని ఎక్కడ తేడా రాలేదని తెలిపారు తమ బాధ్యతను తప్పకుండా నిర్వర్తిస్తామని నిరుద్యోగులకు హామీని ఇచ్చారు



## ఉపాధ్యాయులకు వీడ్కోలు

**ప్రజాపక్షం/మానవపాడు :** మానవపాడు మండలం, జల్లాపురం గ్రామంలో చిన్న స్కూల్ హెడ్‌మాస్టర్ ఆనంద్ పెద్ద స్కూల్‌కు చెందిన విష్ణువర్ధన్ అలాగే గ్రామ పెద్దలు లక్కిరెడ్డి సుగుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రెండు పాఠశాల నుండి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు తెలుపుతూ బదిలీపై ఇక్కడికి వచ్చినా ఉపాధ్యాయులను ఆహ్వానిస్తూ ఈ రోజు 13 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగింది. హై స్కూల్ పాఠశాల నందు ఇద్దరి ఉపాధ్యాయులకు మ్యాస్ టీచర్ అయినా ఎల్‌వి వెంకటేశ్వర్ రెడ్డి కి అమరేందర్‌రెడ్డి కి స్కూల్ హెడ్‌మాస్టర్‌గా ప్రమోషన్ రావడంతో తోటి ఉపాధ్యాయులు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు పూర్వపు విద్యార్థులు గ్రామస్తులు బహు సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో చిన్న స్కూల్ హెడ్‌మాస్టర్ ఆనంద్, హై స్కూల్ హెడ్‌మాస్టర్ విష్ణువర్ధన్ ఉపాధ్యాయులు, 2021 సంవత్సరములో చదివిన విద్యార్థులు గ్రామ పెద్దలు లక్కిరెడ్డి సుగుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం

**ప్రజాపక్షం/మల్దకల్:** మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రమణ, ఉపాధ్యాయురాలు శ్రీలత బదిలీపై వేరే పాఠశాలకు వెలుతున్న సందర్భంగా మంగళవారం బిజ్వారం ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ, ఎంతో మంచి విషయాలను తెలిపి పాఠశాలకు రాని పక్షంలో కూడా మా తల్లిదండ్రులను మాకు అవగాహన కల్పించి, విద్యాబుద్ధులు నేర్పిన వారి సేవలు అందించారని విద్యార్థులున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్, జాకీర్, రంగస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ

10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు

ఉమ్మడి పది జిల్లాల్లో వర్క్ షాప్‌లు

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల పర్యటనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా 'రైతు భరోసా' పథకాన్ని అమలు చేసేందుకు విధి, విధానాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క చైర్మన్ గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభ్యులుగా కమిటీని ఖరారు చేసింది. ఈ కమిటీ ఈనెల 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించనుంది. ఈ నెల 10న ఉమ్మడి ఖమ్మంజిల్లాలో, 11న ఆదిలాబాద్, 12న మహబూబ్‌నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి (మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్లగొండ, 23న రంగారెడ్డి జిల్లాలలో వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నట్లు కమిటీ వెల్లడించింది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ పథకానికి సంబంధించి అన్ని జిల్లాల్లో అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు వినాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల నుంచే రైతు భరోసాకు నిధులు చెల్లిస్తామని, అందుకే ప్రజా ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయించిందని కమిటీ తెలియజేసింది. పాత పది జిల్లాల్లో వర్క్ షాప్ ల ద్వారా ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను మధించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు తెలిపింది.

## ఐటిమంత్రిని కలిసిన బోల్లందివాకర్‌గౌడ్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటివిద్యాశాఖమంత్రి నారాలోకేష్‌ను మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో బోల్లందివాకర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అఖండవిజయం సాధించి ఎన్‌డిఎకూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




## ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులనియంత్రణ ఏది ? : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** గుర్తింపులేని ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు అడ్మిషన్ ముసుగులో ఫీజులమోత మోగిస్తున్నాయని కళాశాలలు అకాడమిలపేర్లతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేస్తున్న అకాడమిలను గుర్తించి ఆ అకాడమిలపై క్రిమినల్ కేసులు బనాయించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధుగౌడ్, ప్రేమ్‌కుమార్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం పట్టణంలోని సిపిఐజిల్లా కార్యాలయం లక్ష్మణాచారిభవన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్‌కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అనుమతి లేకపోయిన అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయని అన్నారు. కొన్ని కళాశాలలో అడ్మిషన్లు అయిపోయాయని బోర్డుపెట్టడం బాధాకరమన్నారు. ఫీజులమోత మోగిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చోద్యం చూస్తున్నారు తప్ప గుర్తింపులేని కళాశాలలను గుర్తించి ఆకళాశాలలపై చర్యలు తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు మార్కెట్‌కేంద్రాలుగా మార్కెట్‌చేస్తూ విద్యను పూర్తిగా వ్యాపారపరంచేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైన జిల్లాకలెక్టర్, అధికారులు చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లాకార్యదర్శి శివశంకర్,ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, జిల్లా నాయకులు ప్రకాష్, భూషణ్, సాగర్ పాల్గొన్నారు.

## హమీలు అమలు చేయాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హమీలు అమలు చేయడం లేదని వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అప్పాయపల్లిలో ఇటీవల పదవి కాలం పూర్తి చేసుకున్న మహబూబ్‌నగర్ మండల పరిషత్ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ తీరును గమనిస్తున్నారని, తగిన సమయంలో సమాధానం చెప్పాలన్నారు. గ్రామ అభివృద్ధికి నాయకులు అందరూ సమిష్టిగా కలిసి ఉండి పని చేయాలన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ , మాజీ ఎంపీపీ సుధాశ్రీ, పార్టీ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేందర్ గౌడ్ , రాజేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, అల్లాద్దీన్ , శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎనిమిది మెడికల్ కాలేజీలకు.. అనుమతి నిరాకరణ రేవంత్ వైఫల్యమే

బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ మంజూరు చేసిన ఎనిమిది మెడికల్ కాలేజీలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు నిరాకరించిందని బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మంజూరు చేసిన మెడికల్ కాలేజీల అనుమతులు నిరాకరించడం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, కె.వాసుదేవ రెడ్డి, లక్ష్మణ్ రావులతో కలిసి పెద్ది సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. జిల్లాకో మెడికల్ కాలేజీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో కెసిఆర్, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని మంజూరు చేశారన్నారు. 202223 ఏడాదిలో 8 మెడికల్ కాలేజీలు, 202324లో 9 మెడికల్ కాలేజీలు, 202425లో మరో 8 మెడికల్ కాలేజీలను మంజూరు చేశారన్నారు. మొదటి రెండేండ్లకు సంబంధించిన 17 కాలేజీలకు మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చిందని, 202425లో మంజూరైన మెడికల్ కాలేజీలకు కెసిఆర్ ప్రభుత్వం ఆనాడే నిధులు మంజూరు చేయించారని చెప్పారు. కానీ గత ఐదారు మాసాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నేషనల్ మెడికల్ కౌన్సిల్ వద్ద అనుమతులు తీసుకురావడంలో వైఫల్యం చెందిందన్నారు.

**కాలేజీల అనుమతుల కోసం గంట సమయం కేటాయించని సిఎం..**

తమ పార్టీ ఎంఎల్‌ఎల మార్పిడి కోసం సిఎం రేవంత్ రెడ్డి అర్ధరాత్రి పని చేస్తున్నారని, కానీ 8 కాలేజీల అనుమతుల కోసం ఒక గంట కూడా సమీక్ష చేయలేదన్నారు. ఢిల్లీలో రేవంత్ వారం రోజులు ఉన్నారు కానీ వీటి అనుమతి కోసం సంప్రదించకపోవడం దురదృష్టం అని పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. వైద్యాశాఖ మంత్రిత్వ శాఖతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా సమీక్ష చేయలేదన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారని, కాంగ్రెస్, బిజెపి నుంచి ఉన్న 16 మంది ఎంపిలు కూడా తల దించుకోవాల్సిన పరిస్థితి అన్నారు.




## విద్యార్థులు అన్నిరంగాలలో రాణించాలి

ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అన్నిరంగాలలో రాణించాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వబాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులలో కళాశాలకు నూతనభవనాన్ని మంజూరుచేసి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీటవేయడంతోపాటు ప్రభుత్వ కళాశాలలో పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉచితపుస్తకాలతోపాటు అనేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన ఎందరో విద్యార్థులునేడు ఉన్నత శిఖరాలకు చేరుకొని రాజకీయ ఉద్యోగరంగాలలో రాణిస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకొని విద్యను కొనసాగించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యపై ప్రత్యేకంగా దృష్టిసారించడం జరిగిందని ప్రత్యేకంగా సమీక్ష సమావేశాలను ఏర్పాటుచేసి రాబోయే బడ్జెట్ సమావేశాలలో నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ అనసూయ, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, సీనియర్ అధ్యాపకులు నర్సింహ్మలు, కౌన్సిలర్లు కొత్తశ్రీనివాసులు, రాజు, నిజాంతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డయల్ 100 కాల్స్‌కి తక్షణమే స్పందించాలి

జిల్లా ఎస్పీ కె. రక్షిత మూర్తి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** మదనాపూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె. రక్షిత మూర్తి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్ , పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలని, బ్లూ కోల్ట్స్ , నిరంతరం 24/7 గస్తీ నిర్వహించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుత్నుయని, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని పీస్ సిబ్బంది అందరూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శేఖరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత ఎస్ఐ ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** చట్టాలు అమలుచేసేస్థానాల్లో ఉన్న పోలీసుశాఖలో కులవివక్ష వేధింపులు ఉండటంవల్లే దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకొని మరణించారని ఈఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలని, సిట్టింగ్‌జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బండిలక్ష్మి పతి డిమాండ్‌చేశారు. ప్రభుత్వం స్పందించి సమగ్రవిచారణ జరిపించాలని అన్నారు.

## నకిలీ విత్తన వ్యాపారులపై చర్యలు ఏం తీసుకున్నారు?

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ విత్తనాలను అమ్ముతున్న వ్యాపారులపై ఏవిధమైన చర్యలు తీసుకున్నదీ పూర్తి వివరాలు అందజేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. తెలుగుదేశం ఎమ్మెల్యేగా ఉండగా 2016లో రేవంత్ రెడ్డి వేసిన పిల్‌ను హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. ప్రభుత్వం సమయం కావాలని కోరడంతో విచారణ 4 వారాలకు వాయిదా వేసింది. నకిలీ విత్తన వ్యాపారుల ఆకర్షణీయమైన ప్రకటనలకు రైతులు మోసపోతున్నారని, పంటలు రాక చివరికి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, నకిలీ విత్తనాలు అమ్మే వాళ్ల నుంచి నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేలా చేయాలని.. వంటి విషయాలను పిల్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం వాయిదా కోరడంతో హైకోర్టు అనుమతిస్తూనే, నకిలీ విత్తన వ్యాపారులపై తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## కలెక్టర్‌కు కోర్టు ధిక్కార నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోర్టు ధిక్కార కేసులో భువనగిరి యాదాద్రి కలెక్టర్‌తోపాటు భువనగిరి ఆర్డీవో, తుర్కపల్లి ఎంపీడీఓ, ఎమ్మార్వోలను హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆగస్టు 5న జరిగే విచారణకు స్వయంగా హాజరుకావాలంది. కోర్టుధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలంది. గోపాలపల్లిలో ప్రజావసరాల కోసం చేసిన భూసేకరణకు పరిహారం చెల్లింపులపై గతంలో ఇచ్చిన ఉత్తర్వులు అమలు కాలేదంటూ బాధిత పిటిషనర్ రహీముద్దీన్ కోర్టు ధిక్కకరణ కేసు వేశారు. దానిని విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేసి పైవిధంగా ఆ అధికారులక నోటీసులు జారీ చేశారు.

## మహేశ్వర మెడికల్ కాలేజీ అప్పీళ్లను వినండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మెడికల్‌లో పీజీ అడ్మిషన్లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై మహేశ్వర మెడికల్ కాలేజీ వేసిన అప్పీళ్లను మరోసారి విచారించాలని కేంద్రానికి హైకోర్టు ఆదేశించింది. కాలేజీ వాదనలు విన్నాక తీసుకునే నిర్ణయాన్ని అధికారికంగా వెల్లడించాలని కేంద్రానికి ఆదేశించింది. పీజీ అడ్మిషన్లకు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించడంలో నకిలీవి ఉన్నాయని చెప్పి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కాలేజీ అడ్మిషన్లను రద్దు చేసింది. దీనిపై కాలేజీ వేసిన అప్పీళ్లను కేంద్రం కొట్టేయడంపై దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ నంద విచారించి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు.

## డిఎస్‌సి వాయిదా వేయాలని కోరితే.. అభ్యర్థుల అరెస్టులు, అక్రమ కేసులా?

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిఎస్‌సి వాయిదా వేయాలంటూ, పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై అక్రమ కేసులు, నిర్బంధం, అరెస్ట్ చేయటాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి అని చెప్పి ఇప్పుడు వారిని దగా చేస్తారా? అని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారని, వందల మందిని అన్యాయంగా అరెస్టు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. ఇప్పుడు ప్రిపరేషన్‌కు కూడా టైమ్ ఇవ్వకుండా, వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడటం ఎంత వరకు కరెక్ట్ అన్నారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ డిఎస్‌సి అభ్యర్థులు కోరుతుంటే వారి డిమాండ్‌ను పరిశీలించటంలో ఎందుకింత మొండి వైఖరో చెప్పాలన్నారు. నిరుద్యోగులంతా ఈ ప్రభుత్వం వైఖరిని గమనించాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న దృష్టి, పోరుబాట పట్టిన నిరుద్యోగులపై లేకపోవడంపై కాంగ్రెస్ సిగ్గుపడాలన్నారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ సర్కార్‌ను భుజాన మోసిన సోకాల్డ్ మేధావులు ఇప్పుడు ఎక్కడున్నారని, ప్రశ్నించే గొంతులు ఎందుకు మూగబోయాయో చెప్పాలన్నారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి ప్రదర్శిస్తే నిరుద్యోగులతో కలిసి మరో ఉద్యమాన్ని నిర్మిస్తామని కెటిఆర్ హెచ్చరించారు.



## కుల వివక్ష ఇంకెన్నాళ్లు..?

**ప్రజాపక్షం/అడ్డాకుల:** సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి వెంటనే మృతికి కారకులను అరెస్టు చేయాలి. పాతరి ప్రసాద్ అడ్డాకుల మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మృతుడు అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మునగల శెట్టి బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామంలోని సభ్యులు, కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న మన దేశంలో ఇంకా కుల వివక్ష వెంటాడుతుందని కుల వివక్ష పోలేదని కేవలం రూపాంతరం చెందిందని ఆయన అన్నారు. ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించాలని ఆ కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని కెవిపిఎస్ అడ్డాకుల తరపున ఆయన డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ అడ్డాకుల గ్రామ ఎస్సి సెల్ అధ్యక్షులు మునగల రమేష్, కెవిపిఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## జర్నలిస్టు వృత్తి పవిత్రమైనది

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** జర్నలిస్టులు వృత్తి పవిత్రమైనదని నిబద్ధతతో పని చేసి జర్నలిస్టులు మానవతా విలువలు పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వనపర్తి జిల్లా, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు అధ్యక్షతన వనపర్తి పట్టణంలోని తరుని ఫంక్షన్ హాల్‌లో నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మధుగౌడ్‌కు అభినందన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహిత మధుగౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులు మానవీయ కోణంలో వార్తలు రాసే తగిన గుర్తింపు వస్తుందన్నారు. తాను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన యూనియన్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రాం నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. సభ ప్రారంభానికి ముందు ఈనాడు, ఈటీవీ వ్యవస్థాపకులు స్వర్గీయ రామోజీరావుకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాగర్‌కర్నూల్ జిల్లా ఇంచార్జీ శ్యాం, వనపర్తి జిల్లా కార్యదర్శి మాధవ్ , జాతీయ కౌన్సిల్ సభ్యుడు, ప్రశాంత్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమేష్ , సీనియర్ పాత్రికేయులు ఉషన్న, పొర్ణరెడ్డి, బి. రాజు, ఖలీల్ , ఎల్లగౌడ్ , సాహితి కళావేదిక కన్వీనర్ పలుస శంకర్ గౌడ్ , గంధం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మహిళా కన్వీనర్ ధనలక్ష్మీ వాల్మికి సంఘం నాయకులు రాములు, జిల్లా కార్యదర్శి ముంత భాస్కర్ , పట్టణ, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ , మన్యం, జర్నలిస్టు నాయకులు, దినేష్, కుమార్ , విజయ్ , సీల్ మార్తి, పట్టణ కోశాధికారి ఆంజనేయులు, తిరుపతయ్య, సురేష్ , నర్సింహ, రాజ్ వేణు, శ్రీనివాసులురెడ్డి, నటరాజ్ ,శ్రీకాంత్ , నాకొండ, జిల్లా ఉర్దూ పత్రికలు, మహ్మద్ కమల్ , ఎండి షఫీ, ఎండి షీరాజ్ , నశిరొద్దిన్ , ఎంఎ సలాం, అబ్దుల్ వహిద్ , గోపాల్ , జిల్లా ఫోటో జర్నలిస్టులు, ఎస్‌వి రమేష్ , రాము, యాదిరెడ్డి, శ్రీకాంత్ , వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తాం :కోలన్ హనుమంత్‌రెడ్డి



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ , శంబీపూర్ గ్రామం కె.విఆర్, స్ప్రింగ్ వుడ్స్, ప్రణీత్ నతురల్ బౌంటీ, ల్యక్ రిడ్జ్ కాలనీలో తీవ్రమైన 3 ఫేస్ కరెంటు ఇబ్బంది ఉండటం వలన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ను కలిసి సమస్యపై వినతిపత్రం అందచేశారు. వీలైనంత త్వరగా అధికారులతో మాట్లాడి శంబీపూర్ లో సుబ్‌స్టేషన్ ఏర్పాటు చేపిస్తాని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి : కార్పొరేటర్ శ్రవణ్



ప్రజాపక్షం/మల్కాజిగిరి: డ్రైనేజి సంబంధిత సమస్యలు తలెత్తకుండా చూడాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సైనిక్‌పురి వాటర్ వర్క్స్ డివిజన్ జనరల్ మేనేజర్ అశోక్‌ను కోరారు. మంగళవారం ఆయనను కల్సిన కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధి ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గిరి, గోపాల్ సింగ్, వెంకటేష్ తదితరులు కార్పొరేటర్ వెంట ఉన్నారు.

## అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు



ప్రజాపక్షం/దుండిగల్ :దుండిగల్ మున్సిపాలిటీ బహదూరపల్లి ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 239 మున్సిపల్ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానిక కౌన్సిలర్ భరత్ కుమార్ దుండిగల్ ఎమ్మార్వో సయ్యద్ అబ్దుల్ మతిన్, మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ రావు, మేడ్చెల్ జిల్లా ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

## గుట్కా తయారీ బట్టబయలు

రైడింగ్ చేసి స్వాధీనం చేసుకున్న పోలీసులు



ప్రజాపక్షం/కోట్‌పల్లి : గత కొంత కాలంగా ఓగులాపూర్ సమీపంలో గుట్టు చప్పుడు కాకుండా గుట్కా తయ్యారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రవంతి తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తూ... కోట్‌పల్లి మండల పరిధిలోని ఓగులాపూర్ గ్రామ సమీపంలోని ఓ కోళ్ళ ఫారంలో గత కొంత కాలంగా అబ్దుల్ కరీం అనే వ్యక్తి 50 మంది బిహారీలతో గుట్కా ప్యాకెట్లను తయ్యారు చేసి మహారాష్ట్రకు సరాఫరా చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం విశ్వసనీయ సమాచారంతో పోలీసులు రైడింగ్ చేసి గుట్కా రా మెటీరియల్ ४0 కేజీల 20 బ్యాగులు, 6 కేజీల 6 బ్యాగులు, 1000 50 ప్యాకెట్లు ( ప్యాకింగ్ కవర్స్) 5 బెండలు దాదాపుగా 60 వేల విలువ ఉంటుందని వీటిని స్వాదీనం చేసుకుని అబ్దుల్ కరీంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అల్వాల్ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలి:శాంతి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/మల్కాజిగిరి: అల్వాల్ డివిజన్‌లో పేరుకొని పోయిన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌ను కోరారు. మంగళవారా ఆయనను కార్యాలయంలో కల్సి తమ డివిజన్‌లో పార్కుల సుందరీకరణ, సిసి రోడ్లు, బాక్స్ డ్రైనేజి, గుర్రపు డెక్క తొలగించటం లాంటి అనేక పనులు చేయాల్సి ఉందని, వీటన్నిటిని చేపట్టి పూర్తయ్యే ఏర్పాటు చేయాలని తెలిపారు.

## బంట్వారం శ్రీలక్ష్మి వైన్స్‌లో కల్తీ మందు




ప్రజాపక్షం/బంట్వారం : బంట్వారం మండల కేంద్రంలో ఉన్న శ్రీలక్ష్మి వైన్స్‌లో కల్తీ మందు అమ్ముతున్నాకరని ఓ వ్యకి వైన్స్ షాపు యాజమాన్యానికి నిలదిశాడు. వివరల్లోకి వెళితే బంట్వారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తను రోజంతా ఖష్టం చేసి అలసిపోయిన ఒక క్వాటార్ తాగితే గాని నిద్ర రాదని వైన్స్ షాపు వేళ్ళి మద్యం (క్వాటార్) రాయల్ స్టాగ్ తీసుకోని చేతులో పట్టుకున్నా వెంటనే బాటిల్ ఉన్న మద్యం లీకావడంతో జరిగిందని, మరో 90 బాటిల్ తీసుకోగా అది కూడా మూతా స్టీకర్ తీయగానే సులువుగా చేతిలోకి వచ్చిందని ప్రజాపక్షం దిన పత్రిక ప్రతినిధికి వివరించారు. ఇప్పటికే మద్యం తాగి ఆరోగ్యాలు పాడువుతుంటే కల్తీ మద్యం వైన్స్ షాపులో అమ్మి ప్రజల ప్రాణాలతో చేలగాటం అడుతున్నారని పలువురు వైన్ షాపు యాజమాన్యాన్ని నిలదీయగా దిక్కున్నా చోట చేప్పుకోమ్మని సామన్య ప్రజలకు మద్యం వ్యాపారులు ఇష్టానుసారంగా రేచ్చిపోతున్నారు. కల్తీ మందు అమ్ముతున్నా వైన్ షాపుల ఎక్సైజ్ శాఖ సంబంధిత అధికార యత్రంగం చర్యలు తీసుకోవాలని కోరారు.

## బదిలీపై వెల్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాపక్షం/కోట్‌పల్లి: గత కొంత కాలంగా కోట్‌పల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాలకు బదిలీపై వెల్లిన 7 మంది ఉపాధ్యాయులకు సన్మానాన్ని నిర్వహించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు చంద్రప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు బదిలీలు సహజమేనని ఎక్కడ పని చేసిన గుర్తింపు వచ్చేలా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో కొనసాగుతున్న ఎంపికలు



ప్రజాపక్షం/శామీర్‌పేట : తూంకుంట మున్సిపాలిటీ హాకింపేటలోని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సెలక్షన్స్ మంగళవారం కొనసాగించారు. 2024–25 విద్యా సంవత్సరానికి 4వ తరగతి ప్రవేశాలకు జరుగుతున్న సెలక్షన్స్ సాట్ డిప్యూటీ డైరక్టర్ చంద్రారెడ్డి, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ ఏఎన్‌కే గోకుల్, హన్మకొండ డివైఎస్‌వొ అశోక్‌లు పరిశీలించారు. గ్రూప్2 సెలక్షన్స్‌లో నిజామాబాద్, జిగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, జిల్లాల నుంచి విద్యార్థిని, విద్యార్థులకు ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటి, ఫ్లెయింగ్, స్టార్ట్ 6*10 మీటర్ల రన్నింగ్, షటుల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, స్టాండింగ్ బోర్డు జంప్,800 మీటర్ల రన్నింగ్, మెడికల్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎస్‌వోలు వేంకటేశ్వరరావు, అశోక్, కోచ్‌లు, పీడిలు, పీఈటిలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అందుబాటులో రోగులకు మందులు

● కలెక్టర్ గౌతం



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: రోగులకు సరి పడే విధంగా ఎప్పటికప్పుడు మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉండే ఏర్పాటు చేసుకోవటంలో వైద్యాధికారులు నిర్లక్ష్యం కనపరచవద్దని జిల్లా కలెక్టర్ గౌతం హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవఖానాల ద్వారా బిపి, దయాబిటిస్‌లాంటి దీర్ఘకాల వ్యాధులకు అవసరమయ్యే మందులు నెలకు సరిపడే విధంగా క్రమం తప్పకుండా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విషయాన్ని ప్రజలందరికీ తెలిసేలా చూడాలన్నారున. మంగళవారం నాడు జవహర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ రఘునాథస్వామి, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతిలతో కల్సి తనిఖీ చేసారు. ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ ,డ్రెస్సింగ్, వ్యాధి నిర్థారణ పరీక్షలు,ఇమ్యునైజేషన్, ఫార్మసీ విభాగాలతో పాటు ఆపరేషన్ థియేటర్‌లన్నిటినీ తిరిగి పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, వర్షాకాలం దృష్ట్యా అంటు వ్యాధులు సోకకుండా చూడాలని, అవసరమైతే సత్వర చికిత్సలందించాలన్నారు. సాధారణ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం కనపరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ గౌతం హెచ్చరించారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల కంటె మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో ఉపాధ్యాయులు బోధనా విధానం ఉండాలన్నారు. మంగళవారం జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారితో కల్సి కలెక్టర్ తనిఖీ చేసారు. తరగతి గదులకు వెళ్లిన ఆయన పాఠ్య పుస్తకాల అంశాలు విద్యార్థులను ప్రశ్నించి తెలుసుకొన్నారు. ఉచితంగా యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు అందించారా లేదా అన్న విషయాలను అడగటమే కాక పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెల్సుకొన్నారు.

## పోలీస్ సిబ్బంది ఎలాంటి ఒత్తిడి లేకుండా పనిచేయాలి

● ఎస్‌పి కె.నారాయణరెడ్డి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా ఎస్‌పి కార్యాలయంలోని సోమవారంనాడు ఎఆర్ పోలీస్ అధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నా ఎస్‌పి నారాయణరెడ్డి ఈ సందర్భంగా ఎఆర్ సిబ్బంది అ ధికారులతో మాట్లాడించి వారికి ఉన్న వృత్తిపరమైన ఇబ్బందులు కావాల్సిన మౌలిక సదుపాయల గురించి మొదలగు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది అధికారులు ఎలాంటి ఓత్తిడి లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో క్రమశిక్ష ణతో, ఓపిక తో విధులు నిర్వహించాలని ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వహించాలని, అత్యవసరమైనా సమయంలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరూ తెలంగాణ పోలీస్ డిపార్మెంట్‌కు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని సమయపాలన, క్ర మశిక్ష ణను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎలాంటి చేడు అలవాట్లకు లోనుకాకుండా ఆ రోగ్యంగా ఉండాలని పోలీసు అధికారులు సిబ్బంది తెలియజేసినారు. సి బ్బంది సులువుగా ఫిర్యాదు చేసుకోవడానికి వీలుగా గ్రేవియన్స్ బాక్స్‌ను ఏ ర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎఆర్ హెడ్ క్వాటర్సలో ఉన్న బెల్ ఆఫ్‌ఆర్మ్ .స్టోర్ రూమ్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిటిసి అదనపు ఎస్‌పి మురళీధర్, అంజత్‌పాషా, డేవిడ్, విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# రసాభాస మధ్య సర్వసభ్య సమావేశం

కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ కార్పొరేటర్ల వేడివాడిగా మాటల యుద్ధం

కొన్ని తీర్మానాలు ఆమోదమైనవి :మేయర్ జక్క వెంకట్ రెడ్డి

మున్సిపల్ కమిషనర్ రాజీనామా చేయాలి

డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్



ప్రజాపక్షం/బోడుప్పల్: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. మంగళవారం నగర మేయర్ జక్క వెంకటరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య ఆహ్వానితులుగా మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్ని సెట్విన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సర్వసభ్య సమావేశం ప్రారంభంకాగానే కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఓటింగ్ ప్రకారం నిధులు కేటాయించాలని కోరారు. దీంతో బిఆర్ఎస్ కార్పొరేటర్లు గతంలో ఎలా సమావేశాలు నిర్వహించరో అదేమదిరిగా సమావేశం నిర్వహించి పీర్జాదిగూడను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు ససేమీరా అనడంతో సమావేశం కొద్దిసేపు వాయిదా వేశారు. దీంతో ఎంపి అసహనం వ్యక్తం చేసి వెళ్లిపోయారు. తిరిగి సమావేశం ప్రారంభించారు. కానీ కాంగ్రెస్ కార్పొరేటర్లు ససేమీరా అనడంతో కొన్ని తీర్మానాలు చేసి వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపి, ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లతో కలిసి వన మహోత్సవంలో భాగంగా సెట్విన్ సెంటర్‌లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు సంరక్షించాలని అన్నారు.

**కొన్ని తీర్మానాలు ఆమోదమైనవి**

**మేయర్ జక్కా వెంకట్ రెడ్డి:** సర్వసభ్య సమావేశంలో అత్యవసర మేరకు కొన్ని తీర్మానాలు చేశామని . గతం లో రాష్ట్రంలోనే అభివృద్ధి పనుల్లో మొదటి స్థానం దక్కించుకున్నాం అని తెలిపారు. ప్రస్తుతం కూడా మొ దటి స్థా నంలో ఉండేందుకు కార్పొరేటర్లు సహకరించాలన్నారు.

**కమిషనర్ తీరుపై డిప్యూటీ మేయర్ ఆగ్రహం**

పీర్జాదిగూడ కమిషనర్ తీరుపై డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య స మావేశంలో తమ మనోభావాలను కించపరిచే విధంగా కమిషనర్ త్రిలేశ్వర్ రావు ప్రవర్తించారని మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద కార్పొరేటర్లతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ, తమను సర్వసభ్య సమావేశానికి ఉదయం 11 గంటలకు హజరు కావాలని కోరిన కమీషనర్ మేయర్ కు తోత్తుగా వ్యవహరిస్తూ సమావేశం ప్రారంభించడంలో కమిషనర్ అలసత్వం వహించారని, ప్రజా ప్రతినిధులమని కూడా చూడకుండా గంటకు పైగా పట్టించుకోకుండా అవమాన పరిచారని, మా మనోభావాలను కించపరిచేలా ప్రవర్తించారన్నారు. ఇందుకు గాను కమిషనర్ వెంటనే తనకు తానే రాజీనామా చేసి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు.

## భూ కబ్జాలపై సమగ్ర దర్యాప్తు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



ప్రజాపక్షం/ నిజాంపేట్: జగద్గిరిగుట్ట, భూదేవి హిల్స్‌లో భూ కబ్జాల పై సమగ్ర దర్యాప్తును చేపట్టాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజేందర్ రెడ్డిని కలిసి కాంగ్రెస్ నాయకుల బృందం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని మూసాపేట మండలం, కుత్బుల్లాపూర్ మండలానికి సరిహద్దులో గల జగద్గిరిగుట్ట, భూదేవి హిల్స్‌లోని సర్వే నంబరు 348/1లోని ప్రభుత్వ స్థలాన్ని యథేశ్చగా నోటరీ ప్లాట్లుగా విభజించి విక్రయిస్తూ ఓ బకాసురుడు సొమ్ము చేసుకుంటున్నాడని మండిపడ్డారు. ముఖ్యంగా గాజులరామారంలోని పరికి చెరువు, హిందూ, ముస్లిం శ్మశాన వాటికలను సైతం వదలకుండా బకాసురుడు ప్రభుత్వ స్థలాన్ని అమాంతం మింగేస్తున్నాడని ఆరోపించారు. తక్ష ణమే స్పందించి భూదేవి హిల్స్‌లో జరుగుతున్న అక్రమణలు, భూ కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, సయ్యద్ రషీద్, కృష్ణా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణపు పనులు

నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి



ప్రజాపక్షం/ నిజాంపేట్ : బాచుపల్లి ఫ్లై ఓవర్ నిర్మాణపు పనులను త్వరగా పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ప్రధాన చౌరస్తాలో జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణపు పనులను అధికారులతో కలిసి మేయర్ కొలను నీలా రెడ్డి పరిశీలించారు. అదేవిధంగా బాచుపల్లిలోని అనుసంధాన కల్వర్టుని, రోడ్డు విస్తరణ పనులు, అంగారా హోటల్ వద్ద గల నూతన కల్వర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించి పనుల స్థితి గతులను తెలుసుకున్నారు. అనంతరం ప్రగతినగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారులతో నీలా రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాచుపల్లిలో జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణపు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చూడాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా కల్వర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో ఏ మాత్రం నాణ్యత లోపించినా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణ రావు, ఎస్ఈ సత్యనారాయణ, కార్పొరేటర్‌లు కాసానిసుధాకర్,విజయలక్ష్మి ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ మారలేదనే కక్షతోనే ఇండ్ల కూల్చివేతలు

కాంగ్రెస్ కార్పొరేటర్లను ప్రశ్నించిన బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు



ప్రజాపక్షం/బోడుప్పల్: పార్టీ మారలేదని మాపై కోపంతో పేదల ఇండ్లను కక్ష్య పూరితంగా కూల్చడం ఎంతవరకు సబబని బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ప్రశ్నించారు. పీర్జాదిగూడ బీఆర్ఎస్పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షులు బండారి రవీందర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్జాదిగూడ పాలకవర్గం ఏర్పడి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు గడుస్తుందని ఏనాడు సీలింగ్ భూమి అనని కార్పొరేటర్లు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లగానే అన్ని మారుతాయా అని ప్రశ్నించారు. ఆ స్థల భూ స్వామి, ప్లాట్లు చేసి అమ్మింది ఇద్దరు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని అమ్మిన వారే నేడు అది సీలింగ్ ల్యాండ్ అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లే అనిపిస్తుందని అన్నారు. కార్పొరేటర్లమందరం కలిసిమెలిసి అందరి ఐక్యమత్యంతో పీర్జాదిగూడ నగరాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ తీర్చిదిద్దిన మనం అడ్డదారిన మేయర్ పీఠం కోసం పావులు కదపడం మీకు తగునా అని అన్నారు. మేయర్ కావాలని అమర్ సింగ్ పగటి కలలు కంటు డబ్బు ఉంటే ఎదైనా చేయవచ్చనే భావంతో ఉన్నాడని ఆయనకి కనీసం వాళ్ల డివిజన్ ప్రజలను గుర్తుపడుతాడా, మామ ఎత్తు జిత్తులతో మేయర్ కావచ్చనే ఊహాగానాలలో ఉన్నాడను తెలిపారు. వ్యక్తిగత తగాదాలు ఉంటె వ్యక్తిగతంగానే గా చూసుకోవాలి కానీ ప్రజల ఆస్తుల జోలికి పోవడం సిగ్గుచేటని ఇది రాజకీయ వ్యభిచారంతో సమానమన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారని, వాళ్లకు కూల్చడమే తప్పా నిర్మించడం తెలియదని వాపోయారు. ఇప్పటికైనా భవిష్యత్తులో అందరం కలిసిమెలిసి పార్టీలకు అతీతంగా పీర్జాదిగూడ నగర ప్రజలకు మెరుగైన పాలన అందించే విధంగా ఉందామని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కౌడె పోచయ్య, హరిశంకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనంత రెడ్డి, బచ్చ రాజు, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ పార్టీ నగర ప్రదాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మనోరంజన్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్ని చోట్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పకడ్బంధీగా అమలు చేయాలని ,ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులను పూర్తి చేయాలనీ ,సీజినల్ వ్యాదులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లాలో వనమహోత్సవం క్రింద మొక్కలు నాటేందుకు స్థలాలను ఎంపిక చేయాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి అదనపు కలెక్టర్ సుధీర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యానాయక్ ,డిఆర్‌డిఏ శ్రీనివాసులు ,ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్ ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్‌కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై వస్సస్ సంస్థ అవగాహన



ప్రజాపక్షం/దౌల్తాబాద్ : దౌల్తాబాద్ మండలంలోని ఆర్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మండల రైతు సంఘం ఆధ్వర్యంలో వస్సన్ సంస్థ సహకారంతో పోలు ఇండియా వారు సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా మొదటగా ఈర్లపల్లి గ్రామంలో దేశివిత్తన కేంద్రము , వ్యవసాయ పనిముట్టు కిరాయి ,అమ్మకం కేంద్రం ప్రారంభించారు. నారాయణ రైతు దగ్గర జీవ వనరుల కేంద్రంలో ద్రవ జీవామృతం త యారీ కేంద్రంన్ని సందర్శించి ప్రారంభించారు. రైతులతో సామవేశం నిర్వహించి వాసన సంస్థ పిఓ అనిల్ ఉప్పలపాటి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పంటను పండించుకోవడం ద్వారా మనా ఆరోగ్యానికి చాలా మంచిది రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ,అలాగే వాతవరణంలో చోటు చేసుకుంటున్నా మార్పులను అరికట్ట వచ్చు అని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా రాబడి కుడా వస్తుంది అని అన్నారు. దేసి వంగడాలు బియ్యం తినడం ద్వారా షుగరు బిపి మోకాళ్ల నొప్పులు వంటి వీర్ఘకాలిక సమస్యలు ఎలా నియంత్రించుకున్నం అని కొందరు రైతలు తమ అనుభావాన్ని తెలియజేశారు. జీవమృతము వడడం వల్ల వానపాములు సంఖ్యేపెరిగి భూమిలో సారాన్ని పెంచుతాయని తెలియజేశారు. సాయిరెడ్డి పోలంలో నాటు కోళ్ల పెంపకం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ పిఓ లక్ష్మి ణ్ ,పిఓబి అనిల్ కుమార్ ,ఫోల్ ఇండియా అధినేత జయహరి ,శ్వేత అర్జిత్ బినేష్ తేరి సంస్థ నుండి మనీష్, శివాంగి, చంద్రశేఖర్, మండల రైతుసంఘం అధ్యక్షులు బి.వెంకట య్య ,వెంకటప్ప, అశప్ప, సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## సమస్యలపై బిజెపి పోరాటం:ఈటల



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ప్రగల్భాలే తప్ప పాలన చేత కాక స్వల్ప కాలంలోనే ప్రజాగ్రహానికి గురైన తొలి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచి పోతారని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. మల్లాపూర్‌లోని విఎన్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ఎంపి ఈటల ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలతో ప్రజలను నమ్మించి సిఎంగా రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టగానే ఏ ఒక్క దాన్ని అమలు చేయలేక పోయారని విమర్శించారుపేదలకు అండగా ఉంటూ సమస్యలపై బిజెపి పోరాటం చేస్తుందని, తాను ఎంపిగా అన్ని వేళలా అందుబాటులో ఉంటూ మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానన్నారు. దేవసాని బాలచందర్ సభాధ్యక్షుడిగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వి ఎస్ఎస్‌ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డి, బిజెపి కన్వీనర్ ఎస్ మల్లారెడ్డి, పార్లమెంటు ప్రబావి గోలి మధుసుధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు పోతగాని గోపాల్ గౌడ్ రామ్ ప్రదీప్, జిల్లా సెక్రటరీ అంబంటి వెంకటాచలం, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి , చేతన, హరీష్, మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, హౌసింగ్ బోర్డ్ అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ నగర్‌లో హెల్త్ మేళా

ప్రజాపక్షం/ నిజాంపేట్ : మురికివాడల ప్రజలకు ఉచిత వైద్య సేవలు ఎంతో అవసరమని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పెద్దబాల్ అంజన్ గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ ఎన్‌టిఆర్ నగర్‌లో ఉచిత హెల్త్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంజన్ గౌడ్ వైద్య పరిక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా అంజన్ మాట్లాడుతూ మురికి వాడలలో నివసించే పేద ప్రజలకు ఇలాంటి వైద్య సేవలను నిరంతరం అందించాలని సూచించారు. వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# మూడో మ్యాచ్‌లో భారత్ ఘన విజయం..



## మహిళా టీ20 సిరీస్ సమం

చెన్నై: దక్షిణాఫ్రికా మహిళా జట్టుతో జరిగిన నిర్ణయాత్మక మూడో టీ20లో భారత్ ఘన విజయం సాధించింది. చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. వర్షం కారణంగా రెండో మ్యాచ్ రద్దవడంతో చెరో విజయంతో సిరీస్ 1–1 గా ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 17.1 ఓవర్లలో 84 పరుగులకు ఆలౌటయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా కేవలం 10.5 ఓవర్లలో వికెట్లు నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. స్మృతి మంధాన (54*; 40 బంతుల్లో 8x4,2x6) అర్ధ శతకంతో చెలరేగగా.. షెఫాలీ వర్మ (27*; 25 బంతుల్లో 3x4) అద్భుత సహకారం అందించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు భారత్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఓ వైపు పరుగులు కట్టడి చేస్తూనే కీలక వికెట్లను పడగొట్టారు. కెప్టెన్ ఓల్వార్డ్ (9) స్వల్ప స్కోరుకే వెనుదిరిగింది. తజ్మిన్ బ్రిట్స్ (20), మరిజన్నె (10), అన్నెక బోచ్ (17) ఫర్వాలేదనిపించారు. ఈ నలుగురూ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన వారంతా పెవిలియన్‌కు క్యూకట్టారు. ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. దీంతో తొలి మ్యాచ్‌లో విజృంభించిన దక్షిణాఫ్రికా కేవలం 84 పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది. భారత్ బౌలర్లలో పూజా వస్త్రాకర్ 4 వికెట్లు పడగొట్టగా.. రాధా యాదవ్ 3, అరుంధతి రెడ్డి, శ్రేయంక పాటిల్, దీప్తి శర్మ తలో వికెట్ తీశారు. ఈ పర్యటనలో మూడు వన్డేల సిరీస్, ఏకైక టెస్టులో సఫారీ జట్టును భారత్ చిత్తు చేసిన సంగతి తెలిసిందే.

# బుమ్రా, స్మృతి మందాన సరికొత్త చరిత్ర



టీమ్‌ఇండియా ప్రధాన పేసర్ జస్ప్రిత్ బుమ్రాకు ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. ఈ ఏడాది జూన్ నెలకుగానూ అతడు ఐసిసి మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికయ్యాడు. టీ20 ప్రపంచకప్ 2024 విజయంలో కీలకంగా వ్యవహరించినందుకుగానూ ఈ ఘనతను అందుకున్నాడు. మహిళా విభాగంలో భారత క్రికెటర్ స్మృతి మంధానకు ఈ అవార్డు దక్కింది. దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో అదరగొట్టినందుకు ఈ అవార్డ్ లభించింది. కాగా ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు ఇంట్రడ్యూస్ చేసిన తర్వాత ఒకే దేశానికి చెందిన పురుష, మహిళా క్రికెటర్లు ఒకే నెలలో విజేతలుగా నిలవడం ఇదే మొదటి సారి.

**ఎంతో సంతోషంగా ఉంది :** బుమ్రా మాట్లాడుతూ 'ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. అమెరికా వెస్టిండీస్‌లో గడిపిన సమయం మధుర జ్ఞాపకాలను ఇచ్చింది. ఇప్పుడు ఈ ప్రత్యేక అవార్డు కూడా దక్కింది. జట్టుగా మేము సంబరాలు చేసుకుంటున్న సమయంలోనే వ్యక్తిగతంగా నా ఖాతాలో ఈ గెలుపు చేరడం మరింత సంతోషంగా ఉంది' అని బుమ్రా పేర్కొన్నాడు. టీ20 ప్రపంచకప్ గెలవడం తన జీవితంలో మరచిపోలేని క్షణమని అన్నాడు. టీ20 ప్రపంచకప్ 2024లో ఎనిమిది మ్యాచులు ఆడిన బుమ్రా 4.17 ఎకానమీ రేటుతో 15 వికెట్లు తీశాడు. అఫ్గానిస్థాన్ పేసర్ ఫజల్ హక్ ఫారుకీ(17), టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీప్ సింగ్(17) తర్వాత అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు బుమ్రా. టీమ్‌ఇండియా ఛాంపియన్‌గా నిలవడంలో కీలకంగా వ్యవహరించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కూడా దక్కింది. ఈ విజయం ఇంకా మర్చిపోక ముందే ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు కూడా అందుకున్నాడు. రోహిత్‌పై గెలిచి ఈ ప్లేయర్ ఆఫ్ మంత్ అవార్డును ఓట్ల ద్వారా విజేతను నిర్ణయిస్తారన్న సంగతి తెలిసిందే. అయితే ఈ విభాగంలో బుమ్రాతో పాటు టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ, అఫ్గాన్ బ్యాటర్ రహ్మనుల్లా గుర్బాజ్ కూడా పోటీపడ్డారు. కానీ చివరికి జూన్ నెలకుగానూ విజేతగా నిలిచాడు బుమ్రా.

# చెస్ ఫ్రాంచైజీ సహ యజమానిగా అశ్విన్..

**విశ్వనాథన్ ఆనంద్ హర్షం**



క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ చెస్ ఫ్రాంచైజీకీ సహ యజమాని అవ్వడం పట్ల చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ హర్షం వ్యక్తంచేశాడు. టెక్ మహీంద్రా, ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ చెస్ లీగ్ రెండవ ఎడిషన్‌లో పాల్గొనే కొత్త జట్టైన అమెరికన్ గాంబిట్స్‌లో అశ్విన్ వాటాలను కొనుగోలు చేశాడు. 'చదరంగం ప్రపంచంలోకి ప్రవేశించిన మీ ఫ్రాంచైజీకి స్వాగతం. క్రికెట్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన మీరు అమెరికన్ చెస్ లీగ్‌లో అదే స్ఫూర్తిని నింపుతారని ఆశిస్తున్నాను'' అని విశ్వనాథ్ ఆనంద్ ఎక్స్ ఖాతాలో పంచుకున్నాడు. అక్టోబరు 3 నుంచి 12 వరకూ జరగనున్న రెండో ఎడిషన్ కోసం ఆరు ఫ్రాంచైజీలను సోమవారం ప్రకటించారు. ప్రముఖ వ్యాపారవేత్త ప్రచుర పీపీ వెంకట్ కె.నారాయణ, అశ్విన్ యాజమాన్యంలోని అమెరికన్ గాంబిట్స్ చింగారి టైటాన్స్ స్థానాన్ని భర్తీ చేస్తుంది. 'అమెరికన్ గాంబిట్స్‌ను చదరంగ ప్రపంచానికి పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. అచంచలమైన సంకల్పంతో మా జట్టును పునర్నిర్మించాలని అనుకుంటున్నాం. దీనికి సహ యజమానిగా ఉన్నందుకు సంతోషిస్తున్నాను'' అని అశ్విన్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు.



# పవన్ సినిమాలో అనసూయ

టాలీవుడ్ ప్రముఖ హీరో అలాగే ఏపీ డెప్యూటీ సీఎం అయినటువంటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇప్పుడు పలు చిత్రాలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమాలకి గత కొన్ని నెలలు నుంచి బ్రేక్ పడిన సంగతి కూడా తెలిసిందే. అయితే పవన్ ఇప్పుడు వరకు నటించిన చిత్రాల్లో ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ పవన్‌తో ఓ సినిమాలో నటించాల్సి ఉంది. అప్పట్లో అయితే పవన్ ఇండస్ట్రీ హిట్ అత్తారింటికి దారేది సినిమాలో అవకాశం ఆమె మిస్ చేసుకుంది అని కూడా టాక్ ఉంది. ఆ తర్వాత నుంచి వీరి కాంబినేషన్ లో సినిమా మిస్ అవుతూ వచ్చింది. అ యితే ఫైనల్‌గా ఇపుడు అనసూయ పవన్‌తో ఓ సినిమాలో నటించినట్టుగా ఆమె కన్ఫర్మ్ చేసింది. అయితే ఆమె పవన్ ఇప్పుడు చేస్తున్న మూడు సిని మాల్లో ఎందులో చేసింది అనేది ఇంకా రివీల్ చేయలేదు కానీ ఆమె ఆ సిని మా రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నాను అని కన్ఫర్మ్ చేసింది. మరి మొత్తానికి అయితే అప్పుడెప్పుడో మిస్ అయ్యిన అవకాశం ఇప్పుడు దక్కింది అని చెప్పాలి.

## ఓటిటి స్ట్రీమింగ్‌కు సిద్ధమైన 'రాజు యాదవ్'

బుల్లితెరపై తనదైన కామెడీతో మంచి గుర్తింపు పొందిన జబర్దస్త్ గెటప్ శ్రీను, వెండితెరపై కూడా నవ్వులు పూయిస్తూ వస్తున్నాడు. ఇప్పటికే పలు సినిమాల్లో ఆయన హీరో ఫ్రెండ్ క్యారెక్టర్లు చేసి ప్రేక్షకులను మెప్పించాడు. అయితే, గెటప్ శ్రీను ఇటీవల హీరోగా కూడా మారాడు. 'రాజు యాదవ్' అనే సినిమాతో ఆయన హీరోగా మారి ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. మే 24న థియేటర్లలో రిలీజ్ అయిన రాజు యాదవ్ మూవీ, ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో అనుకున్న స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. ఇక ఇప్పుడు ఈ సినిమా ఓటిటి స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ప్రముఖ ఓటిటి ప్లాట్ ఫామ్ ఆహాలో రాజు యాదవ్ మూవీ స్ట్రీమింగ్‌కు సిద్ధమయ్యింది. ఈ సినిమాను త్వరలోనే స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే స్ట్రీమింగ్ డేట్‌ను మాత్రం అనౌన్స్ చేయలేదు. కృష్ణమాచారి డైరెక్ట్ చేసిన ఈ సినిమాలో అంకిత కారత్ హీరోయిన్‌గా నటించింది. ఆనంద్ చక్రపాణి, రాకెట్ రాఘవ, మిర్చి హేమంత్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. హర్షవర్ధన్ రామేశ్వర్, సురేష్ బొబ్బిలి ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు.






## మోక్షజ్ఞ స్పెషల్ రోల్.. నిజమేనా

నందమూరి మోక్షజ్ఞ ఎంట్రీపై చాలా ఏళ్ల నుంచి బాలయ్య అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ మధ్య బాలకృష్ణ కూడా.. తన కొడుకు మోక్షజ్ఞ ఎంట్రీ ఈ ఏడాది ఉంటుందని చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు 'అఖండ 2' సినిమా షూటింగ్ ఎప్పుడు అంటూ బాలయ్య ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. మొత్తానికి మోక్షజ్ఞ ఎంట్రీ, 'అఖండ 2' షూటింగ్‌కి లింక్ కుదిరిందని టాక్. 'అఖండ 2' సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తి అయ్యింది. దర్శకుడు బోయపాటి శ్రీను, నందమూరి మోక్షజ్ఞ కోసం ఓ స్పెషల్ రోల్ రాశాడని.. సెకండ్ హాఫ్‌లో మోక్షజ్ఞ పాత్ర వస్తోందని తెలుస్తోంది. ఇప్పటికే, మోక్షజ్ఞ పై టెస్ట్ షూట్ కూడా చేశారని పుకార్లు వినిపిస్తున్నాయి. నందమూరి అభిమానులకు శుభవార్తే. ఇక కథ ప్రకారం.. సినిమా పూర్తిగా శైవత్వంపై సాగుతుందని.. హిందుత్వానికి ప్రతిరూపం దక్షిణ భారతదేశం అనే కోణంలో సీన్స్ ఉంటాయని తెలుస్తోంది. అలాగే..హిందూ దేవాలయాలకు సంబంధించిన లింక్స్‌తో పాటు దక్షిణ భారతదేశం గొప్పతనాన్ని కూడా ఈ సినిమాలో బాగా ఎలివేట్ చేస్తున్నారని తెలుస్తోంది. 'అఖండ 2' లో బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ కూడా ఓ కీలక పాత్రలో నటించబోతునట్లు తెలుస్తోంది.

## 'బృంద' వెబ్ సిరీస్‌తో వస్తున్న త్రిష..

స్టార్ హీరోయిన్ త్రిష ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. తమిళ, తెలుగు భాషల్లో స్టార్ హీరోల సరసన ఆమె నటిస్తోంది. ఇక తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వ ంభర మూవీలో త్రిష నటిస్తోంది. ఇక త్రిష నటించిన బృంద అనే తొలి వెబ్ సిరీస్ పై మేకర్స్ తాజాగా ఓ అప్డేట్ ఇచ్చారు. బృంద వెబ్ సిరీస్ ను ఆగస్టు 2 నుంచి స్ట్రీమింగ్ చేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ వెబ్ సిరీస్ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ గా రూపొందించారు. సూర్య మనోజ్ వంగల డైరెక్ట్ చేసిన ఈ వెబ్ సిరీస్ ను ప్రముఖ ఓటిటి ప్లాట్ ఫామ్ సోని లివ్ లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ వెబ్ సిరీస్ లో ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాష్, ఆమని, రవీంద్ర విజయ్, ఆనంద్ సామి, రాకేందు మౌళి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ను తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, మరాఠీ, బెంగాలీ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.



## నగరంలోని చెరువులకు జీవం పోద్దాం:

ఇవిడియం కమిషనర్ రంగనాథ్

ప్రజాపక్షం/హైదరాబాద్: నగరంలో అన్యాక్రాంతమయిన చెరువులను పునరుద్ధరణ కై పటిష్టమైన అడుగులు వేద్దామని ఇవిడియం కమిషనర్ రంగనాథ్ అధికారులకు పిలుపునిచ్చారు. ట్రై సిటీ పరిధిలోని రెవెన్యూ, జిఐఎస్ హబ్ టీమ్స్, ఇరిగేషన్ విభాగాలకు చెందిన అధికారులతో ఇవిడియం కమిషనర్ మంగళవారం బుద్ధభవన్ లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నగరంలో గతంలో వున్న చెరువులు ఎన్ని వున్నాయి.. ప్రస్తుతం ఉన్న చెరువుల వివరాలను ఇరిగేషన్ అధికారులు తో అడిగి తెలుసు కున్నరు. ప్రస్తుతం ఉన్న చెరువులవాటి బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ పరిధితో పాటు చెరువుల పునరుద్ధరణ, వాటి రక్షణ కోసం తీసుకున్న , తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ అధికారులతో ఈ సమావేశంలో చర్చించారు.అనంతరం సిటీ ప్లానింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో క మిషనర్ సమావేశామయ్యారు. ఈ సమావేశంలో చెరువులను బహుళ అ ంతస్తులు నిర్మాణాలకు సంభందించి అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శి ంచి చెరువులను ఆక్రమిస్తూ ఈ భవన నిర్మాణం జరుగుతుందో లేదా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీంచిన అనంతరం భవన నిర్మాణం కు అనుమతులు మంజూరు చేయాలనీ కమిషనర్ అధికారులకు సూచించారు.

## గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో మంగళవారం కమిషనర్ ఆమ్రపాలి కాట విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి వద్ద చేపడుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించి భూ సేకరణను వేగవంతం చేయాలని, అందుకోసం సేకరించాల్సిన ఆస్తుల యజమానులకు టిడిఆర్ రూపంలో అందజేసే ప్రక్రియను ముమ్మరం చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి కోర్టు కేసులు ఏమున్నా వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఐఐటి జంక్షన్, లింగంపల్లి ఆర్‌యుబి, మజీద్ బండ పరిసరాలను కమిషనర్ ఆమ్రపాలి కాట తనిఖీ చేశారు. జంక్షన్‌ల అభివృద్ధి, ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు పలు విభాగాలతో సమన్వయం చేసుకుంటూ జంక్షన్‌లను మరింత సుందరీకరించాలన్నారు. కొత్త ప్రాజెక్టులకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ సూచించారు. మసీద్ బండ గచ్చిబౌలి రోడ్డు వరకు విస్తరణ కోసం చేపట్టిన పనులలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐటి ప్రాంతంలో సుందరికరణ పనులు, రహదారి విస్తరణ పనులు వేగంగా జరగాలన్నారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్( ప్రాజెక్ట్స్ ) దేవానంద్, తదితరులు ఉన్నారు.

## 14 ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేశాం

సుప్రీంకు వెల్లడించిన పతంజలి సంస్థ

న్యూఢిల్లీ : తయారీ లైసెన్స్ రద్దు అయిన 14 రకాల ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేశామని పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆ ఉత్పత్తులను వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా ఉన్న తమ ఫ్రాంచైజీ స్టోర్లకు సూచించామని తెలిపింది. అలాగే వాటికి సంబంధించిన ప్రకటనలను ఉపసంహరించుకోవాలని మీడియా సంస్థలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టు విచారణను ఎదుర్కొంటోంది. దానిలో భాగంగా తప్పుదోవ పట్టించేలా వాణిజ్య ప్రకటనలు ఇచ్చారని నిర్ధరణ అయిన నేపథ్యంలో పతంజలిపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సంస్థకు చెందిన 14 రకాల ఉత్పత్తులు, అనుబంధ విభాగం దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్సును రద్దు చేసింది. ఈ క్రమంలోనే ఆయుర్వేద సంస్థ నుంచి స్పందన వచ్చింది.

# యువతను నిరుద్యోగులుగా చేయడమే మోదీ ప్రభుత్వ ఏకైక లక్ష్యం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ : నిరుద్యోగ సమస్యపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. యువతకు ఉపాధి లేకుండా చేయడమే మోదీ ప్రభుత్వానికి ఉన్న ఏకైక లక్ష్యమని మండిపడ్డారు. నిరుద్యోగంపై సిటీ గ్రూప్ ఇచ్చిన స్వతంత్ర ఆర్థిక నివేదికలను మోదీ ప్రభుత్వం ఖండిస్తూ ఉండవచ్చు కానీ.. ప్రభుత్వ డేటాను ఎలా తిరస్కరిస్తుందని ఖర్గే ప్రశ్నించారు. ?ఈ మేరకు వివిధ నివేదికలను ఉటంకిస్తూ ఖర్గే 'ఎక్స్'లో సుదీర్ఘమైన పోస్టు చేశారు. గత పదేళ్లలో కోట్లాది మంది యువత కలలు గల్లంతయ్యేందుకు మోదీ ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందన్నది వాస్తవం' అని ఆయన ఆరోపించారు. తాజా ప్రభుత్వ డేటా ప్రభుత్వ వాదనలను పంక్చర్ చేస్తుందని ఖర్గే అన్నారు. ఎన్ఎస్ఎస్ఓ (నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్) అన్‌ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ వార్షిక సర్వే ప్రకారం తయారీ రంగంలో, 2015–2023 మధ్య ఏడేళ్లలో అన్‌ఇన్‌కార్పొరేటెడ్ యూనిట్లలో 54 లక్షల ఉద్యోగాలు గల్లంతయ్యాయని ఖర్గే తెలిపారు. 2010–11లో భారతదేశం అంతటా 10.8 కోట్ల మంది ఉద్యోగులు ఇన్‌కార్పొరేటెడ్, వ్యవసాయేతర ఎంటర్‌ప్రైజెస్‌లో పనిచేశారని, ఈ సంఖ్య 2022–23లో 10.96 కోట్లకు చేరుకుందని, 12 సంవత్సరాలలో కేవలం 16 లక్షల ఉద్యోగులు మాత్రమే పెరిగారని ఖర్గే ఎత్తి చూపారు. తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్‌ఎఫ్ఎస్)ను ఖర్గే ఉదహరిస్తూ, పట్టణ నిరుద్యోగిత రేటు 6.7 శాతం (క్యూ4, ఎఫ్‌వై24)గా ఉందన్నారు. ఇపిఎఫ్ఓ డేటాను చూపిస్తూ మోదీ ప్రభుత్వం సంఘటిత రంగంలో ఉపాధి కల్పనకు గండి కొట్టిందని, అయితే ఆ డేటా నిజమని తాము భావించినప్పటికీ, 2023లో కొత్త ఉద్యోగాలలో 10 శాతం క్షీణత కనిపించిందన్నారు. ప్రభుత్వ డేటాను విశ్లేషించిన తర్వాత ఐఐఎం లక్నో నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగం పెరుగుదల, విద్యావంతుల్లో అధిక నిరుద్యోగం, శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉందని ఖర్గే చెప్పారు. స్వతంత్ర ఆర్థిక నివేదికలను మోదీ ప్రభుత్వం తిరస్కరిస్తున్నదన్నారు. సిఎంఐఇ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) ప్రకారం, దేశంలో ప్రస్తుత నిరుద్యోగిత రేటు 9.2 శాతానికి చేరుకుందని తెలిపారు. 'ఐఎల్ఓ నివేదిక ప్రకారం, దేశంలోని నిరుద్యోగుల్లో 83% మంది యువత ఉన్నారు. ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం, 2012– 2019 మధ్య సుమారు 7 కోట్ల మంది యువత శ్రామిక శక్తిలో చేరారు, కానీ ఉపాధిలో వృద్ధి సున్నా అని, కేవలం 0.01 శాతం మాత్రమే అని ఖర్గే దుయ్యబట్టారు. దేశంలో 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్‌లలో 42.3 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 2023 నివేదికను కూడా ఖర్గే ప్రస్తావించారు. సిటీ గ్రూప్ తాజా నివేదిక ప్రకారం, భారతదేశానికి ఏటా 1.2 కోట్ల ఉద్యోగాలు అవసరం. 7 శాతం వృద్ధి కూడా మన యువతకు తగినంత ఉద్యోగాలను సృష్టించలేకపోయింది. మోదీ ప్రభుత్వం దేశం సగటున 5.8 శాతం మాత్రమే జిడిపి వృద్ధిసాధించింది. ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగం, స్వయం ఉపాధి లేదా అసంఘటిత రంగం కావచ్చు... యువతను నిరుద్యోగులుగా ఉంచడమే మోదీ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా పెట్టుకుందని ఖర్గే విమర్శించారు.

# డ్రగ్స్‌పై మరింత నిఘా పెంచండి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్



ప్రజాపక్షం/హైదరాబాద్: డ్రగ్స్ వినియోగంపై గట్టి నిఘా పెట్టి అరికట్టడానికి ఎక్సైజ్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ మరింతగా కృషి చేయాలని రంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ పి.దాశరథ్ అదేశించారు. మంగళవారం ఎక్సైజ్ భవన్ సమావేశమందిరంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్, ఎన్ఫోర్స్ మెంట్ యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదారాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందాని, ఈ మేరకు హైదారాబాద్లో తెలంగాణ నాబ్‌తో పాటు ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహిస్తు డ్రగ్స్,గంజాయిని పట్టుకుంటున్నారని, మరింతగా నిఘా పెట్టి డ్రగ్స్ లేకుండా చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి తమవంతుగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రంగారెడ్డి ఎక్సైజ్ పరిధిలో ఉన్న అవుటర్ రింగ్ రోడ్డు వెంట నిఘ పెంచాలని, గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు, రవాణ, వినియోగంపై నిఘా పెట్టాలని అదేశించారు. ప్రధానంగా హయత్‌నగర్, రామోజీ ఫిలిం సిటీ రోడ్డు సమీపంలో, ఘట్కేసర్ పరిసరాల్లో ఎక్కువగా నిఘా పెట్టాలని సూచించారు. ప్రస్తుతం చట్టాల్లో వచ్చిన మార్పులపై అవగాహన పెంచుకోవాలని, కొత్తగా నమోదు చేసే కేసులపై చట్టంలోని నిబంధనలను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కిషన్. ఎక్సైజ్ సూపరిండెంట్లు ఎన్.ఉజ్వల రెడ్డి, ఎస్.కృష్ణప్రియ ,ఎస్కే పతియాజోద్దీన్, కె. నవీన్ కుమార్ , కె.విజయ భాసర్ లతోపాటు సీఐలు, ఎస్ ఐలు, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు, సిబ్బంది పాల్గన్నారు.

# హామీల అమలుకు మరిన్ని ఉద్యమాలు: బిజెపి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు, హామీలు అమలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, ప్రజలకు న్యాయం జరిగేలా పోరాటం చేయాలని బిజెపి నిర్ణయించింది. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల12వ తేదీన జరిగే బిజెపి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో ఎజెండాకు సంబంధించి చర్చ విస్తృతంగా చేపట్టారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి సమావేశం నిర్ణయాలను మీడియాకు వివరించారు. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యమాలను మరింత ఉధృతంచేయనున్నట్లు ఆయనవెల్లడించారు. ఇందులో భాగంగా బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ కార్యాలయాల ముందు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు తెలిపారు.రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు కూలీలలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు, ఫసల్ బీమా యోజన అమలు చేయకపోవడం, వడ్లకు క్వింటాలుకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పికమిటీల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. ఈనెల 12వ తేదీన శంషాబాద్ లోని మల్లికా కన్వెన్షన్ లో రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గసభ్యులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, మాజీ సభ్యులు, కార్పోరేటర్లు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో నిర్వహించనున్న నిర్వహించనున్న రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

# గాంధీజీ చెప్పిన మాటలు మరువొద్దు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: నూతన సాంకేతిక పరిణామాలు సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని, అదే సమయంలో మానవాళికి కొత్త సవాళ్లను కూడా విసురుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 13వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సైన్స్ వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో, అంతే స్థాయిలో దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. కొత్త సాంకేతికత వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. అదే సమయంలో మానవాళికి అది సరికొత్త సవాళ్లను విసురుతుంది. ఉదాహరణకు క్రిస్పార్‌క్యాస్9 సాంకేతికత వల్ల మానవుల జన్యువుల్లో మార్పులు చేయడం చాలా సులభమైంది. ఎన్నో రకాల వ్యాధులను నయం చేసేందుకు సహకరించింది. అయితే, ఈ సాంకేతికత సామాజికంగా ఎన్నో రకాల సమస్యలు సృష్టించింది. అంతేకాకుండా ఇటీవల బాగా ప్రాచుర్యం పొందిన కృత్రిమ మేధ వల్ల డీప్ ఫేక్ సమస్య ఎదురైంది. సాంకేతికతను సక్రమ మార్గంలో ఉపయోగించకపోతే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో ఊహించలేం' అని ద్రౌపది ముర్ము అన్నారు. సైన్స్ హేతుబద్ధతకు సంప్రదాయ విలువలను జోడిస్తూ ఎన్ఐఎస్ఇఆర్ ముందుకు వెళ్తుండటం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. తమ వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా, సమాజసేవ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. 'జాతిపిత మహాత్మాగాంధీ ఏడు సామాజిక రుగ్మతలు ఉంటాయని విశ్వసించేవారు. అందులో 'దయలేని సైన్స్' కూడా ఒకటి. జాలి, దయ, మానవత్వం గురించి ఆలోచించకుండా సైన్స్‌ని ప్రచారం చేయడం మహా పాపం. ప్రతి ఒక్కరూ దీనిని గుర్తుంచుకోవాలి' అని హితవు పలికారు. శాస్త్రపరిజ్ఞానంపై పరిశోధనలు చేసేందుకు చాలా ఓర్పు సహనం అవసరమని, ఫలితం రాబట్టేందుకు చాలా కాలం వేచి చూడాల్సి రావొచ్చని ముర్ము అన్నారు. అందువల్ల ఎప్పుడూ నిరుత్సాహ పడకుండా లక్ష్యం దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## నీట్ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

న్యూఢిల్లీ : దేశంలో పెను దుమారం సృష్టించిన నీట్ యుజి ప్రశ్నపత్రం లీక్ కేసు దర్యాప్తు చేస్తోన్న సిబిఐ మరో ఇద్దరిని అరెస్టు చేసింది. బీహార్‌లోని పాట్నాకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకోగా.. వీరిలో ఒకరు నీట్ అభ్యర్థి కావడం గమనార్హం. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు చేసిన వారి సంఖ్య 11కి చేరినట్లు సిబిఐ అధికారులు మంగళవారం వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న వారిలో నలందకు చెందిన నీట్‌యుజి అభ్యర్థి సన్నీతో పాటు రంజిత్ కుమార్ అనే విద్యార్థి తండ్రి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు పేపర్ లీక్ కేసులో బిహార్‌లో ఎనిమిది మంది, అ లాతూర్, గోధ్రాకు చెందిన ఒక్కొక్కరు, కుట్ర చేసినట్లు తేలడంతో దేహ్రాదూన్ నుంచి ఒకరిని అరెస్టు చేసినట్లు సిబిఐ పేర్కొంది.